RNI.No. APTEL/2014/57702 ESTD: 1999




www.voodayam.com

# వృదయం




గుంటూరు | 06-07-2026 సోమవారం | సంపుటి : 13 | సంచిక : 114 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

## మెట్రో ఫేజ్-2కు
# లైన్ క్లియర్
### కేంద్ర మంత్రులను కోరిన సీఎం రేవంత్



**హైదరాబాద్, జూలై 5 (వుదయం) :**

మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణలో నెలకొన్న జాప్యంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కోరుతూ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్ లాల్ ఖట్టర్‌లకు ముఖ్యమంత్రి వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23, 24 తేదీల్లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

**అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు**

మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన అధ్యయన బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన 'ఎస్‌బీఐ క్యాప్స్'కు అప్పగించాలని సీఎం కోరారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను, షరతులను వెంటనే ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో ప్రాజెక్టు సమర్థవంతమైన నిర్వహణకు ఈ నిర్ణయం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

**జాప్యంతో పెరుగుతున్న వ్యయం**

మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండో దశ విస్తరణకు కేంద్రం నుండి లభించాల్సిన అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని సీఎం లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు.

**నిర్వహణ ఇబ్బందులు**

అనుమతుల ఆలస్యం వల్ల మెట్రో ఫేజ్ 1 నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అనిశ్చితి నెలకొందని ఆయన పేర్కొన్నారు.

నిధుల సమీకరణలో ఆటంకాలు: రెండో దశ డీపీఆర్ (DPR) ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు మందకొడిగా సాగుతున్నాయని, దీనివల్ల ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రాజెక్టు సకాలంలో పూర్తయ్యేలా కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## ఖమేనీ అంతిమ వీడ్కోలు
### తండ్రి పార్థివ దేహం వద్ద కనిపించని మొజ్తబా..



**టెహ్రాన్:**

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ భౌతిక కాయానికి నివాళులర్పించేందుకు టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయానికి ప్రజలు పోటెత్తారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులు, ప్రముఖులు తరలివచ్చి తమ ఆరాధ్య నేతకు కడసారి వీడ్కోలు పలుకుతున్నారు. అయితే, ఈ అత్యంత కీలకమైన కార్యక్రమంలో ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఎవరు హాజరయ్యారు?

అధికారిక మీడియా కథనాల ప్రకారం, ప్రార్థనల సమయంలో అలీ ఖమేనీ శవపేటిక వద్ద ఆయన కుమారులు మొస్తఫా, మెయిసమ్, మసౌద్ ఖమేనీలు మాత్రమే కనిపించారు. వీరితో పాటు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ అహ్మద్ వాహిదీ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరుపై కొనసాగుతున్న ఉత్కంఠ

సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మొజ్తబా ఖమేనీ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వారం క్రితం ఆయన సతీమణి అంత్యక్రియల్లో కూడా మొజ్తబా కనిపించలేదు. తాజాగా తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరుకాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే, భద్రతా పరమైన ముప్పు పొంచి ఉన్నందునే ఆయన ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని ఇరాన్ ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కుటుంబంలో విషాదాల విషయానికి వస్తే, అలీ ఖమేనీకి ఉన్న ఇద్దరు కుమార్తెలలో ఒకరు గత ఫిబ్రవరి 28న జరిగిన దాడుల్లో మరణించడం గమనార్హం.

## వృథాగా పోతున్న నీరు..
# కాళేశ్వరంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- స్పందించకుంటే 60 వేల మందితో ముట్టడిస్తాం!
- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కేటీఆర్ పర్యటన
- వారం రోజులు కేసీఆర్‌కు అప్పగిస్తే చాలు

**భూపాలపల్లి, జూలై 5 (వుదయం)**



కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా కిందికి పోతోందని బీఆర్ఎస్ (BRS) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బీడు భూములకు నీరు ఇవ్వాలని కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సందర్శించింది. అంతకు ముందు పలుచోట్ల కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డగించడంతో వారితో బీఆర్ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. పంప్‌హౌస్‌ను పరిశీలించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

స్పందించకపోతే 60 వేల మందితో ముట్టడిస్తాం

"ఎన్నో అడ్డంకులు దాటుకుని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వచ్చాం. రాజకీయంగా విమర్శించడానికి ఇక్కడికి రాలేదు. కేసీఆర్ నాలుగేళ్లలో 141 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేశారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వొచ్చు. వర్షం పడకపోయినా కన్నెపల్లి వద్ద నీరు ఉంటుంది. కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టును వారం రోజులు అప్పగిస్తే తెలంగాణ మొత్తానికి నీరు అందిస్తారు.

కన్నెపల్లికి రైతులు వచ్చి చూసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి. కేసీఆర్ సీఎంగా ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా? సాగునీటి కోసమే కాదు.. హైదరాబాద్‌లో తాగునీటికి కూడా ఇబ్బంది ఉంది. అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుదాం. ప్రభుత్వం స్పందించకపోతే 60వేల మందితో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి పంప్‌లను ఆన్ చేస్తాం.

## రూ.1.81 లక్షల కోట్ల నష్టం

**హైదరాబాద్, జూలై 5 (వుదయం)**



గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టుల నిర్మాణం రైతుల కోసం కాదని, కేవలం కమీషన్ల కోసమే జరిగిందని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, వైఫల్యాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.81 లక్షల కోట్లు వృథా చేసిందని ఆయన ఆరోపించారు.

"కట్టేది ఒకరు.. కూలేది ఒకటి.. డ్రామాలు ఇంకొకరివి"

కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేసి, నిర్మించి, చివరికి కూల్చుకున్న ఘనత బీఆర్ఎస్‌దేనని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నేడు పనికిరాకుండా పోవడానికి నాటి ప్రభుత్వ తప్పిదాలే కారణమని ఆయన స్పష్టం చేశారు.

నిపుణుల హెచ్చరికలు: ఈ మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) ఇప్పటికే స్పష్టంగా చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఫౌండేషన్‌లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని, నీటిని నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోవడమే కాకుండా, భద్రాచలం వరకు భారీగా గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందని ఇంజినీర్లు హెచ్చరించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు.

కక్కుర్తి వల్లే ప్రాజెక్టు మార్పు

"ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయన్న దురాశతోనే తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాక, కేవలం కమీషన్ల కోసం దానిని రీడిజైన్ చేశారని, దీని వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన మండిపడ్డారు. నాడే కాగ్ (CAG) హెచ్చరించినట్లుగా, కొత్తగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.1.20 లక్షల కోట్లు అవసరమని, నేడు రాష్ట్రం ఆ ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్



**పాట్నా:**

ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్త గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ (పీకే), ఇక నేరుగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. తాను స్థాపించిన 'జన్ సురాజ్' పార్టీ తరపున ఆయన బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతీ అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 30న జరగనున్న ఈ ఉప ఎన్నిక, ప్రశాంత్ కిశోర్ రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎందుకు ఈ ఉప ఎన్నిక?

గత ఎన్నికల్లో బంకీపూర్ స్థానం నుండి గెలిచిన బీజేపీ నేత నితిన్ నబీన్, ఇటీవల రాజ్యసభకు ఎన్నికవ్వడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానం ఖాళీ కావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం భాజపాకు కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో అభ్యర్థిని ఖరారు చేసేందుకు కాషాయ దళం కసరత్తు చేస్తోంది.

గత ఓటమి నుంచి గుణపాఠం?

రాజకీయ పార్టీని స్థాపించిన తర్వాత గత ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీకి చేదు అనుభవం ఎదురైంది. బిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాల్లో 238 చోట్ల పోటీ చేసినప్పటికీ, ఆ పార్టీ అభ్యర్థులు కనీసం ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. ఆ ఘోర పరాజయం తర్వాత ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం కూడా పాటించారు. అయితే, ఇప్పుడు తానే స్వయంగా రంగంలోకి దిగుతుండటంతో, తన వ్యూహాలతో ప్రజలను ఏమేరకు ఆకట్టుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, జులై 6న నోటిఫికేషన్ విడుదల కానుంది. జులై 30న పోలింగ్ నిర్వహించి, ఆగస్టు 3న ఫలితాలను వెల్లడిస్తారు. గత ఎన్నికల్లో చతికిలబడిన పీకేకు, ఈ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మక పోరుగా మారనుంది.






# దమ్ముంటే కన్నెపల్లి రండి నీళ్లు చూపిస్తం

- పోలీసులతో అడ్డుకోవడం సిగ్గుమాలిన చర్యనే
- కాళేశ్వరం ప్రాజెక్టును అబాసుపాలు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం
- నీళ్లు లేవని ఎత్తరాదని అనడం మంత్రుల అవివేకానికి నిదర్శనం
- కేటీఆర్ కన్నెపల్లి సందర్శనతోనైనా కాంగ్రెస్ కళ్లు తెరువాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**జయశంకర్ భూపాలపల్లి, జులై 05(వుదయం జిల్లా ప్రతినిధి):**

కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు లేవని ఎత్తిపోయరాదని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు దమ్ముంటే చీము నెత్తురుఉంటే కన్నెపల్లి పంపుహౌజ్‌కు రావాలని, ఎన్ని నీళ్లు ఉన్నాయో చూపిస్తామంటూ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్ సవాల్ విసిరారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపుహౌజ్ సందర్శన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపుహౌజ్ సందర్శన చేపట్టితే అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారని, మమ్మల్ని పోలీసులు అడ్డుకుంటున్నారని చెప్తే పోలీసులతో మాకేంటని మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కన్నెపల్లి పంపుహౌజ్‌లో నీళ్లు ఉన్నాయని, వాటిని కేటీఆర్ చూపిస్తే గ్రామాల్లోకి మమ్మల్ని రానివ్వరనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అడ్డుకున్నారని, అయినా పంపుహౌజ్‌వద్దకు ఐదువేల మందితో వచ్చామని ఆయన వివరించారు. ఒకప్పుడు నక్సలైట్ల మీటింగ్‌కు వెళ్లకుండా అడ్డుకున్న దానికంటే ఎక్కువగా చేశారని, నీళ్లు లేవు, ఎత్తిపోయరాదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, ఆయన కళ్లుండి చూడలేని కబోదిలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మంత్రివర్గం సైతం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో చాలెంజ్ చేసి పోలీసులను అడ్డుపెట్టి ఆపారని గుర్తు చేశారు. చిన్న చిన్న సభలకు హెలీ కాప్టర్‌లో వెళ్లి వచ్చే సీఎం, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌లు ఇక్కడకు రావాలని, ఎప్పుడు వస్తరో చెప్తే అప్పటి వరకు ఇక్కడే ఉండి నీళ్లు ఎందుకు ఎత్తిపోయరాదో కేటీఆర్ చూపిస్తారంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మాట్లాడటం సిగ్గు చేటు అని, ఆనాడు భూగర్భజలాలు పెరిగి రైతులకు ఎంతో ఉపయోగంగామారిందని, ఈనాడు మూడు వందల ఫీట్లకు పోయినా నీళ్లు లేవని ఆయన వివరించారు. మేడిగడ్డలో చిన్న మరమ్మత్తు ఉంటే కాపర్ డ్యాం కట్టి అయినా నీళ్లు అపవచ్చు కదా అయినా ప్రభుత్వం ఆదిశగా ముందుకు సాగడం లేదన్నారు. పూర్వం చెరువు మత్తడి తెగితే ఇసుక బస్తాలు వేసే వారని అలా కూడా చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టను బదనాం చేయాలనే కాంగ్రెస్ కంకణం కట్టుకుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా పంటలు పండి నాయంటున్నారని, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడి నుంచి ఎక్కడి వరకే తెలియకపోవడం విడ్డూరమన్నారు. కాళేశ్వరం నుంచి కొండపోచమ్మ వరకు కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని విషయాన్ని గుర్తించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి, యావత్తు రైతులను కాపాడటానికి కేటీఆర్ కన్నెపల్లి సందర్శన చేపట్టారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరువాలని ఆయన ఆకాంక్షించారు.



# భక్తజన సంద్రం.. నందిన్నె!

- వైభవంగా ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- గ్రామాభివృద్ధికి ఐక్యతే మూలస్తంభం'
- గుడి, బడి సమాజానికి రెండు కళ్లు: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- ఐక్యమత్యంతోనే పల్లెల ప్రగతి.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శాసనసభ్యులు

**గద్వాల, జూలై 05 (వుదయం బ్యూరో):**

కె.టి.దొడ్డి మండలం నందిన్నె గ్రామం భక్తి సాగరమైంది. శతాబ్దాల నాటి సంస్కృతికి ప్రతీకగా, ఆధ్యాత్మిక వైభవానికి వేదికగా నిలిచే శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ, నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల సమ్మేళనం నడుమ గ్రామంలో ఆధ్యాత్మిక తరంగాలు వ్యక్తమయ్యాయి. ఈ చారిత్రాత్మక ఘట్టానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారి కృపాకటాక్షాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదోక్తంగా క్రతువు.. జనసందోహం ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ప్రారభించారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రముఖులు ప్రకాష్‌రావు నివాసానికి విచ్చేసిన పీఠాధిపతిని ఎమ్మెల్యే దర్శించుకుని, పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు.సంస్కృతికి గుడి.. భవిష్యత్తుకు బడి:మానవీయ విలువలు, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు గుడి ఎంత ముఖ్యమో.. రేపటి తరాన్ని తీర్చిదిద్దేందుకు బడి అంతకంటే ముఖ్యం. పల్లెల వికాసంలో ఈ రెండూ సమాన ప్రాధాన్యం కలిగి ఉండాలి.— బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే ఐక్యతతోనే గ్రామాల పునర్నిర్మాణం అనంతరం జరిగిన సభా ప్రాంగణంలో ఎమ్మెల్యే గంభీరంగా ప్రసంగించారు. దేవాలయాలు కేవలం పూజా కేంద్రాలు మాత్రమే కావని, అవి సమాజంలో నైతిక విలువలను పెంపొందించి, సామాజిక సామరస్యాన్ని, ఐక్యతను పెంపొందించే దివ్య స్థానాలని కొనియాడారు. భేదాభిప్రాయాలను పక్కనబెట్టి, గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో అడుగులు వేసినప్పుడే నవసమాజ నిర్మాణం, గ్రామాభివృద్ధి సాధ్యమవుతా యని పిలుపునిచ్చారు. అన్నదాతలు సాంప్రదాయ వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ వైపు కూడా దృష్టిసారించి ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షిం చారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆంజనేయస్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. పల్లెలో పండుగ వాతావరణంమహోత్సవాన్ని పురస్కరించుకుని నందిన్నె గ్రామంలో పండుగ శోభ ఉట్టి పడింది. తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణ లతో వీధులన్నీ శోభాయమానంగా మారా యి. స్వామివారి దర్శనార్థం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. ఈ మహాత్కార్యంలో వ్యవసాయ మార్కె ట్ కమిటీ చైర్మన్ హనుమంతు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ప్రముఖ నాయకులు ఉరుకుందు, మైలగడ్డ చంద్రశేఖర్, రంగారెడ్డి, వెంకటేష్,మహాదేవ్, వీరేష్, రంగస్వామి, స్థానిక ప్రజాప్రతిని ధులు, వివిధ రాజకీయ పార్టీల శ్రేణులు, గ్రామ పెద్దలు మరియు వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**నారాయణపేట జూలై 5 (వుదయం ప్రతినిధి):**

నారాయణపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మార్కెట్ లైన్ పదోతరగతి 20012002 కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం శాసన్ పల్లి రోడ్డు లక్ష్మి బంకెట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థిని, విద్యార్థులు ఒకరికొకరు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అంతకుముందు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జ్ఞాపిక, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2001 2022 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 25 సంవత్సరాలు గడిచిన చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, మధుకర్, బస్వరాజ్, దత్తు రావు, గంగాధర్, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద మృతి.. కేసు నమోదు

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామ శివారులో ఎల్లమ్మ గుడి సమీపంలో గ్రామానికి చెందిన దొంతరాబోయిన కనకరాజు (38) ఆదివారం మృతదేహంగా కనిపించడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా, మృతుడి నోటి వద్ద వాంతులు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గంగపుత్రుల సేవలు అభినందనీయం



- చంద్రుపట్ల సునీల్ రెడ్డి
- బెస్తపల్లిలో గంగపుత్రులు, సర్పంచ్ అరిపెల్లి శ్రీనివాస్‌కు ఘన సన్మానం

**మంథని , జూలై 5 :**

ఇటీవల మంథని గోదావరి నదిలో గల్లంతై మృతి చెందిన కొమురయ్య మృతదేహాన్ని తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించిన గంగపుత్రుల సేవలను కొనియాడుతూ, మంథని మండలం బెస్తపల్లి గ్రామంలో గంగపుత్రులను, గ్రామ సర్పంచ్ అరిపెల్లి శ్రీనివాస్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రమాద సమయంలో ఏమాత్రం వెనుకాడకుండా మానవత్వంతో స్పందించి సేవలందించిన గంగపుత్రులు సమాజానికి ఆదర్శప్రాయులని కొనియాడారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రజల ప్రాణాల కోసం నిరంతరం సేవలందిస్తున్న వారి సేవాభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి సేవలను ప్రభుత్వం, సమాజం గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంథని మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, కొండ్రు లక్ష్మణ్, వార్డు సభ్యుడు కంచు మల్లేష్, తోట్ల రాజు, బొరె తిరుపతి, బొరె రాజేశం, ధర్మాజీ రాజేందర్, మహేష్, సందీప్, గుమ్మడి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడే వారికి చేయూత అందిస్తా

- మీ కష్టానికి తోడుగా నా వంతు ఉడుతా భక్తిగా సహాయం
- కష్టపడి వ్యాపారం చేసుకొనే వారికి ఎల్లప్పుడూ నా ప్రోత్సాహం ఉంటుంది
- టి స్టాల్ ఒక వ్యాపారమే కాదు కుటుంబానికి జీవనాధారం
- నియోజకవర్గంలో 72 లక్షల విలువ గల 91 టి స్టాల్స్ ను పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**వుదయం, సిద్దిపేట :**

కష్టపడి పని చేసుకొనే వారికి ఎల్లప్పుడూ నా సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం ఉంటుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం లో హోటల్స్ నడుపుతూ ఉపాధి పొందుతున్న వారికి మరింత ఊతం ఇచ్చేందుకు తన వంతు సహాయంగా సిద్దిపేట నియోజకవర్గంలో టి స్టాల్స్ పంపిణి చేశారు. నెక్ (NECC) వారి సహకారంతో సిద్దిపేట నియోజకవర్గంలోని రూరల్ 5 మండలాలో టి స్టాల్ పంపిణి చేసినట్లు చెప్పారు.ఈ ఒక్కో టి స్టాల్ 80వేల రూపాయల విలువ గల స్టాల్ మొత్తం 91 టి స్టాల్స్ కు 72 లక్షల రూపాయల స్టాల్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు మీ కష్టానికి నా వంతుగా తోడుగా ఉడుతా భక్తి గా ఈ స్టాల్స్ అందిస్తున్నట్లు చెప్పారు. కొంతమంది బండి మీద మీరు హోటల్ పెట్టుకొని, కొంతమంది రోడ్డు మీద పెట్టుకొని ఉండే వాళ్లకు స్థాల్ ఉండాలనే ఉద్దేశ్యం తో మరింత ఊతం అందించే విధంగా సహకారం ఇస్తున్నట్లు చెప్పారు. కష్ట పడే వారికీ చేయూత, ప్రోత్సాహం అందించే విషయంలో నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. టి స్టాల్ వ్యాపారమే కాదు, మీ కాళ్ల మీద మీరు నిలబడి మీ కుటుంబానికి జీవనదారమని చెప్పారు. కష్టపడి పని చేసే వారికి ఆత్మవిశ్వాసాన్ని పెంచే మార్గమని, నిజాయితీగా చేసే వ్యాపారం విజయానికి పునాది అవుతుందన్నారు. మీ వ్యాపారం మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 91 స్టాల్స్ అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ శిబిరం

- ఎంపీ రఘునందన్ సహకారంతో

**నర్సాపూర్ ,జూలై 5 (వుదయం) :**

మహిళలకు ఎక్కువగా గర్భసంచి క్యాన్సర్ వస్తున్న నేపథ్యంలో ప్రథమ దశలోనే తెలుసుకోవాలి ఉద్దేశంతోమెదక్ ఎంపీ రఘునందన్‌సౌజన్యంతో శిశిర ఆస్పటల్ వారి సౌజన్యంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత గర్భాదయ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు స్కానింగ్ ఆసుపత్రికి వచ్చారు డాక్టర్ సింధు మాధవనేని స్కానింగ్ నిర్వహించి వారికి తగిన సూచనలకు ఇచ్చింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది బిజెపి జిల్లా అధ్యక్షులు వాళ్ళ మల్లేష్ గౌడ్ కౌన్సిలర్లు బిజెపి మండల అధ్యక్షులు నగేష్ తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి

- నిరంతర పర్యవేక్షణతో రోజువారీ లక్ష్యాలను సాధించాలి
- సమీక్షా సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్

**సిద్ధిపేట, జూలై 04 (వుదయం బ్యూరో)**



జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీలను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం సిద్ధిపేట కలెక్టరేట్‌లో సీఎంఆర్ డెలివరీలు మరియు గోదాముల్లో స్థల లభ్యత (Space) అంశాలపై కలెక్టర్ (పౌరసరఫరాలు), పౌర సరఫరాల అధికారులు, ఎఫ్‌సీఐ అధికారులు, మరియు రైస్ మిల్లర్ల ప్రతినిధులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ.. జిల్లాల వారీగా, రైస్ మిల్లుల వారీగా రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వాటిని తప్పనిసరిగా సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు లక్ష్యాల సాధనను సమీక్షిస్తూ, ప్రత్యేక అధికారుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.ఎఫ్‌సీఐ అధికారులు స్టాక్ అలాట్‌మెంట్లు, ఆన్‌లైన్ అనుమతులు, బుకింగ్‌లు, గోదాములలో స్థల లభ్యత వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశించారు. అధిక పరిమాణంలో సీఎంఆర్ సిద్ధంగా ఉంచిన, ఎక్కువ సామర్థ్యం కలిగిన రైస్ మిల్లులకు అదనపు స్టాక్‌లు/బెడ్లు కేటాయించి డెలివరీలను వేగవంతం చేయాలన్నారు. సిద్ధిపేట జిల్లాకు సమీపంలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాములను వినియోగించుకోవడం ద్వారా రవాణా దూరాన్ని, సమయాన్ని తగ్గించవచ్చని సూచించారు.రైస్ మిల్లర్లు తగిన సంఖ్యలో హమాలీలను, రవాణా వాహనాలను సమకూర్చుకోవాలని, అవసరమైతే పని వేళలను పెంచుకుని జిల్లా నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ డెలివరీలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎంఆర్ పురోగతి వివరాలు (202526) సీజన్

| సీజన్ | మొత్తం లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో) | ఇప్పటివరకు డెలివరీ (మెట్రిక్ టన్నుల్లో) | సాధించిన శాతం |
|---|---|---|---|
| వానాకాలం (ఖరీఫ్) | 2,76,058 | 1,32,994 | 48.18% |
| యాసంగి (రబీ) | 1,57,052 | 21,953 | 13.98 |

మిగిలిన సీఎంఆర్ డెలివరీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, పౌర సరఫరాల అధికారులు, ఎఫ్‌సీఐ అధికారులు మరియు రైస్ మిల్లర్లు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని డైరెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ మరియు రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, ఎఫ్‌సీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మంజూరైన రోడ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు ఎమ్మెల్యే సార్

- పాత పనులు పూర్తయిన తర్వాత నూతన పనులకు శంకుస్థాపన చేయాలి
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూస అశోక్ యాదవ్ డిమాండ్.

**ఖానాపురం, జూలై 5 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని పలు గ్రామాలలోని మంజూరైన రోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సార్ ను బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూస అశోక్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మాట్లాడుతూ ఈనెల 7న మండలంలోని పలు గ్రామాలలోని నూతన పనులకు శంకుస్థాపన చేయడాన్ని బిఆర్ఎస్ పార్టీ గాని ఆయా గ్రామాల ప్రజలు హర్షిస్తారని తెలుపుతూ, గతంలో మంజూరై అద్వాన స్థితిలో ఉన్న రోడ్ల నిర్మాణం చేసిన తర్వాతే నూతన పనులకు శంకుస్థాపన చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే సార్ కు తెలుపుతూ, నూతన పనులకు శంకుస్థాపన చేయడం పలు గ్రామాల ప్రజలకు మంచిదేనని తెలుపుతూ, నూతన పనుల కంటే ముందు మంజూరైన పనులను పూర్తిచేస్తే ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని తెలుపుతూ, ఆ తర్వాత నూతన పనులకు శంకుస్థాపన చేస్తే ప్రజలు బ్రహ్మరథం పడతారని ఎమ్మెల్యే సార్ కు తెలుపుతూ,, మండల కేంద్రం నుండి రాగంపేట, కొత్తూరు, రంగాపురం వెళ్లే రహదారి మరియు కొత్తూరు నుండి బాలుతండాకు వెళ్లే రహదారి నడవలేని అద్వాన స్థితిలో ఉందని ఎమ్మెల్యే సార్ కు గుర్తు చేస్తూ తక్షణమే ఈ పనులు పూర్తి చేసి నూతన పనులను శంకుస్థాపన చేస్తే ఆయా గ్రామాల ప్రజలు నాయకులు రైతులు కాలేజీ విద్యార్థులు హర్శిస్తారని ఎమ్మెల్యే సార్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే రాము, వార్డు సభ్యుడు మద్దూరి బాబు, సీనియర్ నాయకుడు రాము, సొసైటీ మాజీ డైరెక్టర్ సొంటి లక్ష్మణ్, యూత్ నాయకుడు పోతరాజు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతమే నా లక్ష్యం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయం
- కార్యకర్తలను కాపాడుకుంటూ ముందుకెళ్తా
- ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు.. కొన్ని నిర్ణయాలనే తప్పుపట్టా
- చౌటుప్పల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

**చండూరు - చౌటుప్పల్,జూలై 5 (వుదయం):**

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, రాబోయే రోజుల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అంతర్గత పరిణామాలు, తన భవిష్యత్తు కార్యాచరణపై కీలక వ్యాఖ్యలు చేశారు.

***రాహుల్ గాంధీ మానవత్వం ఉన్న నాయకుడు***

ఇటీవల ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీని రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. "తెలంగాణ రాష్ట్రంలో ఏ నాయకునికి ఇవ్వనంత సమయాన్ని రాహుల్ గాంధీ నాకు ఇచ్చారు. ఆయనతో పార్టీ నిర్ణయాలు, కుటుంబ విషయాలపై సుదీర్ఘంగా చర్చించా. రాహుల్ గాంధీ నాతో మాట్లాడిన మాటలకు నేను తీవ్రంగా ప్రభావితమయ్యాను. ఆయన ఎంతో మానవత్వం ఉన్న వ్యక్తి. ఆయన నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేస్తున్నాయి. అందుకోసం నా శాయశక్తులా కృషి చేస్తా" అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

**కార్యకర్తలను కాపాడుకుంటాం.. రాజీ పడేదే లేదు**

తాను పార్టీకి దూరంగా ఉంటున్నానంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఎమ్మెల్యే కొట్టిపారేశారు. నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ కార్యకర్తలకు అండగా ఉంటున్నానని చెప్పారు. "మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి ఎలాంటి అన్యాయం జరగొద్దనేదే మా ముఖ్య ఉద్దేశం. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే విషయంలో, కార్యకర్తలను కాపాడుకునే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోం. రాబోయే ఐదేళ్లూ కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంచేందుకు, ప్రజల మనసు గెలుచుకునేలా ఏం చేయాలనే దానిపైనే నిరంతరం ఆలోచిస్తున్నాం" అని తెలిపారు.

**ఆ వ్యాఖ్యలు తప్పనిసరి పరిస్థితుల్లోనే..**

యాదగిరిగుట్ట అంశంపై తాను చేసిన వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి వివరణ ఇచ్చారు. "యాదగిరిగుట్ట విషయంపై నేను తప్పనిసరి పరిస్థితుల్లోనే మాట్లాడాల్సి వచ్చింది. అది పార్టీ మీదనో, ప్రభుత్వం మీదనో ఉన్న వ్యతిరేకత కాదు. కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను మాత్రమే నేను తప్పుపట్టాను తప్ప, పార్టీని కాదు" అని ఆయన స్పష్టం చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో పార్టీ లైన్‌లోనే నడుస్తూ, క్యాడర్‌ను రక్షించుకోవడమే తన ప్రథమ ప్రాధాన్యతని రాజగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కుటుంబ విలువలు కాపాడుతూ జీవించాలి

- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట జూలై 5, వుదయం ప్రతినిధి:**

వివాహం అనేది రెండు మనసులను, రెండు కుటుంబాలను ఏకం చేసే పవిత్ర బంధమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.

సూర్యాపేట పట్టణంలోని రవి మహల్ లో ఆదివారం జరిగిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవేందర్ లీల దంపతుల కుమార్తె గౌతమి, గణేష్ చక్రవర్తి ల వివాహ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, నూతన దంపతులు పరస్పర ప్రేమ, విశ్వాసం, అవగాహనతో ఆదర్శవంతమైన దాంపత్య జీవితాన్ని గడుపుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు."జీవితంలో ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, పెద్దలను గౌరవిస్తూ, కుటుంబ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలి. ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారమే దాంపత్య జీవితానికి బలమైన పునాదులు" అని సూచించారు.అనంతరం వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో కళకళలాడాలని కోరారు.ఈ వేడుకలో పాల్గొన్న వారు జిల్లా కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత, పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశాలకు 6న కౌన్సిలింగ్

**పెద్దపల్లి జులై 05 (వుదయం ప్రతినిధి)**



సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఈనెల 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పెద్దపెల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల మంథని, పెద్దపెల్లి (బాలురు)లో, రామగుండం, మల్లాపూర్, నంది మేడారం, గర్రెపల్లి (బాలికలు) కళాశాలలో మిగిలిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ( బైపిసి, ఎంపీసీ, సిఇసి, హెచ్ఈసి) సీట్లకు ఆరో తేదీన (సోమవారం) స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ ను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) మంథనిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందని ఆ తర్వాత స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు. స్పాట్ కౌన్సిలింగ్ కు హాజరయ్యే అర్హులైన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ( పదవ తరగతి ఉత్తీర్ణత పత్రం), కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ దృవీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ పత్రాలు రెండు సెట్లు, విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్థి నాలుగు ఫోటోలు తీసుకొని కౌన్సిలింగ్ సెంటర్ కు రాగలరని సూచించారు.

# వైభవంగా మాతమ్మ తల్లి బోనాలు



- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,ప్రజాప్రతినిధులు

**వేములవాడ జూలై 05 {వుదయం ప్రతినిధి} :**

వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్ (మాదిగ) కుల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, మాతమ్మ, ఎల్లమ్మ తల్లుల బోనాల ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాతమ్మ కుల సంఘం బంధువులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంప్రదాయ పండుగలు సామాజిక ఐక్యతను,సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయన్నారు.అంబేద్కర్ కుల సంఘం భాందవుల అభ్యున్నతి కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు.మాతమ్మ అమ్మవారి ఆశీర్వాదాలు ప్రజలందరి పైన ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.బోనాల పండగ నిర్వహణను విజయవంతం చేయడానికి అంబేద్కర్ నగర్ కుల సంఘం సభ్యులు విశేషంగా కృషి చేశారు.బోనాల పండుగలో పాల్గొన్న అతిథులను కౌన్సిలర్లు కుమ్మరి శంకర్,కుమ్మరి శిరీష శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.సంఘం నాయకులు,యువకులు, మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా వేములవాడ పట్టణం ఆధ్యాత్మిక వాతావరణం నిండుకొని భక్తుల కోలాహలంతో సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తుమ్ మధు,కౌన్సిలర్లు బోనాల సారిక శివ,ముత్యం, వంగల శ్రీనివాస్,ప్రతాప హిమబిందు, అమర్వ,శ్రీనివాస్,నాయకులు పెంట బాబు, పెంట శంకరయ్య, రాజేశం లతో పాటు పెద్ద ఎత్తున కుల సంఘం పెద్దలు,మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## హాస్టల్ నుండి పారిపోయిన విద్యార్థిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత!



**- సమయస్ఫూర్తి చాటిన గజ్వేల్ సీఐ రవికుమార్, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి**
**రాజీవ్ రహదారిపై ఒంటరిగా బాలిక.. గుర్తించి కాపాడిన పోలీసులు**

**సిద్దిపేట/(జగదేవ్‌పూర్) జులై 4 (వుదయం ప్రతినిధి)**

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక అర్ధరాత్రి ఎవరికీ చెప్పకుండా పారిపోయిన ఒక 13 ఏళ్ల విద్యార్థినిని గజ్వేల్, జగదేవ్‌పూర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేవలం ఒక్క గంటలోనే సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమవడమే కాకుండా, పోలీసుల సమయస్ఫూర్తిపై ప్రశంసల జల్లు కురిపిస్తోంది. వివరాల్లోకి వెళితే....సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం గుండన్నపల్లి సమీపంలోని తెలంగాణ మైనారిటీ వసతి గృహంలో గుగులోత్ రితిక (13) అనే బాలిక 7వ తరగతి చదువుతోంది. అయితే, హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేని రితిక, శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (సుమారు 1 గంట సమయంలో) ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుండి బయటకు వచ్చేసింది. చీకట్లో ఒంటరిగా నడుస్తూ రాజీవ్ రహదారి పైకి చేరుకుంది. అదే సమయంలో గజ్వేల్ సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి హైవేపై నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటరిగా వెళ్తున్న బాలికను గమనించిన సీఐ, వెంటనే వాహనాన్ని ఆపి ఆమెను విచారించారు. సదరు బాలిక సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందినదిగా గుర్తించారు. బాలిక వివరాలు తెలియగానే సీఐ రవికుమార్ వెంటనే జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డికి సమాచారం అందించి, బాలికను ఆయనకు అప్పగించారు.రెండు గంటల కల్లా తల్లిదండ్రుల చెంతకు..సమాచారం అందుకున్న జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించారు. అర్ధరాత్రి 2 గంటల సమయానికి బాలికను వట్టిపల్లిలోని ఆమె తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లి సురక్షితంగా అప్పగించారు. కూతురు అర్ధరాత్రి ఇల్లు చేరడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు గురైనప్పటికీ, క్షేమంగా తీసుకొచ్చినందుకు పోలీసులకు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. అర్ధరాత్రి వేళల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమర్థవంతంగా పనిచేసి బాలికను కాపాడిన సీఐ రవికుమార్, ఎస్ఐ కృష్ణారెడ్డిలను ఉన్నతాధికారులు అభినందించారు.

## బొడ్రాయి ప్రతిష్ఠాపనలో సుధా శ్రీనివాస్



**పటాన్‌చెరు:**

పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి పునఃశ్చరణ, గణపతి-నవగ్రహ సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## శ్రీ విద్యా గణపతి వార్షికోత్సవం కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్న వేడుకలు



**పటాన్‌చెరు:**

బీరంగూడ డివిజన్ పరిధిలోని ఐటి డబ్ల్యూ సిగ్నోడ్ కాలనీలో ఘనంగా నిర్వహించిన శ్రీ విద్యా గణపతి పంచాయతన దేవాలయ వార్షికోత్సవ మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

**- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్**

**జిన్నారం జులై 5(వుదయం ప్రతినిధి)**

దేవాలయాలు ఆధ్యాత్మికతకు, భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాల పరిరక్షణకు నిలయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం డివిజన్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ



ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దేవాలయాలు ప్రజల్లో భక్తి, నైతిక విలువలు, సామాజిక ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని, భావితరాలకు మన గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను అందించేందుకు దేవాలయాలు వేదికలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ కు కుంట ఘన వ్యర్ధాలు తరలింపు



**జిన్నారం జులై 7(వుదయం ప్రతినిధి)**

బొల్లారం డివిజన్ పరిధిలో ప్రకృతి విపత్తుల మూలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై హైడ్రా మాన్సూన్ బృందం సభ్యులు తగు విధంగా చర్యలు చేపడుతున్నారు. మాధవాని కుంటలో తూము వద్ద ఘన వ్యర్థాల తొలగింపు ప్రక్రియ లో భాగంగా ఆదివారం పోగు చేసిన వ్యర్థాలను శానిటేషన్ సిబ్బంది జెసిబిలతో తీసి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. దాదాపు రెండు మూడు టన్నుల ఘన వ్యర్థాలను కుంట నుంచి తీసి డంపింగ్ యార్డ్ కు తరలించినట్లు శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హైడ్రా మాన్సూన్ టీమ్ సూపర్వైజర్ శంకర్, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్**

**వుదయం, చిన్నకోడూర్ (జూలై 5)**

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని కస్తూరిపల్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడూరు శ్రీనివాస్, దేవులపల్లి యాదగిరి హాజరై రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి గృహప్రవేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. నిరుపేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారం చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు.ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పరశురాములు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, నక్క రాజు హరిబాబు, చిక్కుడు అనిల్, జయంత్, ప్రశాంత్, చందు, చింతల రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కోహీర్ జులై 5 (వుదయం ప్రతినిధి)**

శంకర్ పల్లి మండలం జన్వాడలోని నియో కన్వెన్షన్ లో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి కుమారుని వివాహ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పాటిల్ మరియు ఇతర ముఖ్య నాయకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రెడ్డి, అశోక్, మాజీ జడ్పీటీసీ రాందాస్,కవేలి మాజీ సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి,సర్పంచ్ సయ్యద్ నజియా లాయక్ , కవేలి కృష్ణ, ఇక్బాల్, రత్నం, అనిల్, నర్సింలు తదితరులు.

## లక్ష్మీపురం ప్లాట్ల బాధితులకు న్యాయం చేస్తాం

**- బిల్డర్‌పై కఠిన చర్యలు తప్పవు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రామచంద్రాపురం, జూలై 5(వుదయం)**



కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల యజమానుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొల్లూరులో లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.1984లో సర్వే నంబర్లు 173 నుంచి 190 వరకు ఉన్న 142 ఎకరాల్లో సుమారు 1,500 మంది ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనల మేరకు ప్లాట్లు కొనుగోలు చేశారని తెలిపారు. అనంతరం కొందరు తప్పుడు పత్రాలతో అదే ప్లాట్లను విక్రయించి అసలు యజమానులను మోసగించారని ఆరోపించారు.

బీఎల్ ప్రసాద్ ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను కబ్జా చేసి హెచ్ఎండీఏ అనుమతులతో నిర్మాణాలు చేపట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అక్రమ అనుమతులను రద్దు చేయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ప్లాట్ యజమానుల హక్కులను పరిరక్షించడంలో రాజీ పడబోమని, ఎంతటి పెద్దవారు అడ్డొచ్చినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రతి ప్లాట్ యజమానికి పూర్తి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

సమావేశంలో సీనియర్ నాయకులు నరసింహ, యాదయ్య, వెంకట్రాంరెడ్డి, మధు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విజయ డైరీ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనీ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు



**రంగారెడ్డి జిల్లా.**

ఆదివారం షాద్‌నగర్‌లో విజయ డైరీ పాల ఉత్పత్తిదారుల రైతులతో నిర్వహించిన "తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (TSDDCF) 60వ వార్షికోత్సవ వేడుకలకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతుల కష్టార్జిత శ్రమతో విజయ డైరీ దేశ వ్యాప్తంగా ఐదో స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. పాల ఉత్పత్తిదారులకు ప్రస్తుతం అందుతున్న ధరను మరింత మెరుగుపరిచేందుకు,ప్రోత్సాహకాలను పెంచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.రైతుల ప్రధాన సమస్యగా ఉన్న బిల్లుల చెల్లింపుల అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నామని, దీనిపై ఇప్పటికే పలుమార్లు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌లతో చర్చించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమై బిల్లుల సమస్యకు త్వరితగతిన పరిష్కారం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల పాలను కొనుగోలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఈ పరిమాణాన్ని 22 లక్షల లీటర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. ముందుగా స్థానిక రైతుల పాలకే ప్రాధాన్యం కల్పించి, అవసరమైన మేరకు ఇతర రాష్ట్రాల నుంచి పాల కొనుగోళ్లను తగ్గించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. కర్ణాటక తరహాలో పాల పరిశ్రమను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర అధ్యయనం జరుగుతోందని, బ్యాంకులతో కలిసి రైతులకు అనుకూలమైన కొత్త పథకాన్ని రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు. రైతు భాగస్వామ్యం, బ్యాంకు రుణం, ప్రభుత్వ సబ్సిడీ అంశాలతో కూడిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమవుతోందని, అది పూర్తయిన వెంటనే షాద్‌నగర్ విజయ డైరీ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్త పథకాన్ని ప్రకటిస్తామని తెలిపారు.పాడి రైతుల శ్రమ ఎంతో కఠినమైనదని, ప్రతిరోజూ తెల్లవారుజామునే ప్రారంభమయ్యే వారి జీవన విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుంటోందన్నారు. రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడేలా పాల ఉత్పత్తి పెంపునకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, గేదెలు, ఆవుల కొనుగోలు, పాల ఉత్పత్తి విస్తరణకు అనుకూలమైన ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. విజయ డైరీ అభివృద్ధి, పాల ఉత్పత్తిదారుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించి తెలంగాణలో పాల పరిశ్రమను మరింత బలోపేతం చేస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్, వివిధ సంస్థల చైర్మన్లు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక యూనియన్ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



**జిన్నారం జులై 5(వుదయం ప్రతినిధి)**

బొల్లారం డివిజన్ పరిధిలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమ ముందు టిఆర్టియుసి నాయకులు యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ ట్రేడ్ యూనియన్ నాయకులు రాములు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రేయస్సు కోసమే యూనియన్ నిరంతరం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి యూనియన్ నాయకులు వరప్రసాద్ రెడ్డి, ఆటో యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## కంసాన్‌పల్లి ఫ్రోజెన్ సీమెన్ బుల్ స్టేషన్‌ను సందర్శించిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి





**రంగారెడ్డి జిల్లా**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో ఉన్న ఫ్రోజెన్ సీమెన్ బుల్ స్టేషన్‌ను రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి, నాణ్యత ప్రమాణాలు, నిల్వ, పంపిణీ విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రంలో పశుసంపద అభివృద్ధికి, పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి ఆధునిక కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్ర మాట్లాడుతూ కరీంనగర్ తర్వాత రాష్ట్రంలో ఇలాంటి అత్యాధునిక పశు ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి కేంద్రం కంసాన్‌పల్లిలోనే ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ కేంద్రాన్ని అన్ని ఆధునిక సౌకర్యాలతో సన్నద్ధం చేసి త్వరలోనే పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కేంద్రం ప్రారంభమైతే నాణ్యమైన ఘనీభవించిన వీర్యం రైతులకు సులభంగా అందుబాటులోకి వచ్చి, మేలుజాతి పశువుల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఫలితంగా అధిక పాల దిగుబడి ఇచ్చే పశువుల సంఖ్య పెరిగి, రాష్ట్రంలో పాల ఉత్పత్తి వృద్ధి చెందడంతో పాటు పాడి రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణను పాల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం

పశుసంవర్ధక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఇటువంటి కేంద్రాలు రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, పాడి పరిశ్రమ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రావు, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (TGLDA) చైర్మన్, శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన హనుమంతు నాయుడు

**గద్వాల, జూలై 05 (వుదయం బ్యూరో)**

మల్దకల్ మాజీ సర్పంచు యాకోబు గారి కుమారుడు ప్రభాకర్ ఇటీవల కాలు శస్త్రచికిత్స చేయించుకుని గద్వాల జిల్లా కేంద్రంలోని స్రవంతి ఆసుపత్రిలో చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, వైద్యుల సూచనలు పాటించి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ సర్పంచు యాకోబు కుటుంబ సభ్యులతో మాట్లాడిన బాసు హనుమంతు నాయుడు, ధైర్యంగా



ఉండాలని సూచిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని భరోసా కల్పించారు.

## అర్హులందరికీ సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**రంగారెడ్డి జిల్లా.**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామంలో గిరిజన మహిళ శ్రీమతి నేనావత్ జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాలాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ అనిత్ రెడ్డితో కలిసి లబ్ధిదారురాలికి శుభాకాంక్షలు తెలియజేసి నూతన గృహాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అర్హులైన పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే సంకల్పంతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారురాలు నేనావత్ జ్యోతితో మాట్లాడిన సందర్భంగా ఆమె ముఖంలో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ప్రత్యక్ష ప్రయోజనాలు పొందుతున్నారని ఆమె స్వయంగా తెలిపిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు.అనంతరం గ్రామ ప్రజలతో మమేకమైన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, కళ్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని, వాటి ప్రయోజనాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తయితే పరిసర గ్రామాలు, తండాలకు సాగునీరు అందడంతో వ్యవసాయం అభివృద్ధి చెంది ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేస్తే ప్రాంత అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీమతి సరిత, తహసీల్దార్ నాగయ్య, ఎంపీడీవో శ్రీకాంత్, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చాంప్లా నాయక్, డిప్యూటీ ఇంజనీర్ సురేష్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



దేశంలో మళ్లీ బ్రిటీష్ పాలన...

"భారత దేశంలో మళ్లీ బ్రిటిష్ పాలనను తీసుకొచ్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ప్రస్తుతం భారత్‌లో ఓటర్లు ప్రభుత్వాలను ఎన్నుకోవడం లేదు.. ప్రభుత్వాలే ఓటర్లను ఎంపిక చేస్తున్నాయి.. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. సర్ ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఎందుకు మారాయో ఆలోచించాల్సిన అవసరం ఉంది... అందువల్ల తెలంగాణ పౌర సమాజం 'సర్' ప్రక్రియపై జాగ్రత్తగా ఉండాలి. 1947లో ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో పాకిస్తాన్ నుంచి వలసలు జరుగుతున్న సందర్భంలో సైతం దేశంలో ఓటు హక్కును ప్రభుత్వమే పారదర్శకంగా ఇచ్చింది. కానీ నేడు పౌరులు తమ ఓటు హక్కును తామే రక్షించుకునే పరిస్థితులను కల్పించారు..."

-జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి

## వే'మన' పద్యం

చిక్కియున్నవేళ సింహంబునైనను
బక్క కుక్క కఱచి బాధ పెట్టు
బలిమిలేని వేళ వంతంబు చెల్లదు
విశ్వదాభిరామ వినుర వేమా



## సంపాదకీయం

# ప్రకృతి.. పాలన...

వాన పడుతుందనే నమ్మకంతో రైతులు తొలకరి చినుకులు కురిసిన వెంటనే దుక్కులు దున్నారు. అప్పు చేసి విత్తనాలు కొన్నారు. ట్రాక్టర్లకు డబ్బులూ చెల్లించారు. కొందరైతే ధైర్యం చేసి విత్తనాలు కూడా చల్లేశారు. కానీ, ఆ తర్వాత ఆకాశం ముఖం చాటేసింది. నేలలో పడిన విత్తనం మొలకెత్తలేదు. కొన్నిచోట్ల మొలిచినా ఎండిపోయాయి. ఇప్పుడు అదే పొలాన్ని మళ్లీ దున్నాలా? మళ్లీ విత్తనం కొనాలా? లేక ఇంకో వానకోసం ఎదురు చూడాలా? అనే సందిగ్ధంలో రాష్ట్ర రైతాంగం ఉంది. పొలంలో పంట కనిపించకముందే పెట్టుబడి మట్టిలో కలిసిపోయింది. దీంతో దుక్కుల్లో పచ్చదనం కాదు... ఇప్పుడు దుఃఖమే మొలుస్తోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళను ఆలస్యంగా తాకడం, ఆ తర్వాత దేశవ్యాప్తంగా వాటి పురోగతి మందగించడం వల్ల ఖరీఫ్ సీజన్ తీవ్రంగా దెబ్బతింది. దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే దాదాపు నలభై రెండు శాతం తక్కువగా నమోదైంది. జూలైలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేయడం రైతుల ఆందోళనను మరింత పెంచుతోంది. ప్రస్తుతం తెలంగాణలో పదిహేడు జిల్లాల్లో లోటు వర్షాపాతం నమోదైంది. సాధారణంగా జూన్ చివరి నాటికి ఊపందుకోవాల్సిన ఖరీఫ్ సాగు ఈసారి ఆశించిన స్థాయికి చేరలేదు. గతేడాదితో పోలిస్తే సాగు దాదాపు సగానికి పడిపోయింది. ఇప్పటికే వేలాది మంది రైతులు తొలకరి జల్లులను నమ్ముకుని పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కందులు, పెసర వంటి పంటలు వేశారు. కానీ, తర్వాత వర్షాలు లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీనికి తోడు ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులకు నీటి ప్రవాహం మందగించడంతో సాగు, తాగునీటి అవసరాలపై ఒత్తిడి పెరుగుతోంది. ఖరీఫ్ సాగు కీలకదశలో ప్రాజెక్టులు నిండకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. వర్షాభావం మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే చెరువులు, భూగర్భజలాలపై మరింత ఒత్తిడి పెరిగి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. గత కొన్నేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతను వరుసగా వెంటాడుతూనే ఉన్నాయి. ఒకసారి అతివృష్టి, మరోసారి అనావృష్టి, ఇంకోసారి అకాల వర్షాలు, వడగళ్ల వానలు, తుఫాన్లు... ఇలా యేటా ఏదో ఒక విపత్తు రైతు జీవితాన్ని కుదేలు చేస్తోంది. వ్యవసాయం ఇక లాభసాటి వృత్తి కాదనే భావన బలపడుతోంది. అందుకే చాలామంది యువ రైతులు కాడిని వదిలి పట్టణాలకు వలస వెళ్తున్న దుస్థితి నెలకొంది. ఇది వ్యవసాయ రంగానికి ప్రమాదకర సంకేతం. వర్షాల ఆలస్యానికి 'ఎల్ నినో' కారణంగా వాతావరణ నిపుణులు చెబు తున్నారు. అసలు ఎల్ నినో అంటే ఏమిటనేది, దాని ప్రభావం గురించి గ్రామీణ ప్రాంత రైతులకు తెలియదు. ఇది మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ దృగ్విషయం. దీని ప్రభావంతో భారత నైరుతి రుతుపవనాల తీవ్రత తరచుగా తగ్గిపోతుంది. వర్షపాతం సమయానికి కురవకపోవడం లేదా భారీ విరామాలు రావడం వల్ల ఖరీఫ్ సాగు తీవ్రంగా దెబ్బతింటుంది. నీటి వనరులపై ఒత్తిడి పెరిగి బోర్లు, చెరువులు త్వరగా ఎండిపోతాయి. దిగుబడులు తగ్గడంతో రైతుల ఆదాయం క్షీణించి అప్పుల భారం పెరుగుతుంది. పశుగ్రాసం కొరత కూడా ఏర్పడి పశు సంపదపై ప్రతి కూల ప్రభావం పడుతుంది. మొత్తమ్మీద ఎల్‌నినో ప్రభావం వ్యవసాయాన్ని మాత్రమే కాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా తీవ్ర సంక్షోభంలోకి నెట్టే ప్రమాదాన్ని పెంచుతుంది. ఇప్పుడు తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటుంది ఇదే. వాస్తవానికి ప్రభుత్వం ఇలాంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలి. వర్షాలు ఆలస్యమైతే ప్రత్యామ్నాయ పంటల్ని ప్రోత్సహించేలా సూచనలు ఇవ్వాలి. రెండోసారి విత్తుకోవాల్సిన రైతులకు ఉచితంగా లేదా సబ్సిడీపై విత్తనాలందించాలి. వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి. పంట బీమా నష్టపరిహారం త్వరగా చెల్లించాలి. ఉపాధి హామీ పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఆదాయం కల్పించాలి. చెరు వులు, కుంటలు, సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థలపై పెట్టుబడులు పెంచాలి. కానీ ఎక్కడా ఆ పరిస్థితి లేదు. 'వర్షాలు రాకుంటే దానికి మేం ఏం చేస్తాం' అన్న ధోరణి అధికార యంత్రాంగంలో కనిపిస్తోంది. వ్యవసాయం ప్రకృతిపై ఆధారపడినా, రైతు జీవితం ప్రభుత్వ విధానాలపై కూడా ఆధార పడుతుంది. ఆకాశం ఎప్పుడు కరుణి స్తుందో చెప్పలేం. కానీ ప్రభుత్వం మాత్రం రైతును నిరీక్షణలో వదిలేయకూడదు. దుక్కుల్లో దుఃఖం శాశ్వతం కాకూడదంటే, రైతు ఆశను నిలబెట్టే విధానాలే నిజమైన వర్షంగా మారాలి. రైతు పొలంలో మళ్లీ పచ్చదనం విరియాలంటే, ప్రకృతితో పాటు పాలనా సంకల్పమూ సమానంగా కురవాలి.

# కదలని నగదు రహిత చికిత్స...

రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లు కార్మికులు అంతా కలిసి రాష్ట్ర ప్రభుత్వంలో దాదాపు పది లక్షల మంది ఉంటారు. వీరందరి సంక్షేమం చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ముఖ్యంగా వారి ఆరోగ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సౌకర్యాలు సదుపాయాలు సమకూ ర్చాలి. ఎందుకంటే వారే ప్రభుత్వా లకు ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రభుత్వ పథకాల రచనకు క్షేత్రస్థాయిలో వాటి అమలు, విజయానికి అహర్నిశలు కృషి చేస్తారు. కానీ, వీరిని పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే, ఎంతోకాలంగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు డిమాండ్ చేస్తున్న నగదు రహిత చికిత్స పథకానికి ఎన్నో అధ్యయనాల తర్వాత ఎన్నో మీటింగుల తర్వాత కొలిక్కి వచ్చినట్లు ప్రభుత్వం హడావిడి చేసింది. జూన్ 2 నుండి ఉద్యోగ పెన్షనర్లందరికీ ఈ పథకం అమలులోనికి రానున్నట్లు ఆర్భాటంగా ప్రకటించింది. చాలా ఆశ్చర్య కరంగా పథకం అమల్లోనికి రాకముందే వారందరి జీతాల నుండి అంటే మే నెల జీతం లేదా పెన్షన్ నుండి వారి మూల వేతనంలో 1.5శాతం కోతతో జీతాలు పెన్షన్లు విడుదల చేసింది. జీవితంలో కోతకోశారు కదా అని నగదు రహిత చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లిన వారికి భంగపాటు తప్పలేదు. అంటే ఈ ఆరోగ్య పథకానికి సంబంధించిన విధివిధానాలు ఇంతవరకు ఖరారు కాలేదు. ఏ కార్పొరేట్ ఆసుపత్రులు ఏ జబ్బుల నిమిత్తమై ఈ విధమైన నగదు రహిత చికిత్సకు ఒప్పుకున్నాయో వాటి లిస్టు విడుదల కాలేదు. ఏడాదికి కనీసం రెండుసార్లు ఆరోగ్యపరీక్షలు కూడా ఇందులో చేర్చితే బాగుంటుంది. అవుట్ పేషెంట్ సర్వీస్ ఇందులో చేర్చారా లేదా అనే విషయం కూడా ఎవరు చెప్పలేకపోతున్నారు. సహజంగా భార్యా భర్తలు ఇరువురు ఉద్యోగస్తులయితే కేవలం ఒకరి జీతం నుండి మాత్రమే 1.5శాతం కోత విధించి ఆ ట్రస్టుకు జమ చేయాలి. కానీ అత్యుత్సాహంతో మన రాష్ట్ర ప్రభుత్వం ఇరువురు ఉద్యోగస్తులకు కోత విధించింది. కొన్ని శాఖలకు ఆరోగ్య రక్షణ పథకం అమలులో ఉన్నది. అయినప్పటికీ వారి జీతం నుండి 1.5శాతం కోత విధించి మిగిలిన మొత్తాన్ని విడుదల చేసింది.. అసలు జీతంలో కోత పనులు చేయవలసింది డిడిఓలు అంటే డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు. కానీ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ వద్దనే ఈ కోత పనులు జరిగాయి. ఎందుకింత తొందర? పథకం జూన్ నుండి అమలులోనికి వస్తే జూన్ మాసం వేతనం లేదా పెన్షన్ నుండి కోత విధించాలి. కానీ మే నెల నుండి ఈ కోతలు మొదలు పెట్టింది మన రాష్ట్ర ప్రభుత్వం. ఉద్యోగ సంఘాలు కూడా ఆశ్చర్య పోయిన పరిస్థితి. తమ కేడర్ నుండి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సతమతమవుతున్నారు. కొంత మంది పెన్షనర్లు తమ అనుమతి లేదా డిడిఓ లేదా ఎస్టిఓ ల ప్రమేయం లేకుండా కోత విధించినందుకు ఆగ్రహించి కోర్టు మెట్లు



ఎక్కడానికి కూడా సిద్ధపడుతున్నారనేది గమనార్హం. అసలు ఉద్యోగస్తుల పెన్షనర్ల నుండి డబ్బులు వసూలు చేసి తాను కొంత మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నట్టు చెప్పడమే విడ్డూరంగా ఉంది. ఇది ఏ రకమైన సంక్షేమం అవుతుంది? ఇదేమీ ఉచితంగా ఇవ్వడం లేదు కదా. మే నెల 20వ తేదీ తరువాత నుండి రాష్ట్ర ప్రభుత్వం ఈ నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయ డానికి ఉత్తర్వులు ఇస్తూ ఉద్యోగులను తమ కుటుంబ సభ్యుల వివరాలు వెంటనే సంబంధిత శాఖాధి పతులకు తెలియజేయమని కోరింది. పెన్షనర్లను కూడా అదే విధంగా కోరగా వారిలో చాలామంది పెద్దవారని కొంత మంది అందుబాటులో లేకపోవచ్చునని సంఘం ప్రాతినిధ్యం చేసిన పిమ్మట ఆరోగ్యశాఖ ఆ వివరాలను డిడిఓల నుంచి తీసుకోవడానికి సమ్మతించింది. అంటే ప్రతి దశలోనూ తొందర కనబడుతున్నది. నెల చివరికల్లా జీతాల కోతలకు పాల్పడింది. కొంతమంది ఇప్పటికే ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రీమియం ఒక ఏడాదికి సరిపోను కట్టి ఉన్నారు. ఐచ్ఛికత అడగకుండా అందరి నుండి కోత విధించడం కూడా దుర్మార్గమే. కొంతమంది మరుసటి సంవత్సరము నుండి ఈ నగదు రహిత చికిత్సలో జాయిన్ అయ్యే వారేమో! కానీ ప్రభుత్వం బలవంతంగా అందరినీ ఈ పథకంలోనికి లాగింది. స్మార్ట్ కార్డులు తయారు కాలేదు. ఉద్యోగ పెన్షనర్లకు ఇవ్వలేదు. హడావిడి నిర్ణయాలు తొందరపాటు చర్యలు. కోతలు చేయడంలో ఉన్న తొందర పథకం అమలులో కనిపించడం లేదు. అసలు కార్పొరేట్ ఆసుపత్రులతో ఒప్పందాలు జరిగాయా? వారు ఈ నగదు రహిత పథకం అమలుకు సిద్ధంగా ఉన్నారా? సహజంగా ఈ పథకం అమలుకు ఒప్పుకున్న కార్పొరేట్ ఆసు పత్రులు ఉద్యోగులకు పెన్షనర్లకు సరియైన చికిత్స అందించరని లేదా రెండవ రకమైన చికిత్స అందిస్తారని అపవాదు ఉంది. అంతేకాదు వారు నగదు చెల్లించిన వారి కంటే ఈ పథకం వారికి ఎక్కువ రేట్లు వేసి ప్రభుత్వం నుండి ఎక్కువ డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తారని కూడా ప్రచారంలో ఉంది. ఇలాంటి వాటికి తావు లేకుండా ప్రభుత్వం పక్కాగా ఈ పథకాన్ని అమలు చేయాలి. ప్రభుత్వానికి దుబారా ఖర్చు అయితే ఉద్యోగులు పెన్షనర్లు సహించరనేది వాస్తవం. ఈఎస్ఐ లో కూడా కార్మికుల నుండి 0.75శాతం వసూలు చేస్తే ప్రభుత్వం 3.25 శాతం మ్యాచింగ్ గ్రాంట్ జతచేసి వారి ఆరోగ్య సంక్షేమానికై పాటుపడుతుంది. కానీ ఉద్యోగుల పెన్షనర్ల విషయంలో ఇది చాలా భిన్నంగా ఉంది. అసలు ప్రభుత్వం ఈ కార్పొరేట్ ఆసుపత్రులకు కొట్లాది రూపాయలు ధారపోసే కంటే అదే డబ్బుతో ప్రభుత్వ ఆసుపత్రులను ఎందుకు బాగు చేయదు? అందులో సౌకర్యాలు ఎందుకు మెరుగుపరచడం లేదు? డాక్టర్లు, పరికరాలు, అవసరమైన సిబ్బంది సమకూర్చితే ఎవరు కూడా ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స కోసం వెళ్లరు. ఏదో ఒకరిద్దరు కలెక్టర్లు తమ డెలివరీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకుంటే సరిపోదు. ప్రజలకు వాటిపై విశ్వాసం కలిగేలా చేయాలి. కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీ ప్రభుత్వాలకు తెలియనిది కాదు. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ల దోపిడీపై నియంత్రణ లేకుండా వారి అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తున్నది. ప్రభుత్వ వైద్యాన్ని ప్రోత్సహించాల్సిన నేతలు కార్పొరేట్ వ్యవస్థపై వాత్సల్యం చూపిస్తుండడం మన దౌర్భాగ్యం. తత్ఫలితంగా కార్పొరేట్ దోపిడీ ఇప్పుడు చట్టబద్ధం అవుతున్నట్టు లెక్క. ప్రభుత్వం ఆ ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లింపులు సకాలంలో చేస్తేనే ఈ పథకం సజావుగా జరుగుతుంది. ప్రైవేట్ స్కూళ్లకు, ఇంజనీరింగ్ కళాశాలలకు చేయవలసిన చెల్లింపులు ఆపివేసిన సందర్భంలో అవి సమ్మెలకు దిగడం వారిని బెదిరించడం బుజ్జగించడం మనకు అనుభవమే. ఎలాంటి బాలారిష్టాలు లేకుండా ఈ నగదు రహిత ఆరోగ్య పథకం సజావుగా సాగుతుందని ఆశించవచ్చా? కాలమే నిర్ణయించాలి.

ఇప్పుడు కొత్తగా బ్యాంకులతో ఎంఓయూలు కుదుర్చుకుని ఉద్యోగుల మరణానికి కోటి రూపాయలపైన ఇన్సూరెన్స్ కల్పిస్తున్నాం అని జూన్ 25వ తేదీన అట్టహాసంగా పథకం ప్రారంభించబడింది. అది ఏ మేరకు అమలవుతుందో కూడా చూడాలి. ముందుగా ఉద్యోగులను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒత్తిడి లేకుండా పనిచేయనిస్తే అదే వారికి గొప్ప ఇన్సూరెన్స్ లాంటిది. ఎన్నికల ముందు పార్టీలుగా, పార్టీ నేతలుగా ఇష్టం వచ్చిన హామీలు వాగ్దానాలు వర్షం కురిపించడం మామూలే. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిలబెట్టుకోవడంలోనే ప్రభుత్వాల సమర్థత వెల్లడవుతుంది. పార్టీలుగా ఓటర్లను ప్రజలను మోసం చేయవచ్చు కానీ ప్రభుత్వాలుగా మోసం చేద్దామనుకుంటే ప్రజాస్వామ్యంలో అది చెల్లుబాటు కాదు. భవిష్యత్తులో దానికి

# మహోన్నత పార్లమెంటేరియన్

భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పొలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు దయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు. ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు.



మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిష్టర్' అని పిలిచేవారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్‌లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు. ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు. బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", "జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్ కు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం'' అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూలై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజా ప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. 1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 19701974, 1977 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు. 1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# సిగాచి.. ఏడాదైనా దక్కని పరిహారం



రాష్ట్ర చరిత్రలోనే ఘోరమైన పారిశ్రామిక ప్రమాదం జరిగి నేటికి ఏడాది కావస్తోంది. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని 'సిగాచి' పరిశ్రమలో ఆనాడు విస్ఫోటనం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇంకా ఆ విషాదం కండ్ల ముందు కదలాడుతోంది. విస్ఫోటనం జరగ్గానే పదుల సంఖ్యలో అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన కార్మికులు కొందరైతే, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరికొందరు మరణించారు, మరో ఎనిమిది మంది కనీస ఆనవాళ్లు లేకుండా మాడి మసైపోయారు. మొత్తం యాభై నాలుగు మంది ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. కొందరు మినహా మొత్తం వలస కార్మికులే ఈ ప్రమాదంలో మృతిచెందారు. మృతదేహాలను వెలికితీసే పనిలో భాగంగా ఎనిమిది మంది ఆచూకీ లభించలేదు. పేలుడు అవశేషాలను లారీల్లో తరలించి ఓ గ్రౌండ్‌లో పోసి డిఎన్ఏ టెస్ట్ ల కోసం నిపుణులు ప్రయత్నించినా కనీస ఆనవాళ్లు కూడా లభించక పోవడం అన్నది అందరి హృదయాలను కలచి వేసింది. 30 జూన్ 2025 న జరిగిన ఈ ప్రమాదంతో రాష్ట్రమే కాదు దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీ తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులంతా సిగాచీ పరిశ్రమ వద్దకు క్యూకట్టారు. ఛత్తీసుగఢ్, జార్ఖండ్ , ఒడిశా, బీహార్ ప్రాంతాల వలస కార్మిక కుటుంబాలు రోజుల తరబడి మృతదేహాల కోసం పడిగాపులు కాశారు. తెలంగాణలోనే అత్యధిక పరిశ్రమలు ఉన్న పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో అత్యధికులు వలస కార్మికులే. నిత్యం జరిగే ప్రమాదాల్లో ఈ వలస కార్మికులే బలైపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాదం జరిగిన మరుసటి రోజు సిగాచి పరిశ్రమ వద్దకు వచ్చారు. ప్రమాద ప్రాంతాన్ని అధికారులతో కలసి కలియ తిరిగి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మృతి చెందిన ఒక్కో కార్మిక కుటుంబానికి కోటి రూపాయపరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ప్రమాదం జరగ్గానే ప్రాథమిక విచారణ కూడా పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి నోటి నుంచి కోటి రూపాయల ప్రకటన రావడం వెనుక ఒక రహస్య ఒప్పందం ఉండే ఉంటుంది. ఆర్థిక దారిద్ర్యంతో అల్లాడిపోతున్న బాధిత కార్మిక కుటుంబాలను శాంతపర్చే ఉద్దేశమే యాజమాన్యానిది, ప్రభుత్వానిది. అందుకే ప్రమాదానికి దారితీసిన కారణాలను, భద్రతా లోపాలను, యాజ మాన్య నిర్లక్ష్యాలను ఏవీ ప్రకటించ కుండా పరిహారం ప్రకటన మాత్రమే ఇచ్చి ఊరుకుంది ప్రభుత్వం. ఇక కంపెనీ ఎండి అమిత్ రాజ్ సిన్హా కూడా ముఖ్యమంత్రి ప్రకటించిన పరిహారం ఒక్కో మృతుని కుటుంబా నికి చెల్లిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. ఏడాదవుతున్నా బాధిత కుటుంబాలకు అవే కన్నీళ్లు, అదే ఆవేదన తప్ప పరిహారం ముచ్చట ఎప్పుడో పక్కదారి పట్టింది.

"సిగాచి పరిశ్రమలో ప్రమాదానికి కారణం రియాక్టర్ పేలుడు కాదని ,డ్రయర్ సెక్షన్‌లో డస్ట్ ఎక్స్ప్లోజన్ జరిగిందని పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. ఇక ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ యాజమాన్య తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపింది. పరిశ్రమలో కార్మికుల భద్రతను యాజమాన్యం గాలికొదిలేసిందని, 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో 26 మృతదేహాలు పడి ఉన్నాయంటే నిర్మాణ లోపాలే కారణం అని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. అక్కడ మండే స్వభావం ఉన్న 17 టన్నుల మైక్రో క్రిష్టలైన్ సెల్యులోజే కారణమని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఈ పదార్థాన్ని నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఉంచారు. దాంతోనే డ్రయర్ సెక్షన్ లో డస్ట్ ఎక్స్ ప్లోజన్ జరగటంతో అది మండి 900 నుంచి 1000 డిగ్రీల ఉష్ణోగ్రత వెలువడింది. దీంతో కార్మికులు మాడి మసైపోయారు."

సిగాచి పరిశ్రమలో ప్రమాదానికి కారణం రియాక్టర్ పేలుడు కాదని ,డ్రయర్ సెక్షన్‌లో డస్ట్ ఎక్స్ప్లోజన్ జరిగిందని పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. ఇక ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ యాజమాన్య తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపింది. పరిశ్రమలో కార్మికుల భద్రతను యాజమాన్యం గాలికొదిలేసిందని,750 చదరపు అడుగుల విస్తీర్ణంలో 26 మృతదేహాలు పడి ఉన్నాయంటే నిర్మాణ లోపాలే కారణం అని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. అక్కడ మండే స్వభావం ఉన్న 17 టన్నుల మైక్రో క్రిష్టలైన్ సెల్యు లోజే కారణమని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఈ పదార్థాన్ని నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఉంచారు. దాంతోనే డ్రయర్ సెక్షన్ లో డస్ట్ ఎక్స్ ప్లోజన్ జరగటంతో అది మండి 900 నుంచి 1000 డిగ్రీల ఉష్ణోగ్రత వెలువడింది. దీంతో కార్మికులు మాడి మసైపోయారు. ఇదంతా పరిశ్రమ యాజమాన్య నిర్వాహణ లోపాలే అని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ తేల్చింది. అడుగడుగునా పరిశ్రమలో నిబంధనలను తుంగలో తొక్కి లాభాలే ధ్యేయంగా యాజమాన్యం వ్యవహరించడం వల్లే ఇంతటి ఘోర ప్రమాదాన్ని చవిచూడాల్సి వచ్చిందని కమిటీ స్పష్టం చేసింది. రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబూరావు బాధిత కుటుంబాల తరుపున హైకోర్టును ఆశ్రయించారు. బాబూరావు దాఖలు చేసిన కేసను విచారణకు స్వీకరించిన హైకోర్టు ప్రభుత్వాన్ని, విచారణాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగితే సాక్షులను సేకరించడంలోను, విచారణ తీరులోను చిత్తశుద్ధి కన్పించడం లేదని చివాట్లు పెట్టింది. సిగాచి పరిశ్రమ రెడ్ కేటగిరీలో ఉంది, పన్నెండు శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత వ్యవధిలో తనిఖీలు చేస్తే ఇంత ప్రమాదం జరిగేదా? ఎందుకు అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహించింది. పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ పరిచి పెట్టుబడులను ఆహ్వానించే ప్రభుత్వాలు పరిశ్రమల భద్రతపై కనీస దృష్టిపెట్టవు. ప్రతి ఆరు నెలలకొకసారి జరగాల్సిన పరిశ్రమల్లో తనిఖీలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. అసలు తనిఖీలు చేసేందుకు సరిపడా యంత్రాంగం కూడా లేదు. తెలంగాణలో హైరిస్క్ పారిశ్రామిక యూనిట్లు 4,130 ఉన్నా వీటిని తనిఖీ చేసే అధికారులు కేవలం ఇరవై మంది ఉన్నట్లు సమాచారం. 2021లో దేశం మొత్తంలోని సాధారణ పరిశ్రమల్లో పట్టుమని పదిహేను శాతం పరిశ్రమల్లో తనిఖీలు చేయలేదని పలు నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. పైగా స్వీయ ధృవీకరణలను అనుమతించడం వంటి విధానపరమైన లోపాల వల్లే దేశంలో పారిశ్రామిక ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని నిపుణులు చెపుతున్నారు. 2013 2021 మధ్యలో దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీల చట్టం కింద నమోదైన కర్మాగారాల్లో సంభవించిన ప్రమాదాల్లో 10,208 మంది ప్రాణాలు కోల్పోయారు, దాదాపుగా 97 వేల మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ఎక్కువగా వలస కార్మికులే ఉండటం గమనార్హం. భారతదేశంలో సుమారుగా 14 కోట్ల మందికి పైగా వలస కార్మికులు ఉన్నట్లు అంచనా. వీరు దేశ జీడీపీకి పదిశాతం వాటాను అందిస్తున్నారు. అయినా వీరు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మానసిక ఆరోగ్యం ,ఒత్తిడి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొం టున్నారని అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. పరిశ్రమలు అనుమతి తీసుకున్న సామర్థ్యానికి మించి ఉత్ప త్తులను చేయడం ,అందుకు కార్మికులపై పని వత్తిడి పెంచడం, కనీస నైపుణ్యాలు లేని ఈ కార్మికులను కీలక ప్రదేశాల్లో పనులు చేయించడం అన్నది సర్వత్రా జరుగుతున్నా, పర్యవేక్షించే వ్యవస్థ లేకపోవడం తరచూ ప్రమా దాలకు కారణమవు తున్నాయి. అభివృద్ధి వేగంగా జరగాలని ప్రభుత్వా లు తీసుకునే అనాలోచిత నిర్ణయాలే సమాజానికి, కార్మిక వర్గానికి చేటు చేస్తున్నాయి. అభివృద్ధి అంటే ప్రజల ప్రాణాలను ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పణంగా పెట్టి కాదు కదా.

ఎక్కడ పరిశ్రమలో ప్రమాదం జరిగినా అది కార్మికుని లోపమే అన్నట్లుగా యాజమాన్యాలు, అధికారులు చూపే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సరైన విచారణ అన్నదే జరగదు, చార్జిషీటులు కూడా దాఖలు కావు. సింగపూర్‌లో పని ప్రదేశంలో కార్మికుడు చనిపోతే తక్కవ వ్యవధిలోనే విచారణ పూర్తిచేసినిర్లక్ష్యానికి కారణమైన యజమానికి జైలు శిక్షలు వేస్తారు. అదే ఆస్ట్రేలియాలో మ్యాన్ స్లాటర్ కేసుగా బుక్ చేసి చర్యలకు ఉపక్రమిస్తారు. కానీ మనదేశంలో చట్టాలు ఉన్నా అమలుకు నోచుకోవు. సిగాచి ఎండి అమిత్ రాజ్ సిన్హాతో పాటు ,ఇతర డైరెక్టర్లు చట్టాలలోని లొసుగులను ఉపయోగించు కుని చక్కగా బెయిల్ తెచ్చుకుని జైలు నుంచి బయటపడ్డారు. ప్రపంచంలో అనేక దేశాలు తిరిగి పెట్టుబడులను ఆకర్షించే పాలకులు ,ఆయా దేశాల్లో అమలు చేస్తున్న చక్కని పారిశ్రామిక, కార్మిక విధానాలను ఇక్కడ ఎందుకు అమలు చేయరు? ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎంత పెట్టుబడులు రాబట్టాము, wఎంత ఆదాయం వస్తుందన్న ధ్యాసే తప్ప కార్మికుల భద్రత పై పాలకులు కనీస దృష్టి పెట్టడం లేదు. సిగాచీ ఘోర ప్రమాదం నుంచి ప్రభుత్వం, అధికారులు గుణపాఠం నేర్చుకున్నట్లేమీ కన్పించడం లేదు. నెల రోజుల హడావుడి తప్ప అంతా మామూలే అన్నట్లు ఉంది. సిగాచి పరిశ్రమ బాధితులకు ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రకటించిన పరిహారం అందాలి. రెండు వందల పేజీల సాంకేతిక నిపుణుల కమిటీ నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయాలి, బాధ్యులపై వెంటనే కఠిన చర్యలకు ఉపక్రమించాలి. లేదంటే ప్రభుత్వం ఇచ్చే హామీలకు, చెప్పే మాటలకు ప్రజల్లో విశ్వాసం కోల్పోతుంది.



# జాతీయం-అంతర్జాతీయం





## బంకిపూర్ నుంచి ప్రశాంత్ కిశోర్

- **బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్‌ల్లో ఉప ఎన్నికలు**

**న్యూఢిల్లీ, జులై 5 (ఎ.ఎం.ఎస్):** ఇటీవల భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బీహార్ (బంకిపూర్), మధ్యప్రదేశ్ (దటియా), గుజరాత్ (మంజల్‌పూర్) లలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బీహార్ లోని బంకిపూర్ స్థానం నుంచి జన సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి వెల్లడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో బంకిపూర్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీజూలై 13 (సోమవారం)కాగా, నామినేషన్ పత్రాల పరిశీలన జూలై 14 (మంగళవారం)న జరగనుంది. అభ్యర్థులు తమ నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16 వరకు గడువు ఉంటుంది. బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లోని మూడు అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జూలై 30న జరుగుతుంది.

# ఢీ అంటే ఢీ..

- వివాదాస్పద బిల్లులపై వాడివేడి
- పార్లమెంటు వేదికగా అధికార, ప్రతిపక్షాల అస్త్రశస్త్రాలు



**న్యూఢిల్లీ, జులై 5(ఎ.ఎం.ఎస్) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగష్టు 13 వరకు సమావేశాలు కొనసాగుతాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సమావేశాల్లో దేశానికి సంబంధిచిన కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. పార్లమెంట్ ఉభయ సభల వర్షాకాల సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని అన్నారు. దేశానికి సంబంధించిన అంశాలపై సానుకూల చర్చ జరుగుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇటీవల పలు కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓడిపోవడం, బీజేపీ అధికారంలోకి రావడం, ఆ పార్టీకి చెందిన ఎంపీలు రెబల్‌స్‌గా మారడం, ఉద్ధవ్ ఠాక్రే శివ సేనలో మరోసారి చీలిక, ఆప్ ఎంపీలు బీజేపీలో చేరడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. గతంలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర మరోసారి సభలో ప్రవేశపెట్టబోతుంది. వివాదాస్పదమైన 130 రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) జులై 17న తన నివేదికను ఆమోదించే అవకాశం ఉంది. తీవ్ర నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధాని , ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు అరెస్టై వరుసగా 30 రోజుల పాటు న్యాయస్థాన కస్టడీలో ఉంటే, వారు ఆటోమేటిక్‌గా పదవిని కోల్పోవాలనే నిబంధనను యథాతథంగా ఉంచే సూచనలు అందులో పొందుపరిచనున్నట్టు తెలుస్తోంది. రాజకీయ ప్రేరేపిత దర్యాప్తులు, అరెస్టులతో ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరచే ప్రమాదం ఉందని ప్రతిపక్షం వాదిస్తోంది. అలాగే మరోవైపు నీట్ పేపర్ లీక్ అంశంతోపాటు చమురు ధరల పెరుగుదల ప్రతిపక్షాలకు అస్త్రంగా మారనున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశ సైనికుల ప్రాణనష్టంపై సభను తప్పుదోవ పట్టించేలా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టమైన అబద్ధం చెప్పారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. దీనిపై ప్రివిలేజ్ నోటీసు కూడా ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.



## బంధం బలపడుతోంది..

**బీజింగ్, జులై 5(ఎ.ఎం.ఎస్):** ఆర్థిక, వాణిజ్య సంబంధాలు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ చైనా, యూరప్‌లు ఉన్నత స్థాయి సమావేశాలు, సంప్రదింపులను ముమ్మరం చేశాయి. విభేదాల పరిష్కారానికి ఇరు పక్షాలు సుముఖంగా ఉన్నాయని చెప్పడానికి ఇది సంకేతం. డెన్మార్క్ రాజు ఫ్రెడరిక్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ శుక్రవారం భేటీ అయ్యారు. వివిధ రంగాలలో డెన్మార్క్‌తో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి, ఇరు దేశాల ప్రజల మధ్య మార్పిడులను ప్రోత్సహించడానికి చైనా సిద్ధంగా ఉన్నదని తెలిపారు. డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లొక్కే రాస్ముసేన్‌తో కూడా వాంగ్ యీ సమావేశమయ్యారు.ఇటీవలి కాలంలో చైనా, యూరప్ మధ్య సంప్రదింపులు బాగా పెరిగాయి. అందులో భాగంగానే డెన్మార్క్‌లో వాంగ్ యీ పర్యటించారు. లండన్‌లో రెండు రోజుల క్రితం జరిగిన చైనా-బ్రిటన్ సంయుక్త ఆర్థికవాణిజ్య కమిషన్ పదిహేనవ సమావేశానికి చైనా వాణిజ్య మంత్రి వాంగ్ వెంటావో, బ్రిటన్ వాణిజ్యవ్యాపార వ్యవహారాల కార్యదర్శి పీటర్ కైల్ అధ్యక్షత వహించారు.

వాణిజ్యం, పెట్టుబడులు, ప్రాంతీయబహుపాక్షిక సహకారంపై ఇరు పక్షాలు తమ అభిప్రాయాలు పంచుకున్నాయి.

### బంగాళాఖాతంలో అల్పపీడనం

## ఏడుగురు మత్స్యకారులు గల్లంతు

- గాలింపు చర్యలు ముమ్మరం



**విశాఖపట్నం, జులై 5 (ఎ.ఎం.ఎస్):** అల్పపీడన ఉద్ధృతికి బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారడంతో విశాఖ తీరం నుంచి వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. ఈ నెల 1న విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి వీరంతా ఒకే బోటుపై సముద్రంలోకి వేటకు వెళ్లారు. సముద్రంలో వాతావరణం అనుకూలించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వీరిని ఫోన్ ద్వారా సంప్రదించగా.. శనివారం మధ్యాహ్నానికల్లా తీరానికి చేరుకుంటామని చెప్పారు. అయితే, సాయంత్రం దాటినా బోటు హార్బర్‌కు చేరుకోకపోవడంతో తీరంలో ఆందోళన మొదలైంది.

ప్రస్తుతం వీరి ఫోన్లు పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వేటకు వెళ్లిన బోటులో విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన చిన్న, గరగయ్య, అప్పలరాజు, కె.చిన్నయ్య, సీతోడుతో పాటు భీమిలి మండలం పెద నగమయ్యపాలేనికి చెందిన బండయ్య, విశాఖకు చెందిన చిన్న అమ్మోరు ఉన్నారు. సమాచారం అందుకున్న మత్స్యశాఖ అధికారులు గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు

చేపట్టినట్టు తెలుస్తోంది.

# ట్రంప్‌నకు మైండ్ దొబ్బింది..

- ఖమేని అంత్యక్రియల వేళ అర్థం లేని మాటలు
- ఇరాన్ నేతలందర్నీ ఒక్క దెబ్బతో లేపేస్తామంటూ వ్యాఖ్యలు

**న్యూయార్క్, జులై 5(ఎ.ఎం.ఎస్) :** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలతో ఆ దేశం శోకసంద్రంలో మునిగిపోయింది. అమెరికా ఇరాన్ యుద్ధం మొదలైన సమయంలోనే ఖమేనీని అమెరికా బలగాలు హతమార్చాయి. అయితే, ఈ అంత్యక్రియలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ అగ్రనేతలంతా ఒకే చోట చేరారని, తలచుకుంటే ఒక్క దాడితో వారందరినీ హతమార్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దౌత్య చర్చలు కొనసాగుతున్నందున అలాంటి చర్య తీసుకోవడం లేదని చెప్పడం చర్చనీయాంశమైంది. అమెరికా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ "అందరూ ఒకే చోట ఉన్నారు. ఒక్క దాడి చేస్తే అందర్నీ అంతం చేయొచ్చు. కానీ అలా చేయం. ఎందుకంటే అలా చేస్తే చర్చలు జరిపేందుకు ఎవరూ మిగలరు" అని వ్యాఖ్యానించారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని నివాళులర్పించడంపై కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు.ఖమేనీని ఇరాన్ ప్రజల్లో చాలామంది వ్యతిరేకిస్తారని తాను భావించానని, అయితే భారీ సంఖ్యలో ప్రజలు దుఃఖించడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. "అవి నిజమైన కన్నీళ్లు కాకపోవచ్చు.. నకిలీ కన్నీళ్లు కూడా కావచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు ఆక్సియోస్ పేర్కొంది. ఇరాన్ అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని కూడా ట్రంప్ అన్నారు. వాళ్లు ఒప్పందం కోసం వేడుకుంటున్నారు అని పేర్కొన్న ఆయన, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇరు దేశాలు వారం రోజుల పాటు చర్చలు, సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేయాలని అంగీకరించాయని తెలిపారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. అర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "మీకు నాగరికత లేదు.. చరిత్ర లేదు.. గౌరవం లేదు. అందుకే ఇలాంటి విషయాలు మీకు అర్థం కావు" అంటూ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేసింది. టెహ్రాన్‌లో నిర్వహించిన ఖమేనీ అంత్యక్రియలకు వేలాదిమంది ప్రజలు హాజరయ్యారు. ఇరాన్ జెండాలు ఊపుతూ, ఖమేనీ చిత్రపటాలతో ప్రజలు నివాళులర్పించారు.






ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యుల శవపేటికలను కూడా ప్రజల సందర్శనార్థం ఉంచారు.

### జమ్మూకాశ్మీర్‌లో

## ఎన్‌కౌంటర్

- ఇద్దరు ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్, జులై 5 (ఎ.ఎం.ఎస్) :** జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. చన్‌పోరా గ్రామంలో శనివారం రాత్రి భద్రత బలగాలు చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు జాకీర్ అహ్మద్ గనీ, లతీఫ్ భట్ మృతి చెందారు. ఇందులో జాకీర్ అహ్మద్ గనీని వీలైనంత త్వరగా పట్టుకోవాలని గతంలో ఎన్ఐఏ కోర్టు కూడా ప్రకటన విడుదల చేసింది. లష్కరే తోయిబా



కీలక ఉగ్రవాది అయిన జాకీర్ అహ్మద్.. గతంలో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలోనూ కీలక వ్యక్తిగా అనుమానిస్తున్నారు.

# ట్రంప్‌నకు దెబ్బ మీద దెబ్బ...

- వలసదారులకు అమెరికా కోర్టు ఉపశమనం
- ట్రంప్ కఠిన చర్యల బారి నుంచి విముక్తి

**న్యూయార్క్, జులై 5:** అమెరికాలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమలు చేస్తున్న కఠిన వలస విధానానికి ఎదురుదెబ్బ తగిలింది. దేశ బహిష్కరణ (డిపోర్టేషన్) ప్రక్రియ కొనసాగుతోందనే కారణంతో వలసదారులను 90 రోజులకు మించి నిర్బంధించాలంటే వారికి తప్పనిసరిగా బెయిల్ కోరేందుకు విచారణ (బాండ్ హియరింగ్) అవకాశం కల్పించాలని అమెరికా ఐదో సర్క్యూట్ అప్పీల్ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కీలక తీర్పు టెక్సాస్, లూసియానా రాష్ట్రాల్లో నిర్బంధంలో ఉన్న వేలాది మంది వలసదారులకు ఉపశమనం కలిగించే అవకాశముంది.

అమెరికాలో అక్రమ వలసలను అరికట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో దేశంలో ఇప్పటికే నివసిస్తున్న కొంతమంది విదేశీయులను కూడా 'అడ్మిషన్ కోరుతున్న దరఖాస్తుదారులు'గా పరిగణించి, వారి డిపోర్టేషన్ కేసులు పూర్తయ్యే వరకు బెయిల్ అవకాశం లేకుండా తప్పనిసరి నిర్బంధంలో ఉంచే విధానాన్ని అక్కడి యంత్రాంగం అమలు చేస్తోంది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ ఇద్దరు మెక్సికో పౌరులు, ఒక హోండురాస్ పౌరుడు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన న్యూ ఆర్లియన్స్ కేంద్రంగా పనిచేసే ఐదో సర్క్యూట్ అప్పీల్ కోర్టు 21 మెజారిటీతో కీలక తీర్పు వెలువరించింది.



***అమెరికాలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమలు చేస్తున్న కఠిన వలస విధానానికి ఎదురుదెబ్బ తగిలింది. దేశ బహిష్కరణ (డిపోర్టేషన్) ప్రక్రియ కొనసాగుతోందనే కారణంతో వలసదారులను 90 రోజులకు మించి నిర్బంధించాలంటే వారికి తప్పనిసరిగా బెయిల్ కోరేందుకు విచారణ (బాండ్ హియరింగ్) అవకాశం కల్పించాలని అమెరికా ఐదో సర్క్యూట్ అప్పీల్ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కీలక తీర్పు టెక్సాస్, లూసియానా రాష్ట్రాల్లో నిర్బంధంలో ఉన్న వేలాది మంది వలసదారులకు అమెరికాలో అక్రమ వలసలను అరికట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో దేశంలో ఇప్పటికే నివసిస్తున్న కొంతమంది విదేశీయులను కూడా 'అడ్మిషన్ కోరుతున్న దరఖాస్తుదారులు'గా పరిగణించి,***

ఈ తీర్పు ప్రకారం.. వలసదారులను 90 రోజులకు మించి నిర్బంధించాలంటే వారికి ఇమ్మిగ్రేషన్ న్యాయమూర్తి ఎదుట హాజరై బెయిల్‌పై విడుదల కోరే అవకాశం ఇవ్వాల్సిందే. ఎలాంటి విచారణా లేకుండా నిరవధికంగా నిర్బంధించడం అమెరికా రాజ్యాంగంలోని ఐదో సవరణ కల్పించిన న్యాయ ప్రక్రియ హక్కులకు విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. అయితే ట్రంప్ నియమించిన న్యాయమూర్తి కోరీ విల్సన్ ఈ తీర్పుతో విభేదించారు. వలస అంశాలపై నిర్ణయాధికారం ప్రధానంగా అమెరికా కాంగ్రెస్‌కే ఉందని, కోర్టు ఆ అధికార పరిధిని తగ్గిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. వలసదారుల తరఫున వాదించిన అమెరికన్ ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ న్యాయవాది రెబెక్కా క్యాస్లర్ ఈ తీర్పును స్వాగతించారు. ప్రభుత్వం ఎవరినీ నిరవధికంగా నిర్బంధించే అధికారం లేదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆమె వివరించారు. మరోవైపు అమెరికా అంతర్గత భద్రతా శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ) మాత్రం ఈ తీర్పుతో విభేదించింది. తప్పనిసరి నిర్బంధంపై తమ న్యాయపరమైన వాదన బలంగా ఉందని,

ఈ అంశంపై తుది నిర్ణయం కోసం ఇప్పటికే అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించామని వెల్లడించింది.

## మాకు మద్దతునివ్వండి..

- **పీవోకేలోని ప్రజలకు సర్దార్ అమర్ ఖాన్ విజ్ఞప్తి**
- **ఉధృతమవుతోన్న నిరసనలు**



**శ్రీనగర్, జులై 5:** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో గత నెల ప్రారంభమైన పాకిస్థాన్ వ్యతిరేక నిరసనలు మరింత ఉద్ధృతమవుతున్నాయి. ఈ ఉద్యమాన్ని ఉక్కుపాదం అణచివేయడానికి పాకిస్థాన్ సైన్యం చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలో మానవహక్కుల ఉల్లంఘనకు తెగబడుతోంది. పాక్ ఆర్మీ దురాగతాలకు వ్యతిరేకంగా జులై 5న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ భారీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి తమకు శ్రీనగర్, లడఖ్, పూంచ్, రాజౌరి, జమ్మూ, లడఖ్ ప్రజలు సంఘీభావంగా నిలబడాలని ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న సర్దార్ అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు.

ఒక వీడియో సందేశంలో అమన్ ఖాన్.. నిరసనకారులపై పాక్ సైన్యం అణచివేతకు పాల్పడుతున్నారని, ఉద్యమాన్ని అణగదొక్కడానికి ఆహార సరఫరాను కూడా నిలిపివేశారని ఖాన్ ఆరోపించారు. ''మేము అఘాయిత్యాలకు గురయ్యాం... మాకు ఆహారాన్ని కూడా అందకుండా చేస్తున్నారు'' అని పేర్కొంటూ పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజల పోరాటాలకు మద్దతు ఇవ్వాలని జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రజలను ఆయన అభ్యర్థించారు. పీఓకే వ్యాప్తంగా ముఖ్యంగా ముజఫరాబాద్, రావల్‌కోటలో నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. సైన్యం అణచివేతకు దిగిన తర్వాత నిరసన ప్రదర్శనలు తీవ్రమయ్యాయని, పీఓకేలో ఘోరమైన ఘర్షణలకు, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌లకు దారితీసిందని భారత సైన్యం మాజీ అధికారి మేజర్ జనరల్ ఏకే సివాచ్ (రిటైర్డ్) తెలిపారు.

కాగా, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ అనేది 38 అంశాల డిమాండ్ల చార్టర్‌తో పౌర ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కూటమి. ఆర్థిక సంస్కరణలు, స్థానిక వనరుల అసమాన పంపిణీ అంతం వంటి కీలక డిమాండ్లు ఇందులో ఉన్నాయి. 1947 తర్వాత పాకిస్థాన్ ప్రధాన భూభాగంలో స్థిరపడిన కశ్మీరీ శరణార్థుల కోసం రిజర్వ్ చేసి 12 శాసనసభ సీట్లను రద్దు చేయాలని కూడా ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఈ సీట్లు స్థానిక రాజకీయాలను ప్రభావితం చేయడానికి, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించని ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి ఇస్లామాబాద్‌కు అవకాశం కల్పిస్తున్నాయని నిరసనకారులు వాదిస్తున్నారు. పారామిలిటరీ దళాల మోహరింపును తగ్గించాలని, రాజకీయ ఉన్నత వర్గాలు అనుభవిస్తున్న ప్రత్యేక హక్కులను అంతం చేయాలని కూడా వారు పిలుపునిచ్చారు.

### ఆర్మీ ట్రక్కును ఢీకొన్న అంబులెన్సు

## ముగ్గురు మృతి



**జైపూర్, జులై 5(ఎ.ఎం.ఎస్) :** రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి62పై ఒక ప్రైవేట్ అంబులెన్స్ ఆర్మీ ట్రక్కును ఢీకొట్టింది .ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం, 22 ఎల్‌జిడబ్ల్యు గ్రామం సమీపంలో అంబులెన్స్ ఆర్మీ ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు తెలిపారు. మృతులు శ్రీ గంగానగర్ జిల్లాలోని హిందూమల్‌కోట్ ప్రాంతంలోని చక్ 5బి గ్రామానికి చెందినవారని గుర్తించారు. ఈ ఘటన జరిగిన వెంటనే, సదర్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని సూరత్‌గఢ్ ట్రామా సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం, గాయపడిన వారిని ఉన్నత వైద్య సదుపాయానికి రిఫర్ చేశారు. మృతుల మృతదేహాలను సూరత్‌గఢ్ సబ్‌డివిజనల్ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు.

## ఇక నుంచి కొత్త సేవా రుసుములు

- **చైనాలోని ఇరాన్ రాయబారి వెల్లడి**

**బీజింగ్, జులై 5:** హర్మూజ్ జల సంధి గుండా వెళ్లే నౌకలపై కొత్త సేవా రుసుములను విధిస్తామని చైనాలో ఇరాన్ రాయబారి తెలిపారు. అయితే.. ఇటీవల ఘర్షణల సమయంలో ఇరాన్‌కు మద్దతు ఇచ్చిన దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. బీజింగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యూహాత్మక జల మార్గం ద్వారా వెళ్లే నౌకల రవాణాను నిర్వహించడానికి కొత్త ఏర్పాట్లపై ఒమన్‌తో కలిసి ఇరాన్ పనిచేస్తుందని వెల్లడించారు. నౌకలపై రుసుముల ఆలోచనను అమెరికా తిరస్కరించినప్పటికీ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎస్ఐఆర్‌పై ఇంటింటికీ అవగాహన

**ప్రతి ఓటరు వివరాలు పరిశీలించుకోవాలి**

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ, జూలై 5 {వుదయం ప్రతినిధి} :**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతి ఓటరికి పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో పరిశీలించుకుని, అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అపోహలు, సందేహాలు తొలగించి సరైన సమాచారం అందించడం ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల ఉమ్మడి బాధ్యత అని అన్నారు. అందుకే ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఈ ప్రక్రియను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సమాచారం, మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఏవైనా సందేహాలు ఉంటే విధుల్లో ఉన్న బీఎల్‌వోలు, బీఎల్ఏలు వెంటనే నివృత్తి చేసి అవసరమైన సహాయం అందిస్తారని పేర్కొన్నారు.ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలనిపుల్కం రాజు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణ పౌరుల బాధ్యత

**అంబేద్కర్ ఆశయాలను ఆచరించాలి ఎస్ఐ మహేష్**

**ఘనంగా బాబాసాహెబ్ స్మరణ**



**ధర్మపురి, జూలై 5 (వుదయం ప్రతినిధి):**

దేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయాన్ని అందించిన మహోన్నత గ్రంథం భారత రాజ్యాంగమని ఎస్ఐ మహేష్ అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించడం, చట్టాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన స్పష్టం చేశారు.పట్టణ కేంద్రంలో అంబే ద్కర్ సంఘం మండల అధ్యక్షుడు అరికిల్ల సతీష్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంబేత్కర్ సంస్మరణ కార్యక్రమం ఈ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ మహేష్ ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స మాజం లో వేళ్లూనుకున్న కుల వివక్ష, అంటరానితనం వంటి అసమానతలను తరిమికొట్టేందుకు బాబాసాహెబ్ నిరంతరం శ్రమించారని కొనియాడారు. రాజ్యాంగ రూపకల్పనలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశ ప్రజలందరికీ సమాన హక్కు లు కల్పించడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.ప్రజల భద్రత,శాంతిభ ద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని చెప్పారు. అంబే ద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బందారి రంజిత్, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు రాగుల కాంతన్న, మాల మహానాడు మండల అధ్యక్షుడు అనంతుల లక్ష్మణ్, నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్, రాష్ట్ర నాయ కుడు పిప్పాల గంగరాజం, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ శ్రీనివాస్‌కు ఘన వీడ్కోలు



**జన్నారం, జూలై (వుదయం విలేఖరి)**

జన్నారం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ జి. శ్రీనివాస్ రామగుండం కమీషనరేట్ పరిధిలోని పీసీఆర్ కు బదిలీ పై వెళ్లారు.ఈ సందర్భంగా ఆదివారం ఆయనకు జన్నారం పోలీసుస్టేషన్ లో సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.ఎస్ఐ జి.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన జన్నారం స్టేషన్‌లో అందించిన సేవలను సిబ్బంది గుర్తుచేసుకున్నారు. కొత్త బాధ్యతల్లో మరింత రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నాం...

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ**

**మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల/జూలై 5(వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని, 143 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు. అర్హులైన పెంకుటిల్లు ఉన్నవారికి, సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, రేషన్ కార్డులు జారీ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 36 కోట్ల రూపాయలతో 56 కిలోమీటర్ల మేర రహదారులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 63 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు నిర్మించడం జరుగుతుందని, భీమారం మండల పరిధిలో 6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ఆందోళనలు కలిగిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో రహదారి విస్తరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, 1 కోటి 60 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని, 1 కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 20 షాపులలో పేద వ్యాపారస్తులకు ప్రాధాన్యత ఇచ్చి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12 కోట్ల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో చెన్నూర్ నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని గ్రామాలలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి.సి. మురుగు కాలువలలో మ్యాజిక్ సోక్ పీట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, తద్వారా భూగర్భ జల శాతాన్ని పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో భీమారంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనారిటీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్న భోజనం విషయంలో ఏర్పడిన గందరగోళంలో ఎలాంటి వాస్తవం లేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగా పిల్లలతో అబద్ధాలు చెప్పించారని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యా సంస్థలలో ఈ సంవత్సరం నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 3 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధి ప ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యాసంస్థలలో సి.సి. కెమెరాల తో పర్యవేక్షించడం జరుగుతుందని, విద్యార్థులకు 200 శాతం కాస్మోటిక్, 40 శాతం డైట్ చార్జీలు పెంచి అందించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలలు, అదనపు తరగతి గదులు నిర్మించడం జరుగుతుందని, ఆర్.ఓ. ప్లాంట్లు ఏర్పాటుచేసి శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.అనంతరం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు నిర్మించుకున్న ఇంటిని జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి ప్రారంభించారు.

# సంక్షేమ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి :

### రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, జూలై 05 (వుదయం ప్రతినిధి)**

సంక్షేమ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రోటోకాల్ & ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్ , ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పెద్దపెల్లి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్,పట్టణాభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్లు, వైద్య శాఖ, విద్యా శాఖ, ఎస్సి, తీసి, మైనారిటీ సంక్షేమ శాఖ, పరిశ్రమల, రెవెన్యూ శాఖ, వి.బి.జి రామ్ జి, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా , అటవీ శాఖ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి పై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వానికి ఇంకా రెండున్నర సంవత్సరాలకు పైగా పదవీకాలం ఉందని, ఈ కాలంలో ప్రతి అధికారి మరింత బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలని మంత్రి అన్నారు.ప్రజలకు సమయం కేటాయించి వారి సమస్యలను ఓపికగా వినాలని, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎలాంటి విసుగు లేకుండా ప్రతి దరఖాస్తును పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల్లో లోపాలు ఉంటే లేదా ఏదైనా పని ఆలస్యం అవుతుంటే దానికి గల కారణాలను ప్రజలకు స్పష్టంగా, వారికి అర్థమయ్యే విధంగా వివరించాలని ఆదేశించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు. చిన్న సమస్య అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. తెలిసి ఎలాంటి తప్పిదాలు చేయకుండా ప్రతి అధికారి అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా స్థాయిలో సమగ్ర శ్వేతపత్రం (వైట్ పేపర్) సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదు, సూచన, అభిప్రాయం ప్రభుత్వానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, వాటి ఆధారంగా లోపాలు, పెండింగ్ అంశాలు, బ్యాక్ లాగ్ లను గుర్తించి వెంటనే సరిదిద్దే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా పరిపాలన, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నాయకత్వంలో అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సేవల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు వంటి రంగాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు.రైతుల కోసం పెద్దపల్లి జిల్లాలో ప్రారంభించిన యూరియా బుకింగ్ యాప్ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా ఆదర్శంగా నిలిచిందని మంత్రి అన్నారు. జిల్లాలో ప్రతి అర్హ రైతుకు అవసరమైన సమయంలో యూరియా తప్పనిసరిగా అందేలా చూడాలని, అవసరం లేని వారికి యూరియా పంపిణీ జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగువైపు ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి పంటల సాగును విస్తరించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు రకాల వరి వంగడాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి మండలంలోని రైతు వేదికల్లో ఆ ఏడు రకాల విత్తనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన విత్తన మేళా తరహాలో రైతులకు నాణ్య మైన విత్తనాలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు రైతులతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో పంటలను పర్యవేక్షించాలని, రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని తెలిపారు. అనధికారిక, నాణ్యతలేని విత్తనాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. జిల్లాలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఏడు రకాల వరి వంగడాలను ప్రభుత్వం ముందుగానే గుర్తించి వాటికి బోనస్ ప్రకటించిందని తెలిపారు. రైతులు కూడా ఆయా ఏడు రకాల వరి వంగడాలనే సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గతంలో రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత కూడా 45 రోజుల వరకు చెల్లింపులు అందని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా నగదు జమ చేస్తోందని తెలిపారు. రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులు నాణ్యమైన విత్తనాలతో ప్రభుత్వం సూచించిన వరివంగడాలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని ప్రభుత్వ విప్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ యూరియా యాప్ వినియోగంతో గత యాసంగిలో జిల్లాలో యూరియా వినియోగం 19 శాతం తగ్గిందని తెలిపారు. వానాకాలం సీజన్‌కు అవసరమైన యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 21,126 మంది రైతులకు యాప్ ద్వారా 2,453 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని అన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, గత మూడు సంవత్సరాల్లో 3,572 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా రూ.5.43 కోట్ల సబ్సిడీ అందించామని చెప్పారు.పీఎం కుసుమ్ పథకం కింద నాలుగు మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎలిగేడు వద్ద ప్రపంచ స్థాయి గోదాముల నిర్మాణానికి భూమి కేటాయించామని తెలిపారు.గత యాసంగిలో రికార్డు స్థాయిలో 65,129 మంది రైతుల నుంచి 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1,057 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో 6,276 ఇళ్లను మంజూరు చేయగా 1,909 గృహప్రవేశాలు పూర్తయ్యాయని, రూ.130.24 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రెండో విడతకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి అర్హులను గుర్తిస్తున్నామని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కూడా వేగంగా కొనసాగుతోందన్నారు. మంచిర్యాల–వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, మేడిపల్లి పరిశ్రమల పార్కు, శ్రీపాద మార్గం–మంథని నాలుగు లైన్ల రహదారి, పెద్దపల్లి బైపాస్ తదితర ప్రధాన ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఎస్ఐఆర్ లో 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని చెప్పా రు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తూ ప్రతి నెల ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 14 లక్షలకుపైగా ఉపాధి దినాలు కల్పించామని, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, ఉపాధి అవకాశాలు, శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా అమలుచేస్తున్నామని పేర్కొన్నారు. వైద్య రంగంలో మంథని 50 పడకల ఆసుపత్రి, రామగుండం మెడికల్ కళాశాల హాస్టల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి రాష్ట్రస్థాయిలో అవార్డులు సాధించిందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఓపీ, ఇన్‌పేషెంట్లు, ప్రసవాలు, శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ ఆధారిత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదు పైలట్ ప్రాజెక్టు పెద్దపల్లి జిల్లాలో విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు.

## వైభవంగా పోచమ్మ, మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపనలు..

**ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్**



**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి):**

పట్టణంలోని భుక్తాపూర్‌లో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ధోబీ కాలనీలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలతో జీవించాలనిఆకాంక్షించారు. జిల్లాలో పాడిపంటలు సమృద్ధిగా పండుతూ రైతులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్నాల నరేష్, సాయి, భరత్, సచిన్, గంగాధర్, ఆదిత్య, దేవన్న, సంతోష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ లో బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్...



**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ జూలై 5 (వుదయం ప్రతినిధి)**

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి, నిలిచిపోయిన పంపులను ప్రారంభించేందుకు వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డా. రాజా రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల పట్ల కనీస ప్రేమ, అవగాహన ఉంటే నాయకులను అరెస్ట్ చేయించకుండా, వృథాగా పోతున్న కాళేశ్వరం నీటిని కన్నెపల్లి పంపుల ద్వారా రిజర్వాయర్లలోకి తరలించి రైతులకు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి పోలీసు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు.ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా ప్రజల పక్షాన నిలబడి, రైతులకు న్యాయం జరిగే వరకు నిరంతరం పోరాడతామని తెలిపారు.

## పుష్కరాల నాటికి ఆలయాలకు నూతన శోభ

**కోటిలింగాల క్షేత్ర అభివృద్ధికి రూ.10 కోట్లు**

**ధర్మపురి నియోజకవర్గానికి రూ.117 కోట్ల పుష్కర నిధులు**

**కుక్కకాటు బాధితుడి కుటుం బానికి రూ.5 లక్షల చెక్కు పంపిణీ**

**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి జూలై 5 (వుదయం ప్రతినిధి):**

రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తీర ప్రాంత ఆ లయాలకు నూతన శోభ తీసుకు రావడమే ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం వెల్గటూర్ మండ లం కోటిలింగాలలోని శ్రీ కోటేశ్వర స్వా మి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం మంత్రి అడ్లూరి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ముందుచూపుతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఏడాది ముందే బడ్జెట్‌లో పుష్కర నిధులు కేటాయించారన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.ఇందులో భాగం గా ధర్మపురి నియోజకవర్గానికి రూ.117 కోట్లు కేటాయించగా కోటిలింగాల ఆలయా నికి రూ.10 కోట్లు, పుష్కర ఘాట్ నిర్మాణానికి రూ.8 కోట్లు,వెల్గటూర్ –కోటిలిం గాల నాలుగు లైన్ల రహదారి విస్తరణకు రూ.20 కోట్లు,కోటిలిం గాల – పాశీగాం రోడ్డుకు రూ.8 కోట్లు కేటాయించినట్లు వివరిం చారు. రాజక్కపల్లి వద్ద మినీ ట్యాంక్ బండ్ నిర్మిస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.బాధిత కుటుంబానికి పరామర్శ రూ.5 లక్షలసాయం ఇటీవల కుక్క కాటుకు గురై మరణిం చిన కోటిలింగాల గ్రామా నికి చెందిన బాలుడు మంచికట్ల మణితేజ కుటుం బాన్ని మంత్రి పరామర్శించారు. ప్రభు త్వం తరపున మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును గ్రామ పంచా యతీ కార్యాలయం వద్ద బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇందిరమ్మ ఇంటి గృహప్ర వేశంలోమంత్రి వెల్గటూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి లబ్ధి దారులు సింగం రాజేశ్వరి తిరు పతి దంపతుల గృహప్రవేశ మహోత్సవంలో మంత్రి పాల్గొని శుభాకాంక్షలు తెలిపా రు. పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పిం చాలనే ఆశయంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ: జిల్లా కలెక్టర్



**ఆదిలాబాద్ (ఉదయం ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగు ప్రారంభ దశలో ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న రైతు భరోసా వానాకాలం 2026 పథకం కింద పెట్టుబడి సాయాన్ని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,44,945 మంది రైతుల ఖాతాల్లో రూ.243.56 కోట్ల పెట్టుబడి సాయం జమ చేసినట్లు వెల్లడించారు. సాగు పనుల ప్రారంభ దశలో రైతులకు పెట్టుబడి కొరత లేకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.రైతులకు సంబంధించిన తాజా గణాంకాలు, నిధుల విడుదల వివరాలను ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన సమాచారం సకాలంలో చేరేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నియోజకవర్గాల వారీగా ఆదిలాబాద్‌లో 39,161 మంది రైతులకు రూ.66.04 కోట్లు, బోథ్‌లో 77,736 మంది రైతులకు రూ.125.95 కోట్లు, ఖానాపూర్‌లో 62,632 మంది రైతులకు రూ.75.30 కోట్లు జమ చేసినట్లు వివరించారు. రైతు భరోసా పథకం అమలులో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, పథకాల ప్రయోజనాలు పూర్తిగా రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు లేదా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## లోవోల్టేజ్ సంకెళ్లు తెంచుకుంటూ జిల్లెడబండకు 'విద్యుత్' ఊరట!

- **దశాబ్దాల చీకట్లకు చెక్.. నాణ్యమైన సరఫరా దిశగా ముందడుగు**
- **సర్పంచ్ నాగేష్ నాయుడు చొరవ.. కదిలిన విద్యుత్ యంత్రాంగం**
- **శరవేగంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల పనులు.. నిరంతర ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం**

**గద్వాల జులై 05 (వుదయం బ్యూరో):**
ఆ ఊరి నరనరాల్లో దశాబ్దాలుగా ప్రవహిస్తున్న లోవోల్టేజ్ చీకట్లు త్వరలోనే శాశ్వతంగా తొలగిపోనున్నాయి. జిల్లెడబండ గ్రామపంచాయతీ పరిధి లోని జిల్లెడబండ, మర్లపల్లి గ్రామాల ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న సుదీర్ఘ విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రజాప్రతినిధుల పట్టుదల, అధికారుల తక్షణ స్పందన తోడవ్వడంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా అడుగులు పడ్డాయి. రెండు గ్రామాల్లోనూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అంకురార్పణ జరగడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## గద్వాల రిజిస్ట్రేషన్లలో 'సాక్షుల' సంతల బేరం!

- **నడిరోడ్డుపై సాక్ష్యం విక్రయం.. ఒక్కో సంతకానికి రేటు కట్టిన 'సిండికేట్'!**
- **భూమి ఎక్కడుందో తెలియదు.. అమ్మేవాడెవరో పట్టదు.. నోట్లేస్తే చాలు 'సాక్షి'గా అవతారం!**
- **బయోమెట్రిక్ కళ్లుగప్పి బరితెగింపు.. రోజూ పదుల సంఖ్యలో ఒకే ముఖాల సంతకాలు!**
- **'సబ్ రిజిస్ట్రార్' అండతోనే అక్రమ దందా?.. రేపు కోర్టుల్లో దస్తావేజులు చెల్లకుంటే కొనుగోలుదారుల గతేంటి?**

**గద్వాల జూలై 05 (వుదయం బ్యూరో)**
చట్టబద్ధతకు నిలయంగా నిలవాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం.. నకిలీ సాక్ష్యాల అడ్డాగా మారింది! నిబంధనలు తుంగలో తొక్కి, చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటూ కొందరు మధ్యవర్తులు సాగిస్తున్న సాక్ష్యాల దందా ఇప్పుడు గద్వాలలో కలకలం రేపుతోంది. భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో అత్యంత కీలకమైన 'సాక్షి సంతకాల' వ్యవస్థ ఇక్కడ నవ్వులపాలవుతోంది. క్రయవిక్రయదారులకు నమ్మకస్తులైన వారే సాక్షులుగా ఉండాలనే కనీస నియమాన్ని తుంగలో తొక్కి, చేతిలో ఐదువందలో, వెయ్యో పెడితే చాలు ఎవరి పత్రాల మీదైనా సాక్షిగా సంతకం పెట్టేందుకు దళారులు క్యూ కడుతున్నారు. అధికారుల కళ్లముందే సాగుతున్న ఈ అంగడి బేరం.. భవిష్యత్తులో పెను భూ వివాదాలకు, అమాయకుల కొంపలు ముంచడానికి దారితీయబోతోంది.

**కక్కుర్తి 'సంతకం'.. నడిరోడ్డుపై సాక్ష్యం!**
రిజిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం దస్తావేజుల పై సంతకం చేసే సాక్షులకు ఆ భూమి లావాదేవీలపై, కొనుగోలుదారులపై పూర్తి అవగాహన ఉండాలి. రేపు పొద్దున కోర్టు మెట్లు ఎక్కినా సాక్ష్యం చెప్పే నైతిక బాధ్యత వారిదే. కానీ గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో సీన్ చూస్తే గుండె గుభేల్ అంటుంది. అక్కడ తిష్టవేసిన కొందరు బ్రోకర్లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. భూమి ఎక్కడుందో, దానికి యజమాని ఎవరో తెలియకపోయినా.. కేవలం డబ్బుల కోసం సాక్షులుగా మారిపోతున్నారు. ఒకే వ్యక్తి రోజుకు 10 నుంచి 20 దస్తావేజులపై యథేచ్ఛగా సాక్షి సంతకాలు పెడుతూ ఈ చట్టబద్ధమైన వ్యవస్థను అపహాస్యం చేస్తున్నాడు.

**బయోమెట్రిక్ ఉన్నా.. 'మామూలుగా' చూస్తున్నారా?**
ప్రస్తుతం దస్తావేజుల రిజిస్ట్రేషన్లలో ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ (వేలిముద్రల) విధానం అమలులో ఉంది. ఇంతటి అధునాతన సాంకేతికత ఉన్నా ఈ అక్రమ దందా ఎలా సాగుతోంది? ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ తిరిగే ఆ కొద్దిమంది ముఖాలే కంప్యూటర్ స్క్రీన్లపై పదేపదే దర్శనమిస్తున్నా అధికారులు ఎందుకు గుడ్లు అప్పగించి చూస్తున్నారు? ఈ లూప్‌హోల్ వెనుక అధికారుల 'మామూళ్ల' హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సిబ్బంది వెన్నుదన్ను లేకుండా ఈ స్థాయి సిండికేట్ నడవడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం.

**బాంబులా మారనున్న భూ వివాదాలు!**
**న్యాయ నిపుణుల హెచ్చరిక:**
నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ సాక్షి సంతకాల దందా భవిష్యత్తులో అమాయక కొనుగోలుదారుల పాలిట టైమ్ బాంబులా మారనుంది. రేపు పొద్దున ఆస్తి హక్కులపై కోర్టుల్లో సివిల్ వివాదాలు తలెత్తినప్పుడు.. ఈ నకిలీ సాక్షులను విచారిస్తే 'మాకేమీ తెలియదు.. డబ్బులిస్తే సంతకం పెట్టాం' అని చెప్తారు. అదే జరిగితే సదరు రిజిస్ట్రేషన్ దస్తావేజుల విశ్వసనీయత కోర్టులో శూన్యమవుతుంది. కోట్లాది రూపాయలు పోసి భూములు కొన్న అమాయక ప్రజలు రోడ్డున పడాల్సి వస్తుంది.

**ఉన్నతాధికారులు నిద్ర లేచేదెప్పుడు?**
గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ 'సాక్షుల' దోపిడీపై ఉన్నతాధికారులు తక్షణమే కొరడా ఝులిపించాల్సిన అవసరం ఉంది. గత కొన్ని నెలల కాలంలో జరిగిన రిజిస్ట్రేషన్ల బయోమెట్రిక్ డేటాను క్షుణ్ణంగా పరిశీలిస్తే నకిలీ సాక్షుల గుట్టు రట్టవుతుంది. ఒకే వ్యక్తి పదేపదే సాక్షిగా రాకుండా సాఫ్ట్‌వేర్‌లో తక్షణమే లాకింగ్ సిస్టమ్ తీసుకురావాలని, అక్రమాలకు పాల్పడుతున్న బ్రోకర్లపై, వారికి సహకరిస్తున్న సిబ్బంది పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## ఉచిత మెగా హెల్త్ క్యాంప్ రక్తదాన శిబిరం విజయవంతం



**సంగారెడ్డి వుదయం:**
సంగారెడ్డిలోని సాహితీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ మెగా హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సాహితి రాము మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ శిబిరంలో పక్షవాతం, వెన్ను-మెడ నొప్పులు, ఫిట్స్, తలనొప్పి, కీళ్ల సమస్యలు, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించి నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచిత వైద్య సలహాలు అందించారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన ఈ మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.అదే సందర్భంగా సాహితి రాము జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందిస్తూ, సమాజ సేవలో భాగంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ సాహితి రాము ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఆలయం అభివృద్ధి చేసిన బిజెపి నాయకుడు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

**ఊర్కొండ న్యూస్ 5**
**వుదయం ప్రతినిధి**



నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం ఊరుకొండ పేట గ్రామ పంచాయతీకి చెందిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం చుట్టూ మట్టితో కూడుకున్న దుమ్ము ధూళి రోడ్లను తన సొంత నిధులతో 40 లక్షలు సిసి రోడ్లు వేయించారు. అక్కడ వచ్చే భక్తులను ఇబ్బంది కలవకుండా మరుగుదొడ్లు కట్టించారు. ఎల్లకాలం గుడి అభివృద్ధికి తోడ్పడే వ్యక్తిని సీఎం రేవంత్ రెడ్డి సభకు ఆహ్వానించకపోవడం. 2006లో జడ్పిటిసి పోటీ చేసినప్పుడు అప్పుడు నేను సర్పంచ్ గా ఉన్నాను ఆయన గెలుపు కోసమే రాత్రి పగలు తేడా లేకుండా ఎంతో కష్టపడ్డాము. జెడ్పిటిసి గెలిపించుకున్నాము. సీఎం రేవంత్ రెడ్డి ఆయన గుర్తించకపోవడం. మేము చేసిన మేలు సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికీ మర్చిపోకూడదని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తెలిపారు

## బాబా చేసిన మామిడిపండ్ల చమత్కారం

- **ప్రముఖ సంఘ సేవకులు చిన్నారం శివకుమార్ గౌడ్.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 5....**
మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో వెలసిన శిరిడి సాయిబాబా గురించి శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్. వుదయం దినపత్రికతో ఆయన శ్రీ గురు పీఠంలో సేవలు అందుకుంటున్న శిరిడి సాయిబాబా గురించి ఆయన మాట్లాడుతూ.తనపై నమ్మకం ఉంచిన ఎందరికో బాబా ఒడి నింపారు, నింపుతూనే ఉన్నారు. దామూ అన్నా బాబాకు గొప్ప భక్తుడు. అతను బాబా దయతో రెండుసార్లు వ్యాపారంలో గొప్ప నష్టాల నుంచి బయటపడ్డాడు. దామూకి ఇద్దరు భార్యలు. సంతానం లేదు. జ్యోతిష్యులు ఆ అదృష్టం లేదని తేల్చి చెప్పేశారు. దామూ 'తన కర్మ' అని ఊరుకున్నాడు. కానీ, బాబాపై అతనికి అచంచల విశ్వాసం. తన భక్తుల్ని బాబా నిరాశబారిన పడనిస్తారా?ఒకరోజు షిరిడీలోని బాబాకు రాలే అనే భక్తుడు గోవా నుంచి 300 మామిడి పండ్ల పార్శిల్ పంపాడు. వాటిలోని నాలుగు పండ్లు తీసి బాబా తన భిక్షాపాత్రలో ఉంచారు. "ఇవి దామూవి. ఇది ఇక్కడే ఉండాలి" అన్నారు. మిగతా పండ్లను శ్యామా ద్వారా భక్తులకు పంచి పెట్టించారు.సరిగ్గా ఇది జరిగిన రెండు గంటలకు దామూ అన్నా ద్వారకామాయికి వచ్చాడు. మిగతా భక్తులు బాబా పక్కన పెట్టి ఉంచిన పండ్ల వైపు ఆసక్తిగా చూడసాగారు.అదిగమనించిన బాబా "ఈ పండ్లు దామ్యావి. ఎవరి పండ్లను వారే తిని చావాలి" అన్నారు. బాలా మాటలు విన్న దామూ అన్నా ఉలిక్కిపడ్డాడు.భయపడకు. బాబా 'చావు' అన్నది అహంకారం గురించి...



బాబా ఎదుట అహంకారాన్ని చంపుకోవడం ఒక ఆశీర్వాదం వంటిది" అని సర్దిచెప్పాడు అక్కడే ఉన్న మహల్సాపతి.అప్పుడు దామూతో బాబా ఇలా అన్నారు. "వీటిని నీ చిన్న భార్యకు ఇవ్వు. ఈ ఆమ్రలీల (మామిడిపండ్ల మహిమ) వల్ల నీ భార్యకు నలుగురు కొడుకులు, నలుగురు కుమార్తెలు కలుగుతారు" అని ఆశీర్వదించారు. చివరికి బాబా చేతి మహిమ ముందు జ్యోతిష్యం తీసికట్టయింది. దామూ సంతాన భాగ్యాన్ని పొందాడు. అప్పటి నుంచి షిరిడీలో ప్రతి ఏటా జరిగే శ్రీరామనవమి ఉత్సవానికి దామూ అన్నా ఒక నగిషీ జెండాను కానుకగా ఇచ్చేవాడు. అని ఆయన వివరించారు.

## జూలై 24లోపు ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి



**వనపర్తి జులై 5 (వుదయం ప్రతినిధి)**
పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎలక్షన్ కమిషన్ నిర్ణయించిన గడువు జూలై 24 లోపు బి.ఎల్.ఓ యాప్ లో నమోదు చేయాలని ఓటర్ల నమోదు అధికారి, ఆర్డీఓ సుబ్రమణ్యం బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఆదివారం వనపర్తి మున్సిపాలిటి పరిదిలోని గాంధినగర్, హరిజన్ వాడ, నాగవరం లో గల పోలింగ్ స్టేషన్ సంఖ్య 120,122,123,160 మరియు 170 లలో పర్యటించి ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులు, పర్యవేక్షకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బూత్ స్థాయి అధికారులు మరియు బూత్ లెవల్ పర్యవేక్షకులు గణన ఫారం ఓటర్లుకు పంపిణి మరియు గణన ఫారం పూరించే విధానము పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు, పర్యవేక్షకులకు పలు సూచనలు చేసారు, ఓటర్ చేత ఎన్యూమరేషన్ ఫారం తప్పులు లేకుండా పూరించి అట్టి ఫారం ను ఎలక్షన్ కమిషన్ నిర్ణయించిన గడువు లోపల బి.ఎల్. ఓ యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు. అదే విదముగా ఓటర్ల తో మాట్లాడి ఫారం నింపడంలో వస్తున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పూరించిన ఫారం ను ఖచ్చితంగా తిరిగి బూత్ లెవల్ ఆఫీసర్లకు ఇవ్వాలని లేనిపక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాదని అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులు, ఏజెంట్లు, తదితరులు ఆర్డీఓ వెంట ఉన్నారు.

## గురుకుల విద్యాసంస్థల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు




**నారాయణపేట, జూలై 5 (వుదయం ప్రతినిధి) :**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాల (బాలికలు) మరికల్ ఆధ్వర్యంలో 202627 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారిణి బి. నాగమణి మాల తెలిపారు. మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి జిల్లా స్థాయిలో జూలై 6, 2026 తేదీన ఈ స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.దీనిలో భాగంగా నారాయణపేట జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో 5 బాలికల దామరగిద్ద (బాలురు) కళాశాలల్లో ఎంపీసీ ,బైపిసి గ్రూపులలో ఉన్న ఖాళీల భర్తీ కోసం ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి అర్హత గల విద్యార్థులు జూలై 6వ తేదీన ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ధృవపత్రాల పరిశీలన అనంతరం ఫలితాలను వెల్లడించనున్నట్లు ఆమె తెలిపారు. మరికల్ గురుకుల క్యాంపస్ లో జరిగే ఈ స్పాట్ కౌన్సెలింగ్ కు నేరుగా హాజరుకావాలని ఆమె కోరారు. ఆసక్తిగల విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు, అన్ని ధృవపత్రాల రెండు సెట్ల జిరాక్స్ కాపీలు,పదో తరగతి షార్ట్ మెమో,బోనఫైడ్ సర్టిఫికెట్ , స్టడీ సర్టిఫికెట్ ,కుల ధృవీకరణ పత్రం,ఆదాయ ధృవీకరణ పత్రం,నివాస ధృవీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్ ,టి.సి,తల్లిదండ్రుల ఆధార్ కార్డ్ జిరాక్స్, 4 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోల తో హాజరుకావాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారిని కోరారు.

## మధ్యాహ్న భోజనంలో తేడా వస్తే టీచరే బాధ్యుడు!

- **ఫుడ్ పాయిజనింగ్ అయితే చర్యలు..**
- **తాగునీటి కలుషితానికి నోటీసులు**
- **ప్రభుత్వానికి నివేదిక.. త్వరలోనే ఆమోదమంటున్న అధికారులు**

**వికారాబాద్ జూలై 6 (వుదయం బ్యూరో)**
ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిబంధనలు మార్చబోతున్నారు. మధ్యాహ్న భోజనంలో ఏ తేడా వచ్చినా పాఠశాలలోని టీచర్లనే బాధ్యులు చేస్తారు. ఇప్పటి వరకూ ఇది పాఠశాల ప్రధా నోపాధ్యాయుడికే పరిమితం. ఇక నుంచి టీచర్లు అందరికీ వర్తింపజేస్తారు. ఒక్కో రోజు ఒక్కో టీచర్ మధ్యాహ్న భోజన నిర్వహణ చేపట్టాలని మార్గదర్శకాల్లో పేర్కొంటున్నారు. ప్రతీ స్కూల్లోనూ టీచర్లంతా విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీని అమలును మరింత పారదర్శకం చేయాలని భావిస్తున్నారు. స్థానిక పేరెంట్స్ కమిటీలు, నాయకులతో కూడిన కమిటీలు కార్యాచరణలో కీలక పాత్ర పోషిస్తాయి. పాఠశాల డైరెక్టరేట్, విద్యాశాఖ ఉన్నతాధికారులు కొత్త మార్గదర్శకాలను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత వీటిని అమలు చేస్తారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

**పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణ**
మధ్యాహ్న భోజనం వల్ల విద్యార్థుల హాజరుశాతం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. అయితే నాణ్యత, పరిశుభ్రతపై అనేక విమర్శలు వస్తున్నాయి. దీన్ని దూరం చేయడానికి టీచర్లను కూడా అదే స్కూల్లో భోజనం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని అమలుకు స్థానిక పేరెంట్స్ కమిటీ, గ్రామాల్లో పట్టణాల్లో స్థానిక స్థానిక నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిటీ వేయాలని భావిస్తున్నారు. స్కూల్లో టీచర్లు భోజనం చేస్తున్నారనేది ఈ కమిటీలు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ విధానాన్ని టీచర్లు వ్యతిరేకిస్తున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచేందుకు ఇది మార్గం కాదంటున్నారు. బిల్లులు ప్రతీ నెలా ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు. *మధ్యాహ్న భోజనంలో ఏ తేడా వచ్చినా కఠిన చర్యలుండాలని ఉన్నతాధి కారులు భావిస్తున్నారు. నాణ్యత లోపాలకు వారినే బాధ్యులను చేస్తారు. ఈ విషయంలో ఎలాంటి చర్యలు ఉండాలనేది అధికారులు తమ నివేదికలో పొందుపర్చారు.ఫుడ్ పాయిజనింగ్ విషయంలో తక్షణమే టీచర్ ను సస్పెండ్ చేయాలని సూచిస్తున్నారు. అనేక పనుల్లో ఉండే హెచ్‌ఎంలను బలిచేయడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనికి బదులు హెచ్‌ఎం నేతృత్వంలో రోజుకో టీచర్ మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అనుకోని ఘటనలు ఏదైనా జరిగితే ముందుగా ఆ రోజు విధుల్లో ఉన్న టీచర్ బాధ్యత తీసుకో వాల్సి ఉంటుంది.



ఆహారం విషతుల్యమైతే సంబంధిత టీచర్ సర్వీస్ రికార్డులోనూ పొందుపరుస్తారు. ఈ రి మార్క్ ను ఇంక్రిమెంట్, పదోన్నతి విషయంలో ప్రామాణికంగా తీసుకుంటారు. తనిఖీల్లో వంటగది, వంట పాత్రల అపరిశుభ్రత ఉన్నప్పుడు టీచర్ ముందుగా నివారించాలి. దీన్ని రికార్డులో కూడా రాయాలి. హెచ్ ఎం దృష్టికి తీసుకెళ్లాలి. మొబైల్ యాప్ ను కూడా తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతీ అంశాన్ని ఇందులో పేర్కొనాలి. ఇవేవీ అనుసరించని టీచర్ ను నిర్లక్ష్యం చేసినట్టుగానే భావిస్తారు. బాధ్యతలు విస్మరించిన టీచర్ ను ముందుగా సస్పెండ్ చేసి, ఆ తర్వాత ఆరు నెలల్లో శాఖాపరమైన విచారణ పూర్తి చేస్తారు. దీని ఆధారంగా తప్పు స్థాయి, శిక్ష ఏమిటనేది నిర్ణయిస్తారని అధికారులు చెబుతున్నారు.

## ఊర్కొండ మండల దిశ రిపోర్టర్ ను పరామర్శించిన మాజీ మంత్రి

**ఊర్కొండ న్యూస్ 5**
**వుదయం ప్రతినిధి**
జడ్చర్ల నియోజకవర్గం ఊర్కొండ మండలంబొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన ఊర్కొండ మండల దిశ రిపోర్టర్ అల్వాల మహేష్ ను హైదరాబాద్ మలక్ పేట యశోద ఆసుపత్రికిమాజీ మంత్రివర్యులు డా.సి.లక్ష్మారెడ్డి సార్ స్వయంగా వెళ్లి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడం జరిగింది. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను సూచించడం జరిగింది. వారి వెంటబిఆర్ఎస్ పార్టీ బొమ్మరాశి పల్లి మాజీ సర్పంచ్



మండల వెంకటేష్ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఊర్కొండ మండల అధ్యక్షులు ఎండీ అక్బర్_బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి నమస్తే తెలంగాణ రిపోర్టర్వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రవంచలో వైభవంగా ఇందిరమ్మగృహ ప్రవేశం

- **హాజరైన మాజీ మార్కెట్ కమిటీ చెర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి**

**తాండూరు వుదయం ప్రతినిధి జులై 5 :**
వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చంద్రవంచ గ్రామంలో ఆదివారం పండగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందినసార్వాణి ఈరమ్మదస్తప్ప దంపతులు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ పథకం ద్వారా నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.
ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తాండూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి విచ్చేశారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు చంద్రవంచ గ్రామ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి గ్రామ పెద్దలతో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.
సొంతింటి కల సాకారం: లబ్ధిదారులు ఈరమ్మదస్తప్ప దంపతులు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, వేద మంత్రాల నడుమ నూతన గృహంలోకి ప్రవేశించారు. లబ్ధిదారులకు ఆశీస్సులు: ముఖ్య అతిథి బాల్ రెడ్డి నూతన గృహాన్ని పరిశీలించి, రిబ్బన్ కట్ చేసి



ప్రారంభించారు. అనంతరం తోరణాలు కట్టి, పాలు పొంగించిన శుభ ముహూర్తంలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.
పేదల సంక్షేమమే ధ్యేయం: ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి పేదవాడికి నీడ కల్పించాలనే ఉన్నత ఆశయంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు ఎందరో నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని కొనియాడారు. ఈరమ్మ దస్తప్పల కుటుంబం నూతన గృహంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**సర్పంచ్ సుదర్శన్ రెడ్డి హర్షం:**
"మా చంద్రవంచ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నాం. ఈ రోజు ఈరమ్మ దస్తప్ప దంపతులు సొంతింటి కల నెరవేర్చుకుని గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ వేడుకకు విచ్చేసిన పెద్దలు బాల్రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు ఈ శుభకార్యంలో కరణ్ కోట్ సర్పంచ్ రాజు కుమార్,చెంగోల్ కాంగ్రెస్ యువ నాయకులు రాము, గ్రామ ప్రజాప్రతినిధులు నర్సిములు,సుధాకర్ వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారుల బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆశీర్వదించారు. సొంత ఇల్లు ఏర్పడటంతో లబ్ధిదారుల కుటుంబంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.

## వర్క్ అడ్జెస్ట్మెంట్ జీవో 25ను సవరించాలి

- **2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ డిమాండ్**

**సిద్దిపేట, జూలై 5 (వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 25ను తక్షణమే సవరించిన తర్వాతే టీచర్ల వర్క్ అడ్జెస్ట్మెంట్ (ఉపాధ్యాయుల సర్దుబాటు) ప్రక్రియను చేపట్టాలని 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 20వ తేదీ నాటి విద్యార్థుల ఎన్రోల్మెంట్ గణాంకాల ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేయడం



సరైంది కాదన్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జూలై ప్రభుత్వం ఒకవేళ వర్క్ అడ్జెస్ట్మెంట్ చేయాలనుకుంటే.. జూన్ నెలకు బదులుగా జూలై నెల ముగిసిన తర్వాత నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలి.జాతీయ విద్యా విధానం సూచించిన 30:1 నిష్పత్తిని మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలి. తెలంగాణలో 20 నుండి 60 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి, *20 మంది విద్యార్థులు దాటిన తర్వాత.. ప్రతి 15 మంది అదనపు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి. రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పోస్టును తప్పనిసరిగా మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.జూన్ 20 నాటి గణాంకాలతో సర్దుబాటు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేయవద్దు అని కొనియాడారు.

## క్లిన్, గ్రీన్, సేఫ్ సిద్ధిపేటకు ముందడుగు

- **నందనవనంలా బృందావన్ కాలనీ**
- **సీసీ కెమెరాలను ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

**వుదయం, సిద్దిపేట**
సిద్ధిపేటను పచ్చదనం, పరిశుభ్రత, ప్రజల భద్రతకు ప్రతీకగా తీర్చిదిద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి. హరీష్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని 3వ వార్డు బృందావన్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.హనుమాన్ దేవాలయ నిర్మాణానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చిన హరీష్ రావు, కాలనీ ప్రజలు కోరిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేశామని చెప్పారు. గత పదేళ్లలో సిద్దిపేటను "క్లిన్.. గ్రీన్.. సేఫ్ సిద్ధిపేట"గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేశామని పేర్కొన్నారు.రాష్ట్రంలోనే అత్యధికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిచ్చిన పట్టణంగా సిద్దిపేట నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని మాజీ మంత్రి హరీష్ రావు హామీ ఇచ్చారు.

## నేడు పేట జిల్లాలో ఎంపీడీకే అరుణ పర్యటన

**నారాయణపేట టౌన్, జూలై 5 (వుదయం ప్రతినిధి):**
నారాయణపేట జిల్లాలో ఈ నెల 6న పాలమూరు ఎంపీ డి కే అరుణ పర్యటిస్తూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.ఉదయం 10:30 గంటలకు నారాయణపేట మండలం, బోయిన్‌పల్లి గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, పాఠశాలకు కంప్యూటర్స్ అందజేస్తారు. ఉదయం 11:00 గంటలకు నారాయణపేట టౌన్ లక్ష్మీ బంకెట్ హాల్ లో జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు..మధ్యాహ్నం 4:15 గంటలకు ధన్వాడ మండలం, మంత్రోనిపల్లి గ్రామంలో హైమాస్ట్ లైట్లు మరియు సీసీ రోడ్డుప్రారంభిస్తారు.సాయంత్రం 5:00 గంటలకు యెలిగండ్ల గ్రామంలో బీజేపీ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు.



## నందిగామ హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్చెరు (వుదయం):**
పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన జీర్ణోద్ధారణ, గణపతి నవగ్రహ సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో ఆధ్యాత్మిక భావం పెంపొందించడంలో దేవాలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని కోరారు. నూతన దేవాలయాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, గోపాల్, లక్ష్మణ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.





## పిసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డిని పరామర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్

యాలాల జూన్ 5
వుదయం ప్రతినిధి :-

కాలుకు శస్త్ర చికిత్స చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్న యాలాల పిపిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డిని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం యాలాల మండల పరిధిలోని లక్ష్మీనా రాయణపూర్ గ్రామంలో సురేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి సురేందర్ రెడ్డి ఆరోగ్య విషయంపై వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట సర్ తాండూరు డివిజన్ కన్వీనర్ కర్ణం పురుషోత్తం రావు తదితరులున్నారు.



## వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోహీర్, వుదయం:

వివాహ వేడుకలో నూతన వధువరులను కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లన్న పాటిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశీర్వాదించారు. ఆదివారం శంకర్ పల్లి మండలం జన్వాడలోని నియో కన్వెన్షన్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి కుమారుని వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్ రెడ్డి, అశోక్, రాందాస్, జగదీశ్వర్ రెడ్డి, సయ్యద్ లియాకత్, క్రిష్ణ, ఎక్బాల్, రత్నం, అనిల్, నర్సింలు వివాహ వేడుకలో పాల్గొన్నారు.



## భార్య లక్ష్మిని పరామర్శించిన కంఠరెడ్డి తిరుపతి రెడ్డి

మెదక్ జిల్లా, వుదయం :

నిజాంపేట్ మండలం నార్లపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోపరి నరసింహులు సతీమణి గోపరి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కంఠరెడ్డి తిరుపతి రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట సర్పంచ్ అందె కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంగు స్వామి, యువజన విభాగ మండల అధ్యక్షులు రాజు, మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి రవీందర్, వార్డ్ మెంబర్ నగేష్, భరణి గౌడ్, మరియు స్థానిక నాయకులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తప్పిపోయిన బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగింత

- నారాయణపేట ఎస్సై వెంకటేశ్వర్లు

నారాయణపేట టౌన్ జూలై 5
(వుదయం ప్రతినిధి)

నారాయణపేట పట్టణంలోని మెయిన్ చౌక్ సెంటర్ వద్ద ఆదివారం 8 ఏళ్ల బాలుడు తన తల్లిదండ్రుల నుంచి విడిపోయి దారి తెలియక తిరుగుతుండగా, అప్రమత్తమైన ఏఆర్ కానిస్టేబుల్ కనకప్ప బాలుడిని గుర్తించి నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.పోలీసులు బాలుడిని వివరాలు అడిగినా అతను స్పష్టంగా చెప్పలేకపోవడంతో, బాలుడి ఫోటోను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. దీంతో ఆ బాలుడు గురుమిట్కల్‌కు చెందిన ఎండి ఆయాన్ అలీ, తండ్రి ఆయాజ్ అలీ కుమారుడిగా గుర్తించి వెంటనే బాలుడి తండ్రికి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించగా, ఆయన నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తన కుమారుడిని గుర్తించారు. అనంతరం పోలీసులు బాలుడిని తండ్రికి క్షేమంగా అప్పగించారు.ఈ సందర్భంగా బాలుడిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఏఆర్ కానిస్టేబుల్ కనకప్పను బాలుడి తండ్రి కృతజ్ఞతలు తెలిపాగా, స్థానికులు అభినందించారు. ప్రజలు తమ చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టవద్దని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు.



## సీఎం సహాయనిధి పేదలకు వరం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లన్న పాటిల్

కోహీర్, వుదయం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని, ఇబ్బందులున్న కాలంలో అపత్భాందవునిల పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లన్న పాటిల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తూర్ (డి) గ్రామానికి చెందిన జైనాబి మహ్మద్ షేక్ కు సీఎం సహాయనిధి చెక్కు రూ. 35,500లను అందజేశారు. ఆయన వెంట చింతల్ గట్టు సర్పంచ్ విద్యాసాగర్, ఉప సర్పంచ్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్బాల్, జూలానీ తదితరులు ఉన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట టౌన్ జూలై 5
(వుదయం ప్రతినిధి)



నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. నారాయణపేట జిల్లాలోని జాతీయ రహదారి 167 పై రోడ్డు ప్రమాదాల నివారణ నేపథ్యంలో జిల్లా పోలీసులు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఒక కుటుంబానికే కాదు, సమాజానికే తీరని నష్టాన్ని కలిగిస్తాయి అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తన బాధ్యతగా భావించి పాటించాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరిలో బాధ్యత పెరిగితే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చునని అన్నారు.జాతీయ రహదారి 167ను కలుపుతున్న గ్రామీణ రోడ్లు, కూడళ్ల వద్ద వాహనదారులు అత్యంత అప్రమత్తంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైవేపైకి వచ్చే ముందు రెండు వైపులా పూర్తిగా పరిశీలించి, ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనాలకు ప్రాధాన్యత ఇచ్చిన తర్వాత మాత్రమే రోడ్డుపైకి రావాలన్నారు. తొందరపాటు నిర్ణయాలు, నిర్లక్ష్యం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయిఅని పేర్కొన్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించి, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ ధరించాలి అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి అని సూచించారు.జిల్లా పోలీసులు నిత్యం హైవే పెట్రోలింగ్, నాకాబందీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగుతోంది అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి తమ కుటుంబంతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడే బాధ్యతను నిర్వర్తించాలి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100, 112కు సమాచారం అందించాలి. ప్రజల సహకారంతో నారాయణపేట జిల్లాను రోడ్డు ప్రమాదాలు తగ్గిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తారు అని ఎస్పీ తెలిపారు.

## యూరియా కోసం రైతుల ఇక్కట్లు

- యాప్ తో ఇబ్బంది పడుతున్న రైతులు
- స్మార్ట్ ఫోన్ లేని రైతుల ఆందోళన
- సహకరించిన వ్యవసాయ అధికారులు

యాలాల జులై 5
( వుదయం ప్రతినిధి ):-

యూరియా కొరత కారణంగా రైతుల అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు వర్షాలు లేక వేసిన పంటలు వాడిపోతున్నాయి. వర్షాలు లేకపోవడంతో చెరువు కుంటలు నిండక వరి సాగుకు ఇబ్బంది ఏర్పడుతుంది. గత సంవత్సరం ఇప్పటికే వర్షాలు కురిసే చెరువులు కుంటలు నిండుకొని భూగర్భ జలాలు పెరిగిపోయాయి. వర్షాలు లేని కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. బోరు బావుల్లో నీరు లేక వరి సాగు చేయడానికి రైతులు ముందుకు రావడం లేదు. వరి సాగు తోపాటు వివిధ పంటలకు వాడడానికి యూరియా దొరకదేమో అని రైతులు ముందుగానే యూరియా కోసం యాప్ లో బుక్ చేసుకుంటున్నారు. యాప్ లో యూరియా బుక్ చేసుకున్న ప్రాంతం లోకూడా యూరియా దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ దారుల వద్ద స్మార్ట్ ఫోన్ లేకపోవడంతో యాప్ లో యూరియా బుక్ చేసుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతుందని రైతులు వాపుతున్నారు. స్మార్ట్ ఫోన్లు లేకపోవడంతో రైతులకు యూరియా దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. యాప్ ద్వారా యూరియా



బుక్ చేయడానికి రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. కొందరు రైతులు యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియా బస్తాలను గోదాంలో నిల్వ ఉన్న రైతులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు యాప్ విధానాన్ని రద్దుచేసి ఎరువుల దుకాణాలలో యూరియా లభించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

## మనోపాడు వద్ద లారీని ఢీకొట్టిన లగ్జరీ బస్సు: రహదారిపై పల్టీలు!

- హైదరాబాద్ వస్తుండగా తెల్లవారుజామున ప్రమాదం.. 10 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం

మనోపాడు, జులై 05
(వుదయం కరస్పాండెంట్):

జాతీయ రహదారి 44పై ఆదివారం తెల్లవారుజామున నెత్తురు చిందింది. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి బస్సు రోడ్డుపైనే బోల్తా పడటంతో తీవ్ర కలకలం రేగింది. బస్సులో మొత్తం 22 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

అప్రమత్తమైన యంత్రాంగం: ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, 108 సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వారిని కర్నూలు ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కాగా, నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.



## బిఆర్ఎస్ ప్రభుత్వం లోనే అభివృద్ధి

- బిఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి.

మెదక్ జిల్లా,వుదయం
నిజాంపేట మండలం:

బిఆర్ఎస్ ప్రభుత్వం లోనే నిజాంపేట మండలానికి పలు అభివృద్ధి పనులు కేటాయించామని మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పల్లెలు గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనక్కిందన్నారు. నిజాంపేట మండలానికి పిహెచ్ సెంటర్ మంజూరైన ఇప్పుడు ఉన్నటువంటి ఎమ్మెల్యే పట్టించుకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రజల సౌకర్యార్థం పిహెచ్ సెంటర్ ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్ ఇచ్చిందన్నారు. గతంలో మంజూరైన పనులకే ఇప్పుడు ఉన్నటువంటి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న కొనుగోలు చేయకపోవడంతో రైతుల పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ నిలిచిందన్నారు. రామాయంపేట డివిజన్ ఏర్పాటుకు కృషి చేసింది బిఆర్ఎస్ ఏ అన్నారు.అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ గేరిగంటి అనూష భర్త లక్ష్మీ నర్సింలు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పంపరి శంకరయ్య,లను పరామర్శించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు బజార్ రంజిత్ గౌడ్, మాజీ ఎంపీపీ బిజ్జ సంపత్,మాజీ కోఆప్షన్ అబ్దుల్ అజీజ్, సొసైటీ చైర్మన్ బాపు రెడ్డి, మాజీ సర్పంచ్ గేమ్ సింగ్ ,వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, వెంకటస్వామి గౌడ్, నాయిని లక్ష్మణ్, పున్న వెంకటస్వామి, బండారి తిరుమల్, నరేందర్ నాయక్, పంపరి శివకుమార్, సుభాష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## నడిగడ్డ గుండెల్లో 'ఆర్డీఎస్' మంటలు!

- కొడంగల్ కోసమేనా ఆలంపూర్ బలిపీఠం?
- పాలకుల 'మౌన' ముద్ర వెనుక మర్మమేంటి?
- నిధుల మళ్లింపు సరే... మరి నడిగడ్డ నీటి హక్కుల సంగతేంటి?
- బేసిన్ మార్పిడిపై పెను దుమారం... అన్నదాతల గుండెల్లో గుబులు!

గద్వాల జూలై 05 (వుదయం బ్యూరో):

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్)... నడిగడ్డ రైతాంగానికి ఇది కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు, తరతరాల జీవనరేఖ. మక్తల్, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది ఎకరాల పచ్చని పొలాలకు ప్రాణాధారం. అయితే, నేడు అదే ఆర్డీఎస్ ఆయకట్టు భవితవ్యంపై అనిశ్చితి నీడలు ముసురుకుంటున్నాయి. ప్రతిపాదిత కొడంగల్ ఎత్తిపోతల పథకం, అభివృద్ధి వ్యూహాల వెనుక నడిగడ్డ రైతాంగ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారనే అనుమానాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో దావానలంలా వ్యాపిస్తు న్నాయి. ఈ తీవ్ర ఉత్కంఠపై ప్రభుత్వం వహిస్తున్న 'వ్యూహాత్మక మౌనం' ప్రజల్లో ఆగ్రహాన్ని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తోంది.

**ఒక ప్రాంత వికాసం... మరో ప్రాంతానికి శాపమా?**

కొడంగల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడాన్ని, ఆ ప్రాంత ప్రగతిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. కానీ, ఒక ప్రాంతానికి నీరిచ్చే క్రమంలో దశాబ్దాలుగా చట్టబద్ధమైన నీటి హక్కులు కలిగి ఉన్న నడిగడ్డ గొంతు కోయడమేనా ప్రాంతీయ సమతుల్యత? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కృష్ణా, తుంగభద్ర బేసిన్ల నుంచి నీటి మళ్లింపు జరిగి, దాని ప్రభావం ఆర్డీఎస్ కేటాయింపు లపై పడుతుందా? అన్న రైతుల ప్రాథమిక అనుమానాలకు పాలకుల నుంచి ఇంత వరకు ఒక్కటంటే ఒక్క స్పష్టమైన సమాధా నం కూడా రాలేదు.

**హక్కుల హననం... ట్రిబ్యునల్ తీర్పుల ఉల్లంఘన?**

అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టాల ప్రకారం, గతంలోనే సర్వోన్నత ట్రిబ్యునళ్లు కేటాయించిన పాత నీటి హక్కులను తాకట్టు పెట్టే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు. ఆర్డీఎస్ ద్వారా తెలంగాణ సరిహద్దు లకు దక్కాల్సిన 15.9 టీఎంసీల నీటిని సాధించడమే ఇప్పటికే గగనమైంది. ఎగువన కర్ణాటక పరిధిలో జరుగుతున్న అనధికారిక మళ్లింపులు, కాలువ పూడికతీత పనుల్లో తాత్సారం తో ఆలంపూర్ రైతాంగం ఏటా కన్నీరు పెడుతోంది. ఇలాంటి తరుణంలో, కొత్త ప్రాజెక్టుల పేరిట భవిష్యత్ కేటాయింపులపై స్పష్టత ఇవ్వకపోవడం వారి గాయాన్ని మరింత రేపడమే అవుతుంది.

**నిలదీస్తున్న నడిగడ్డ... తేల్చాల్సింది ప్రభుత్వమే!**

ప్రశ్న 1: ఆర్డీఎస్ ఆధునికీకరణపై, కర్ణాటక ప్రభుత్వంతో జరిపిన అంతర్గత చర్చల సారాంశాన్ని ఎందుకు దాస్తున్నారు?

ప్రశ్న 2: కొడంగల్ ప్రాజెక్టుకు సంబంధించిన 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' (డిపిఆర్) లో నీటి వనరుల లభ్యత, మళ్లింపు పాయింట్లపై శ్వేతపత్రం ఎందుకు విడుదల చేయడం లేదు?



ప్రశ్న 3: కొత్త ప్రతిపాదనల వల్ల పాత ఆయకట్టుకు ఒక్క చుక్క నీరు కూడా తగ్గదనే చట్టబద్ధమైన హామీని బహిరంగంగా ఎందుకు ఇవ్వలేకపోతున్నారు?

**మౌనం వీడాలి... నమ్మకం ఇవ్వాలి!**

నీటి హక్కుల కోసం రైతులు చేస్తున్న పోరాటం రాజకీయ వివాదం కాదు... అది వారి మనుగడకు సంబంధించిన ఆర్తనాదం. భూమిని నమ్ముకున్న రైతుకు కాగితపు హామీల కంటే క్షేత్రస్థాయిలో జరిగే అమలే పరమావధి. పచ్చని పొలాలకు ప్రాణం నీరు...రైతు నమ్మకానికి ప్రాణం ప్రభుత్వ స్పష్టత. హామీల కంటే అమలే రైతుకు భరోసా. ప్రభుత్వం ఇప్పటికైనా తన మౌన ముద్రను వీడాలి. ప్రాంతీయ పక్షపాతాలకు తావులేకుండా, నీటి పంపిణీలో పూర్తి పారదర్శకత పాటించాలి. నడిగడ్డ రైతాంగానికి చట్టబద్ధమైన భరోసా కల్పించి, ఈ అనిశ్చితికి తక్షణమే తెరదించాల్సిన బాధ్యత ముమ్మాటికీ పాలకులపైనే ఉంది.

## దుబ్బాక అభివృద్ధికి సహకరించాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

వుదయం, దుబ్బాక

హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నూతనంగా ఏర్పాటైన నార్సింగి మండలానికి ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు చేయడంతో పాటు, రాయపోల్, అక్బర్‌పేట్ భూంపల్లి, నార్సింగి నూతన మండలాలకు ఎంపీడీవో కార్యాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే దుబ్బాక నియోజకవర్గంలోని ఆర్&బీ (R&B), పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నూతన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలు లేక అధికారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆధునిక సౌకర్యాలతో కార్యాలయ భవనాలు నిర్మిస్తే పరిపాలనా సేవలు మరింత వేగంగా, సౌకర్యవంతంగా ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వివరించారు.వినతిని సానుకూలంగా స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులతో చర్చించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు.





## 2వ వార్డ్ లో బోర్ ను ప్రారంభించిన చైర్ పర్సన్

నారాయణపేట జూలై 5
(వుదయం ప్రతినిధి)

స్థానిక 2వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ ఆధ్వర్యంలో నూతన బోర్ ను ఆదివారం ప్రారంభించారు.వేసవి లో నీటి సమస్య ను గుర్తించి వార్డు లో నూతన బోర్ ను వార్డు కౌన్సిలర్ కొనంగేరి సౌజన్య వేయించడంతో ఆదివారం ప్రారంభించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కౌన్సిలర్ నెరవేర్చి వార్డు ప్రజల దాహార్తిని తీర్చడంతో చైర్పర్సన్ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ కోనంగేరి సౌజన్య కృష్ణ రెడ్డి ఆమె అభినందించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ,ఉదయ్ ,రాజశేఖర్, రాము, భీమ్, యాదమ్మ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గ బీ ఎల్ ఏ తో SIR సమీక్ష సమావేశం

నర్సాపూర్, జూలై 5 (వుదయం):

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియ,బీ ఎల్ ఏ బాధ్యతలు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు సంబంధించిన అంశాలపై నర్సాపూర్ శ్రీ సాయి క్రిష్ణ గార్డెన్స్‌లో సమగ్రంగా సమీక్ష కార్యక్రమం ఉంది దీని నియోజకవర్గ బీ ఎల్ ఏలకు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారి గంగాధర్ తెలిపారు.




## చేనేత సహకార సంఘం చైర్మన్ కి సన్మానం

- తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో సత్కారం

(వుదయం ) పెద్ద శంకరంపేట,
ప్రతినిధి జులై 05:

హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్రకమిటీ సర్వసభ్య సమావేశంలో పెద్ద శంకరంపేట చేనేత సహకార సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మహంకాళి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు.

తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మహంకాళి కృష్ణమూర్తికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధికి మహంకాళి కృష్ణమూర్తి సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగ బలోపేతానికి ఐక్యవేదిక కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.



## ఆదర్శంగా నిలిచిన మునిగడప 200506 బ్యాచ్ స్నేహితులు

- మిత్రుడి మాతృమూర్తి మృతి..
- రూ. 53,500 ఆర్థిక సాయం

సిద్దిపేట/జగదేవపూర్, జూలై 5
(వుదయం ప్రతినిధి):

చిన్ననాటి స్నేహితులంటే కేవలం ఆటపాటలకే పరిమితం కాదని, కష్టకాలంలో ఆదుకునే ఆపద్బంధువులని నిరూపించారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం మునిగడప గ్రామానికి చెందిన పాత విద్యార్థులు. గ్రామానికి చెందిన తిమ్మాపురం కృష్ణగౌడ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కృష్ణగౌడ్ బాల్య మిత్రులు (2005 2006 టెన్త్ బ్యాచ్), తోటి గ్రామస్థులు చలించిపోయారు. కృష్ణగౌడ్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి, వారికి అండగా నిలవాలని సంకల్పించారు.అందరూ బృందంగా ఏర్పడి తమ వంతుగా విరాళాలు సేకరించారు. సేకరించిన *రూ. 53,500/* నగదును ఆదివారం మిత్రుడు కృష్ణగౌడ్ కుటుంబానికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.మనం ఎంత సంపాదించినా రాని తృప్తి.. కష్టాల్లో ఉన్న తోటి మిత్రునికి సాయం చేయడంలో లభిస్తుంది. భవిష్యత్తులో మా మిత్రుల కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా మేమంతా ఒకే తాటిపై నిలిచి అండగా ఉంటాం అన్నారు. ఆపదలో ఉన్న మిత్రుడిని చేరదీసి, ఆర్థికంగా మరియు మానసికంగా ధైర్యాన్నిచ్చిన మునిగడప పాత విద్యార్థుల చొరవను గ్రామస్థులు, పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా రైతులు యూరియా బుకింగ్ చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

సంగారెడ్డి, జూలై 5:--వు దయం:

జిల్లాలో రైతులకు యూరియా ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. రైతులు తమ సమీప ఎరువుల విక్రయ కేంద్రంలో యూరియా లభ్యతను నిర్ధారించుకుని, యాప్ ద్వారా ముందుగానే బుకింగ్ చేసుకోవాలని సూచించారు.రైతులు పంట విస్తీర్ణాన్ని బట్టి శాస్త్రీయ పద్ధతిలో యూరియాను వినియోగించడం ద్వారా ఎరువుల సామర్థ్యం పెరగడంతో పాటు పంట దిగుబడులు కూడా మెరుగుపడతాయని తెలిపారు.వ్యవసాయ శాఖ సూచించిన విధంగా యూరియాను దశలవారీగా వినియోగించాలని రైతులకు సూచించారు.రెండు ఎకరాల వరకు ఉన్న రైతులు పంటకు అవసరమైన మొత్తం యూరియాను ఒకేసారి (Single Take) బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.రెండు ఎకరాలకు మించి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులు యూరియాను రెండు దఫాలుగా (2 Splits) బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.ఐదు ఎకరాలకు పైగా సాగు చేస్తున్న రైతులు యూరియాను మూడు దఫాలుగా (40% : 30% : 30%) బుకింగ్ చేసుకుని అవసరమైన సమయంలో పొందాలని సూచించారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకుని యూరియా బుకింగ్ యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకోవడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

# చక్కని ఆరోగ్యం

# ముఖానికి ఇవి వాడకూడదట..!



ముఖ సౌందర్యం కోసం ఇటు ఇంటి చిట్కాలను, అటు బయట దొరికే వివిధ ఉత్పత్తుల్ని వాడుతుంటాం. అయితే వీటిలో ముఖానికి వాడకూడని పదార్థాలు కూడా కొన్నున్నాయంటున్నారు నిపుణులు. చర్మానికి తేమనందించడానికి బాడీ లోషన్ ఉపయోగించడం మనకు అలవాటే! అయితే కొంతమంది దీన్నే ముఖానికి కూడా వాడుతుంటారు. ఫలితంగా ఇందులోని జిడ్డుదనం ముఖ చర్మ రంధ్రాల్లోకి చేరి.. క్రమంగా మొటిమలు రావడానికి దారితీస్తుందట. ఇక దీనిలో ఉండే కృత్రిమ పరిమళాలు మృదువుగా ఉండే ముఖ చర్మంపై అలర్జీలు రావడానికి కారణమవుతాయి. కాబట్టి ముఖం కోసం ప్రత్యేకంగా తయారుచేసిన బ్యూటీ ఉత్పత్తులు.. ఎంచుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. ముఖానికి ఉపయోగించే స్క్రబ్స్, ఫేస్‌ప్యాక్స్.. వంటి వాటిలో నిమ్మను ఉపయోగించడం సహజమే. కొంతమందైతే నిమ్మచెక్కను నేరుగా ముఖంపై రుద్దుకుంటుంటారు. అయితే ఇందులోని కొన్ని సమ్మేళనాలు కొంతమందిలో ముఖ చర్మాన్ని మరింత సున్నితంగా మార్చుతాయట. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు చర్మం ఇరిటేషన్‌కి గురై దురద, మంట.. వంటి సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. మొటిమలున్న చోట టూత్‌పేస్ట్ రాయమని సలహా ఇస్తుంటారు కొందరు. కానీ వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే కొంతమందిలో ఇది అప్లై చేసిన చోట నల్ల మచ్చలు, రంగు మారడం.. వంటి సమస్యలొచ్చే అవకాశం ఉంటుందట. అలాగే ఇందులోని గాఢమైన పదార్థాల వల్ల కొంతమందిలో ఇన్ఫెక్షన్లు, అలర్జీలు కూడా రావచ్చట! ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది అనుసరించే పద్ధతి వ్యాక్స్ చేసుకోవడం. దీనికోసం వ్యాక్స్ స్ట్రిప్స్ వాడుతుంటారు. అయితే చర్మతత్వాన్ని బట్టి వీటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్మం ఎరుపెక్కడం, దద్దుర్లు రావడంతో పాటు చర్మం మరింత సున్నితంగా మారుతుంది. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు కందిపోవడం, ర్యాషెస్.. వంటి సమస్యలొస్తాయట. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ ఎంచుకునే ముందు చర్మతత్వాన్ని పరిగణనలోకి తీసుకోవడం, ఇంట్లో తయారుచేసుకున్న వ్యాక్స్ అయినా.. బయటి నుంచి తెచ్చిన స్ట్రిప్ అయినా.. అప్లై చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



# నిద్రను ఆహ్వానిద్దామా!



ఆధునిక జీవనశైలి కానుకగా ఇస్తున్న సవాళ్లలో నిద్రలేమి ఒకటి. ఒకవైపు ఆఫీసు పనులు, మరోవైపు ఇంటి బాధ్యతలు, ఇంకోవైపు రేపటి ప్రణాళికలు.. అన్నీ కలిసి మన మెదడును నిరంతరం పరుగులెత్తిస్తుంటాయి. ఇక, పగలు తీసుకునే కాఫీ, టీల అలవాటు నుంచి నిద్రపోయే ముందు చూసే వెబ్ సిరీస్‌ల ఉత్కంఠ వరకూ అన్నీ నిద్రను దూరం చేసే అలవాట్లే. మరి దీనికి పరిష్కారమేంటీ అంటారా? అది మన చేతుల్లోనే ఉందంటారు నిపుణులు. వాటిల్లో మొదటిది... రాత్రి నిద్రపోవడానికి కనీసం గంట ముందు నుంచే డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండటం. బదులుగా ఆ సమయాన్ని పుస్తక చదవడానికో, నచ్చిన సంగీతం వినడానికో కేటాయిస్తే చాలు... నిద్ర ముంచుకొస్తుంది. అలానే, పడకగదిలో వెలుతురు తగ్గించుకుని శరీరాన్ని విశ్రాంతి స్థితిలోకి తీసుకెళ్లడమూ ఎంతో అవసరం. రాత్రి పూట మసాలా, నూనె ఆహారాలకి దూరంగా ఉండి, వేడి పాలో, హెర్బల్ టీనో తాగడం వల్ల శరీరానికి ఉపశమనం. అంతేకాదు, రేపటి పనుల గురించి ఆందోళన చెందడం కంటే, వాటిని ఒక డైరీలో రాసిపెడితే మనసు తేలికపడుతుంది. శ్వాసపై దృష్టి సారిస్తూ చేసే చిన్నపాటి ధ్యానంతో కునుకు దరికి చేరేలా చేయొచ్చు. ఎందుకంటే, నిద్రని బలవంతంగా పొందలేం... మనసునూ, శరీరాన్నీ ప్రశాంతపరుచుకుంటే అదే మనల్ని ఆహ్వానిస్తుంది. కాబట్టి, ఈ రాత్రి నుంచే ఈ చిన్న మార్పులను మొదలుపెట్టి, హాయిగా కళ్లు మూసుకోండి. రేపటి కొత్త ఉదయం ఉత్సాహంతో మీకు స్వాగతం పలుకుతుంది.

# జీన్స్‌తోనే నిద్రపోతున్నారా?

సందర్భం ఏదైనా.. కొంతమంది జీన్స్‌లోనే సౌకర్యంగా ఫీలవుతారు. అయితే ఇంటికొచ్చాక ఈ దుస్తులు మార్చుకొని వదులుగా ఉండే నైట్‌వేర్ ధరించినప్పుడే సౌకర్యంగా అనిపిస్తుంది. కానీ ఒక్కోసారి అనుకోకుండా అదే జీన్స్‌లో నిద్రపోవాల్సి రావచ్చు. అయితే దీనివల్ల అసౌకర్యమే కాదు.. ఆరోగ్యపరంగానూ కొన్ని సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. జీన్స్.. డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో తయారవుతుంది. త్వరగా చెమటను పీల్చుకునే స్వభావం ఈ మెటీరియల్‌కు ఉండదు. అందులోనూ స్కిన్ టైట్ జీన్స్ అయితే ఇక చెప్పే పనే లేదు. ఫలితంగా జననేంద్రియాల వద్ద చెమట అలాగే ఉండిపోతుంది. ఈ తేమతోనే గంటల తరబడి ఉండిపోవడం వల్ల.. ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది క్రమంగా ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. అలాగే బిగుతైన దుస్తుల వల్ల ఆయా శరీర భాగాలకు గాలి తగలక.. అక్కడి చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయి. కాబట్టి సాధ్యమైనంత తక్కువ సమయం జీన్స్ ధరించేలా చూసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. కొంతమందికి కాలంతో సంబంధం లేకుండా ఎక్కువగా చెమట పడుతుంటుంది. ఇలాంటివారు ఈ విషయంలో మరింత అలర్ట్‌గా ఉండడం మంచిదంటున్నారు. సాధారణంగా నిద్రలోకి జారుకున్న కొన్ని గంటలకు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ వస్తుంది. అయితే జీన్స్ ధరించి నిద్రపోయినప్పుడు గాలి శరీరానికి తగలక.. శరీర ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. తద్వారా నిద్రకు అంతరాయం ఏర్పడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి పడుకోవడం వల్ల అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. ఇది కూడా సుఖనిద్రను దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి నిద్ర పోవడం వల్ల గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి పడుతుంది. నెలసరి సమయంలోనూ అసౌకర్యంగా ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి పడుకునేటప్పుడైనా, ఇతర సమయాల్లో అయినా సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.



# డబుల్ చిన్ తగ్గాలంటే...

ఎంతందంగా తయారైనా, అద్దంలో చూసుకోగానే కనిపించే డబుల్ చిన్... మనసు కలుక్కుమనేలా చేస్తుంది. చాలామందిలో ఆత్మవిశ్వాసాన్నీ తగ్గిస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, జన్యుపరమైన కారణాలు, మెడ కండరాల బలహీనత వల్లా ఇలా జరగొచ్చు. ఏదేమైనా తగ్గించుకోవడానికి మన వంతు ప్రయత్నించాలి కదా! అందుకోసమే ఈ చిట్కాలు. చిన్ లిఫ్ట్స్: నిటారుగా నిలబడి, తలను



వెనక్కి వంచి పైకప్పు వైపు చూడండి. ఇప్పుడు పెదాలను ముందుకు చాచి, సీలింగ్‌ను ముద్దాడినట్లు చేయండి. ఈ స్థితిలో 5 సెకన్ల పాటు ఉండి, తిరిగి సాధారణ స్థితికి రండి. ఇలా రోజుకు 15 సార్లు చేయడం వల్ల గడ్డం కింద కండరాలు బిగుతుగా మారతాయి. జా క్లెంచెస్: పెదాలను మూసి, దవడ కండరాలను గట్టిగా బిగించి 5–10 సెకన్ల పాటు ఉంచండి. ఆ తర్వాత మెల్లగా రిలాక్స్ అవ్వండి. ఇలా పదిసార్లు చేయడం వల్ల దవడ కండరాలు దృఢంగా మారి, క్రమంగా డబుల్ చిన్ తగ్గుతుంది. టంగ్ స్ట్రెచ్: తల నిటారుగా ఉంచి, నాలుకను సాధ్యమైనంత వరకు బయటకు చాచండి. అదే సమయంలో పైకి చూస్తూ నాలుక కొనతో ముక్కును తాకడానికి ప్రయత్నిస్తున్నట్లుగా 5–10 సెకన్లు ఉంచండి. ఇది మెడ కండరాలను సాగదీసి కొవ్వు తగ్గడానికి తోడ్పడుతుంది.

# రోజూ చూయింగ్ గమ్‌లను అదే పనిగా నములుతున్నారా.. అయితే జాగ్రత్త..

ముఖం సన్నగా కనిపించాలన్నా, దవడ ఆకృతి (జాలైన్) స్పష్టంగా రావాలన్నా చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం ఉపయోగపడుతుందనే అభిప్రాయం యువతలో బలంగా ఉంది. దీంతో చాలామంది రోజూ గంటల తరబడి చూయింగ్ గమ్ నమలడం అలవాటుగా మార్చుకుంటున్నారు. అయితే ఇది ముఖాన్ని సన్నగా చేయకపోగా, దవడ కీళ్లపై అనవసర ఒత్తిడి పెంచి పలు ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దవడను పుర్రెతో కలిపే కీళ్లను టెంపరో మ్యాండిబ్యులర్ జాయింట్ (TM Joint) అంటారు. చెవులకు ముందు భాగంలో ఉండే ఈ కీళ్లు నమలడం, మాట్లాడడం, నోరు తెరవడం–మూయడం వంటి ప్రతి కదలికలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం వల్ల సాధారణంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ గంటల తరబడి నిరంతరం నమలడం వల్ల ఈ కీళ్లపై పదేపదే ఒత్తిడి పడుతుంది. చూయింగ్ గమ్‌ను ఎక్కువసేపు నమలడం వల్ల దవడ కండరాలు అధికంగా పనిచేయాల్సి వస్తుంది. దీంతో క్రమంగా దవడ కీళ్లలో ఒత్తిడి పెరిగి కండరాలు అలసిపోవడం, కీళ్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక దవడ సమస్యలు తలెత్తుతాయి. దవడ కీళ్లపై అధిక ఒత్తిడి పడటం వల్ల కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. నోరు తెరిచినప్పుడు లేదా మూసినప్పుడు దవడ వద్ద క్లిక్ అనే శబ్దం వినిపించడం, దవడ బిగుసుకుపోవడం, చెవుల పక్కన లేదా కణతల వద్ద తలనొప్పి రావడం, ఆహారం నమిలేటప్పుడు నొప్పి అనిపించడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చూయింగ్ గమ్ ను నమలడం వల్ల ముఖంలోని కొవ్వు కరిగి ముఖం సన్నగా మారుతుందనే అభిప్రాయానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇది దవడ కండరాలను కొంతవరకు బలపరుస్తుంది. కానీ శరీరంలోని ఒకే భాగంలో కొవ్వును కరిగించడం సాధ్యం కాదు. కొవ్వు తగ్గడం మొత్తం శరీర బరువు తగ్గుదలతో సంబంధం ఉన్న ప్రక్రియ. కాబట్టి చూయింగ్ గమ్‌ను ముఖానికి వ్యాయామంగా భావించడం సరైనది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దవడ కీళ్లు కూడా శరీరంలోని ఇతర కీళ్ల మాదిరిగానే పరిమితంగా ఉపయోగించినప్పుడే ఆరోగ్యంగా ఉంటాయి. అవసరానికి మించి నిరంతరం ఒత్తిడి పెడితే సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందువల్ల అప్పుడప్పుడు చూయింగ్ గమ్ నమలడం సాధారణంగా హానికరం కాకపోయినా, అలవాటుగా గంటల తరబడి నమలడం మాత్రం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు.



# మెడ చుట్టూ నల్లగా..

గర్భం దాల్చినపుడు శరీరంలో జరిగే మార్పుల వల్ల కొంతమందిలో సౌందర్యపరంగా సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా మెడ చుట్టూ నల్లగా తయారవడం అనేది గర్భిణులందరికీ ఎదురయ్యే సాధారణ సమస్య. అలా ఏర్పడిన నలుపుదనాన్ని ఎలా తగ్గించుకోవాలో తెలీక చాలామంది సతమతమవుతూ ఉంటారు. అయితే ఇంట్లోనే మనకు అందుబాటులో ఉన్న పదార్థాలతోనే ఈ సమస్యకు చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. చిన్న కీరాదోసను తీసుకొని జాగ్రత్తగా తురుముకోవాలి. ఈ తురుముతో నల్లగా మారిన మెడపై పదిహేను నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. కీరాదోస క్లెన్సర్‌లా పనిచేసి మెడ చర్మంపై పేరుకున్న మురికిని తొలగిస్తుందట. కీరాదోస తురుముతో రోజూ మెడ చర్మాన్ని మర్దన చేసుకుంటూ ఉంటే కొద్ది రోజుల్లోనే చక్కటి ఫలితం కనిపిస్తుందంటున్నారు నిపుణులు. టమాటో, నిమ్మరసం, తేనెతో తయారు చేసిన మిశ్రమం మెడపై ఏర్పడిన నలుపును తొలగిస్తుందట. కొద్దిగా టమాటో రసం తీసుకొని దానిలో కొన్ని చుక్కల నిమ్మరసం, కాస్త తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాలు ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. బంగాళాదుంపను తొక్కు తీసి మెత్తగా చేసుకోవాలి. దీనికి కాస్త నిమ్మరసం కూడా జత చేయాలి. ఈ మిశ్రమాన్ని మెడపై



అప్లై చేసుకొని పదిహేను నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేసుకోవాలి. బంగాళాదుంప మంచి క్లెన్సర్‌గా పనిచేస్తుంది. ఇది నల్లగా మారిన చర్మాన్ని తిరిగి ప్రకాశవంతంగా అయ్యేలా చేస్తుంది. నిమ్మ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

అయితే పైన పేర్కొన్నవన్నీ సహజసిద్ధ పదార్థాలే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇవి కూడా.. ప్రొటీన్ కోసం!

ఉదయం అల్పాహారంలో భాగంగా కోడిగుడ్లు తీసుకోవడం కొంతమందికి అలవాటు. రోజంతా శక్తి స్థాయులు స్థిరంగా ఉండాలన్నా, ఎక్కువసేపు ఆకలేయకుండా బరువును అదుపులో ఉంచుకోవాలన్నా ఇందులోని ప్రొటీన్ సహాయపడుతుంది. అయితే రోజూ గుడ్లు తినీ తినీ బోర్ కొడుతుందనే వారూ లేకపోలేదు. అలాంటి వారు అయిష్టంగానో, బలవంతంగానో వీటిని తీసుకోవడం కంటే ప్రొటీన్లు అధికంగా లభించే ఇతర పదార్థాల్ని బ్రేక్‌ఫాస్ట్‌లో చేర్చుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇంతకీ అవేంటో తెలుసుకుందాం రండి..

యోగర్ట్‌లో ప్రొటీన్ శాతం అధికంగా ఉంటుంది. కాబట్టి ఉదయాన్నే అల్పాహారంగా ఓ కప్పు యోగర్ట్ తీసుకోవచ్చు. ఇలా ప్లెయిన్‌గా తినడానికి ఇష్టపడని వారు ఇందులో పండ్ల ముక్కలు, బాదంపప్పులు, వాల్‌నట్స్, గింజలు.. వంటివి కలుపుకొని తినచ్చు. ఫైబర్ అధికంగా ఉండే ఈ నట్స్‌ని ప్రొటీన్‌తో కలిపి తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండచ్చంటున్నారు నిపుణులు.

ప్రొటీన్లు ఎక్కువగా లభించే పదార్థాల్లో పనీర్ ఒకటి. దీంతో బుర్జీ తయారుచేసుకొని తీసుకున్నా సమాన ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఉల్లిపాయ, క్యాప్సికం, పచ్చిమిర్చి, టొమాటో ముక్కల్ని నూనెలో వేయించి.. మెదిపిన పనీర్‌ని ఇందులో వేసి తయారుచేసేదే పనీర్ బుర్జీ. దీన్ని గోధుమ లేదా మల్టీ గ్రెయిన్ బ్రెడ్‌పై వేసుకొని తినచ్చు. లేదంటే కుల్చా, పరాటా, చపాతీకి కాంబినేషన్ కర్రీగా కూడా తీసుకోవచ్చట. రాత్రి పూట పెరుగు లేదా పాలల్లో కొన్ని ఓట్స్ కలపాలి. ఉదయాన్నే దీంట్లో కొన్ని నట్స్, పండ్ల ముక్కలు చల్లుకొని తింటే రుచికి రుచి.. ప్రొటీన్లూ శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. పాలు, పెరుగు, ఓట్స్.. ఈ మూడింట్లోనూ ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయని చెబుతున్నారు. మొలకెత్తిన గింజలతో తయారుచేసిన సలాడ్‌నీ ఉదయం అల్పాహారంగా తీసుకోవచ్చంటున్నారు నిపుణులు. పెసలు, శెనగలు, బఠానీ, బొబ్బర్లు, రాజ్మా.. వంటి ధాన్యాల్లో ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయి. ఇవి మొలకలొచ్చాక.. వీటిలో టొమాటో, ఉల్లిపాయ ముక్కలు కలుపుకొని.. కొత్తిమీర–పుదీనా తురుముతో గార్నిష్ చేసుకొని.. కొద్దిగా నిమ్మరసం పిండి తీసుకుంటే రుచిగా ఉంటుంది. ప్రొటీన్లూ శరీరానికి అందుతాయి. పెసరపప్పును నానబెట్టి మెత్తగా రుబ్బుకొని.. కాస్త మందపాటి దోశలా వేసుకొని తయారుచేసుకొనే చిల్లా వంటకం



గురించి చాలామందికి తెలుసు. అయితే దీన్ని ప్లెయిన్‌గా తీసుకుంటే తినడం కష్టం.. కాబట్టి దోశ వేసుకొనేటప్పుడే కాస్త ఉప్పు, కారం చల్లి.. కాయగూర ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి కాల్చుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. ఈ పప్పులోనూ ప్రొటీన్ అధికంగా ఉంటుంది. వేడివేడి ఈ దోశల్ని క్రీమీగా చిలికిన పెరుగు లేదంటే చట్నీతో తీసుకుంటే రుచిగా ఉంటాయి. ఇక్కడ పెసరపప్పు బదులుగా శెనగపప్పు కూడా ఉపయోగించచ్చు.

బ్రెడ్–పనీర్ బటర్.. చాలామంది దీన్ని అల్పాహారంగా తీసుకోవడం చూస్తుంటాం. ఈ బటర్‌లో ప్రొటీన్ అధికంగా లభిస్తుంది. అయితే ఇక్కడ వైట్ బ్రెడ్‌కు బదులుగా గోధుమ, మల్టీగ్రెయిన్ బ్రెడ్ తీసుకోవడం మేలంటున్నారు నిపుణులు. కావాలంటే బ్రెడ్‌పై బటర్ అప్లై చేసుకున్నాక.. పండ్ల ముక్కలు, నట్స్, తేనె.. వంటివి వేసుకొని తీసుకుంటే రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం..!

సత్తూ డ్రింక్ కూడా చాలామందికి తెలిసిన పానీయమే! పుట్నాల పొడిని నీటిలో కలుపుకొని.. తగినంత ఉప్పు, చిటికెడు మిరియాల పొడి వేసి, నిమ్మరసం పిండుకొని.. దీన్ని తయారుచేసుకోవాలి. ఒకవేళ తియ్యగా కావాలనుకునే వారు బెల్లం పొడి కలుపుకోవచ్చు. పుట్నాలలో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది.. తద్వారా రోజంతటికీ కావాల్సిన శక్తిని పొందచ్చంటున్నారు నిపుణులు.

## జూన్ అత్యధిక కార్ల విక్రయాల్లో టాటా

జూన్‌లో అత్యధికంగా అమ్ముడుపోయిన 10కార్ల మోడళ్లలో తొలి రెండు స్థానాలను టాటా మోటార్స్ దక్కించుకుంది. అయితే మొత్తం 10మోడళ్లలో ఆరు మారుతీవే కావడం విశేషం. హ్యుందాయ్, మహీంద్రా నుంచి చెరో మోడల్ ఉన్నాయి. ఉత్పత్తి అవాంతరాల ఫలితంగా ఈ జాబితాలో హ్యుందాయ్ క్రెటా నిలబడలేదు. టాటా మోటార్స్ ప్రయాణికుల వాహనాల (పీవీ) విక్రయాలు జూన్‌లో 63,083గా నమోదయ్యాయి. 2025 జూన్‌లో ఇవి 37,237మాత్రమే. పంచ్, టియాగో కొత్తమోడళ్లకు బుకింగ్‌లు భారీగా వచ్చాయని, విద్యుత్‌కార్లు కూడా రికార్డుస్థాయిలో 14,800 విక్రయం కావడం కలిసొచ్చిందన్నారు.




# రిలయన్స్ 5 దిగ్గజ ఐటీ కంపెనీలు మార్కెట్ విలువలో..

దేశంలోని 5 దిగ్గజ ఐటీ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ కలిసి, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) మార్కెట్ విలువకు ఇంచుమించుగా సమాన స్థాయికి దిగివచ్చింది. ఇటీవలి కొన్ని నెలలుగా ఐటీ షేర్ల ధరల్లో భారీ దిద్దుబాటే ఇందుకు కారణం. ప్రస్తుతం రూ.17.65 లక్షల కోట్ల మార్కెట్ విలువతో దేశంలో అత్యంత విలువైన కంపెనీగా ఆర్‌ఐఎల్ ఉంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాజీస్, టెక్ మహీంద్రా కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.18.12 లక్షల కోట్లుగా ఉంది. గత మంగళవారం (జూన్ 30న) చూస్తే ఈ విలువ రూ.17.50 లక్షల కోట్లే. ఆ రోజు ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.17.51 కోట్ల కంటే ఇది కాస్త తక్కువే. గత రెండు దశాబ్దాల్లో అగ్రగామి 5 ఐటీ కంపెనీల మొత్తం మార్కెట్ కలిపినా కూడా రిలయన్స్ ఇండస్ట్రీస్ కంటే తక్కువగా నమోదు కావడం ఇప్పుడే. 2024 నుంచి 46.2% ఆవిరి:




2024లో ఆర్‌ఐఎల్ మార్కెట్ విలువ జీవనకాల గరిష్ఠమైన రూ.21.19 లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం ఆ స్థాయి నుంచి 16.7% తగ్గి రూ.17.65 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఇదే సమయంలో 5 దిగ్గజ ఐటీ కంపెనీల మార్కెట్ విలువ రూ. 33.71 లక్షల కోట్ల నుంచి 46.2% ఆవిరై రూ.18.12 లక్షల కోట్లకు పరిమితమైంది. 2026లో ఇప్పటివరకు ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా షేర్లు 36% వరకు నష్టపోయాయి. కృత్రిమ మేధ వల్ల ఐటీ సేవలకు గిరాకీ తగ్గుతుందనే భయాలు, అంతర్జాతీయంగా బలహీన గిరాకీ పరిస్థితుల వంటివి సంప్రదాయ ఐటీ సేవల కంపెనీల షేర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

# అదానీ కేసును శాశ్వతంగా మూసేయండి

భారత కుబేరుడు గౌతమ్ అదానీ, మరో ఏడుగురిపై క్రిమినల్ కేసును ఉపసంహరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా న్యాయ విభాగం(డీఓజే) గట్టిగా సమర్థించుకుంది. ఈ కేసు విచారణ చట్టపరంగా లోపభూయిష్టంగా ఉందని, దేశ



ప్రయోజనాలకు విరుద్ధమని, ట్రంప్ ప్రభుత్వ ప్రాధాన్యతలకు దూరంగా ఉందని 10 పేజీల లేఖలో ఫెడరల్ జడ్జికి తెలిపింది. ఏడాది కిందటే ఈ కేసును ఉపసంహరించి ఉండాలని, లేదా అసలు తీసుకుని రాకుండా ఉండాల్సిందని పేర్కొంది. తన నిర్ణయాన్ని సమీక్షించడంలో కోర్టుకు పరిమిత పాత్రే ఉంటుందని వివరించింది. కేసును శాశ్వతంగా ఎందుకు మూసివేయాలో న్యాయ శాఖ వివరించాలని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ కోరిన నేపథ్యంలో, ఈ స్పందన చోటు చేసుకుంది. బైడెన్ ప్రభుత్వ హయాంలో 2024లో అదానీ, ఇతరులపై డీఓజే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. సౌర విద్యుత్తు కాంట్రాక్టులు పొందడం కోసం భారత్‌లోని ఉన్నత స్థాయి వ్యక్తులకు 250 మిలియన్ డాలర్ల మేర లంచాలు ఇచ్చారని, ఇందు కోసం అమెరికా ఇన్వెస్టర్ల నుంచి కనీసం 175 మి. డాలర్లు సమీకరించార్నది అదానీపై వచ్చిన ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ కొట్టివేస్తూ వచ్చింది. మా అధికారాన్ని ప్రశ్నించడమా?: బహిరంగంగా తమ నిర్ణయాలను సమర్థించుకోవాలని కోరడం, భవిష్యత్‌లో కేసుల కొట్టివేతలకు అడ్డంకిగా మారుతుందని, గోప్యమైన అంతర్గత చర్చలను బహిర్గతం చేస్తుందని, అభియోగాల నిర్ధారణపై తమకున్న రాజ్యాంగబద్ధమైన అధికారాన్ని ఉల్లంఘిస్తుందని డీఓజే తెలిపింది. కొట్టివేతకు గల కారణాలపై జరిపే న్యాయ విచారణల వల్ల గోప్యమైన అంతర్గత చర్చలు బయటకు వస్తాయని ప్రిన్సిపల్ అసోసియేట్ డిప్యూటీ అటార్నీ జనరల్ ఆర్ ట్రెంట్ మెక్‌కాటర్ పేర్కొన్నారు. ఆ ఆరోపణలు భారత్‌కు సంబంధించినవి కావడం, భారత అధికారులు వాటిపై దర్యాప్తు చేసి.. చర్య తీసుకోదగ్గ అంశాన్ని కనుగొనకపోవడం, పెట్టుబడిదార్లకు ఎటువంటి ఆర్థిక నష్టాలు రాకపోవడం, కీలక సాక్ష్యాలు – సాక్షులు అమెరికాకు వెలుపల ఉండడం, అమెరికా కోర్టుకు వారు హాజరయ్యే అవకాశాలు లేకపోవడం లాంటి అంశాలను ఆరోపణల ఉపసంహరణకు కారణాలుగా తెలిపింది.

## రూ.29,000 కోట్లతో సరికొత్త ఉడాన్ పథకం



దేశంలోని చిన్న పట్టణాలకూ విమాన సర్వీసులు నిర్వహించేందుకు అమలు చేస్తున్న ఉడాన్ పథకం తదుపరి దశను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. రాబోయే పదేళ్లలో సుమారు రూ.29,000 కోట్లు ఈ పథకంపై వెచ్చిస్తారు. ఇప్పటివరకు విమాన సేవలు లేని ప్రాంతాలనూ కొత్త పథకంలో అనుసంధానించనున్నారు. విమాన ప్రయాణాన్ని మరింత మందికి చేరువ చేసేలా మౌలిక వసతులను ఈ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2016లో ప్రారంభమైన ఉడాన్ పథకం ఇప్పటివరకు 669 మార్గాలను కార్యరూపంలోకి తెచ్చింది. కొత్తగా సవరించిన పథకం కింద, 100 ఏరోడ్రోమ్‌లను రూ.12,000 కోట్లతో అభివృద్ధి చేస్తారు. 200 హెలిప్యాడ్‌లను నిర్మించడం, ప్రాంతీయ విమానయాన సంస్థల కార్యకలాపాల కోసం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కొనసాగించడంతో పాటు చిన్న విమానాశ్రయాల నిర్వహణకూ మద్దతు అందిస్తారు. జోధ్‌పుర్ విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.480 కోట్లతో నిర్మించిన కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించారు. 23,000 చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ టెర్మినల్‌ను, ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా రూపొందించారు. బహుళ చెక్–ఇన్ కౌంటర్లు, అధునాతన లగేజీ నిర్వహణ వ్యవస్థలు, ఏరోబ్రిడ్జిలతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.

# లక్ష కోట్ల డాలర్ల ఎగుమతులే లక్ష్యం..

### 2026-27పై వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.95 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులే లక్ష్యమని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ స్థాయిని చేరుకోవాలంటే వస్తువుల ఎగుమతుల్లో 16–17%, సేవల్లో 11% వృద్ధి సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వస్తువుల ఎగుమతుల ద్వారా 530 బిలియన్ డాలర్లు (సుమారు రూ.50.35 లక్షల కోట్లు), సేవల ఎగుమతుల ద్వారా 470 బి.డాలర్ల (సుమారు రూ.44.65 లక్షల కోట్ల) లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఆయన తెలిపారు. 2025–26లో మన మొత్తం వస్తు–సేవల ఎగుమతులు 870 బిలియన్ డాలర్లు (సుమారు రూ.82.65 లక్షల కోట్లు)గా ఉంది. ఇందులో 442 బి.డాలర్ల (సుమారు రూ.41.99 లక్షల కోట్ల) వస్తువులు ఎగుమతి కాగా, ఈసారి మరో 90 బి.డాలర్ల (సుమారు రూ.8.55 లక్షల కోట్ల) మేర పెరగాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంత్సరం ఏప్రిల్–జూన్‌లో వస్తువుల ఎగుమతుల్లో 15%, సేవల ఎగుమతుల్లో 11% వృద్ధి నమోదైంది. దిల్లీ: వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టీఏ) సద్వినియోగం చేసుకుని, ప్రపంచ బొమ్మల విపణిలో 5% వాటా సాధించే దిశగా దేశీయ కంపెనీలు అడుగులు వేయాలనికేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. పర్యావరణహిత తయారీ పద్ధతులనూ అవలంబించాలని కోరారు. ఇక్కడ 17వ టాయ్ బిజ్ ఇంటర్నేషనల్ బీ2బీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ బొమ్మల తయారీలో



నాణ్యత పెంచాలని, అధునాతన పద్ధతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎగుమతులు 10 రెట్లు పెంచుకోవాలి: బ్రిటన్, ఐరోపా కూటమితో కుదుర్చుకున్న ఎఫ్‌టీఏలు దేశీయ బొమ్మల పరిశ్రమకు భారీగా ఎగుమతి అవకాశాలు కల్పిస్తాయని మంత్రి గోయల్ తెలిపారు. 2024లో 34 కోట్ల డాలర్ల (సుమారు రూ.3,200 కోట్ల) బొమ్మలు ఎగుమతి కాగా, రాబోయే సంవత్సరాల్లో 10 రెట్ల మేర పెంచుకోవాలని సూచించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), నేషనల్ టెస్ట్ హౌస్, ప్రభుత్వ ఆధ్వర్యంలో బొమ్మల తయారీ క్లస్టర్‌లలో ఆధునిక పరీక్షా సదుపాయాలు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తేనే, అంతర్జాతీయ బొమ్మల విపణిలో భారత్ తన ఉనికిని గణనీయంగా విస్తరించుకుంటుందని వివరించారు. అంతర్జాతీయంగా బొమ్మల అమ్మకాలు 120 బిలియన్ డాలర్లు (సుమారు రూ.11.50 లక్షల కోట్లు)గా ఉండగా.. ఇందులో భారత్ వాటా కేవలం 0.3 శాతమే. దేశీయ బొమ్మల రంగ విపణి దాదాపు రూ.18,000 కోట్లుగా ఉంది. ఇందులో దిగుమతులు చేసుకున్న ఉత్పత్తుల వాటా రూ.2,500– 3,000 కోట్లు.






## ప్రజ్ఞానంద ఉమ్మడిగా అగ్రస్థానంతో..

గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న జాగ్రెబ్ అంచె టోర్నీలో ర్యాపిడ్ విభాగాన్ని భారత స్టార్ ప్రజ్ఞానంద ఉమ్మడిగా అగ్రస్థానంతో ముగించాడు. చివరి రోజు, శనివారం ఇవాన్ సరిక్ (క్రొయేషియా), డానియెల్ (రొమేనియా), అనీష్ (నెదర్లాండ్స్)పై ప్రజ్ఞానంద విజయాలు నమోదు చేశాడు. దీంతో 12 పాయింట్లతో అలీరెజా (ఫ్రాన్స్)తో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచాడు. మరో భారత స్టార్ దొమ్మరాజు గుకేశ్ 10 పాయింట్లతో కీమర్ (జర్మనీ)తో కలిసి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. చివరి మూడు రౌండ్లలో సతారోవ్ (ఉజ్బెకిస్తాన్), కీమర్, అలీరెజాతో గుకేశ్ డ్రా చేసుకున్నాడు.

# రవి బిష్ణోయ్ చెత్త రికార్డు..

ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా



స్పిన్నర్ రవి బిష్ణోయ్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. 4 ఓవర్లు వేసి ఒక్క వికెట్టూ పడగొట్టకుండా 60 పరుగులు ఇచ్చాడు. లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్ జట్టుకు చివరి నాలుగు ఓవర్లలో 49 పరుగులు అవసరమయ్యాయి. 17 ఓవర్ వేసిన బిష్ణోయ్ 29 పరుగులు ఇవ్వడంతో భారత్ గెలుపు అవకాశాలు సన్నగిల్లాయి. ఆ ఓవర్‌లో టీమ్‌ఇండియా స్పిన్నర్ రెండు నోబాల్స్ వేయగా.. ఫ్రీ హిట్‌లను జాకబ్ బెతెల్ సిక్సర్లుగా మలిచాడు. ఇదే మ్యాచ్‌లో అంతకుముందు బిష్ణోయ్ మరో నో బాల్ వేశాడు. దీంతో ఒక అంతర్జాతీయ టీ20లో మూడు నోబాల్స్ వేసిన ఐసీసీ పూర్తిసభ్యదేశానికి చెందిన తొలి బౌలర్‌గా రవి బిష్ణోయ్ చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. అంతేకాకుండా టీ20ల్లో ఒకే ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన మూడో భారత బౌలర్‌గా బిష్ణోయ్ నిలిచాడు. 2020లో న్యూజిలాండ్‌పై శివమ్ దూబె 34 రన్స్, 2016లో వెస్టిండీస్‌పై స్టువర్ట్ బిన్నీ ఒకే ఓవర్‌లో 32 పరుగులు సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్ నుంచి బిష్ణోయ్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరముందని మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. "రవి బిష్ణోయ్ చివర్లో పుంజుకుంటాడని భావించి బౌలింగ్ చేయించాం. కానీ 17వ ఓవర్‌లో ఎక్కువ రన్స్ రావడం మాకు కాస్త ఇబ్బందికరంగా మారింది. ఏది ఏమైనా కచ్చితంగా అతడు ఆ అనుభవం నుండి పాఠాలు నేర్చుకోవాలి" అని శ్రేయస్ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో రెండో టీ20లో భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి కీలకమైన హ్యారీ బ్రూక్ వికెట్ పడగొట్టాడు. దీంతో టీ20ల్లో అక్షర్ అంతర్జాతీయ 100 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి భారత స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా 100 వికెట్ల మైలురాయి అందుకున్న నాలుగో భారత క్రికెటర్‌గా నిలిచాడు. పేసర్లు అర్ష్‌దీప్ సింగ్ (134 వికెట్లు), జస్‌ప్రీత్ బుమ్రా (121), హార్దిక్ పాండ్య (114) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

# రెండో అనధికార టెస్టులో ఇండియా ఎ ఘన విజయం



శ్రీలంక–ఎతో జరిగిన రెండో అనధికార టెస్టులో భారత్–ఎ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇండియా ఎ 1–0తో కైవసం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 541/8 స్కోరుతో ఆదివారం, చివరి రోజు ఆటను కొనసాగించిన ఇండియా ఎ మరో రెండు పరుగులకే తొమ్మిదో వికెట్ కోల్పోయింది. రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రుతురాజ్ గైక్వాడ్ (13) తిరిగి బ్యాటింగ్‌కు రాకపోవడంతో భారత్ ఇన్నింగ్స్ అక్కడితో ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక–ఎ 209 పరుగులకే ఆలౌటైంది. అషేన్ బండార (87) ఒక్కడే రాణించాడు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ ఆరు వికెట్లు పడగొట్టగా.. సారాంశ్ జైన్ 2, ఆకిబ్ నబీ దార్, యశ్ ఠాకూర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. శ్రీలంక నిర్దేశించిన 33 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 6.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా ఛేదించింది. సాయి సుదర్శన్ (25★), అమన్ మోఖడే (11★) రన్స్‌చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక–ఎ 366 పరుగులకు ఆలౌటైంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే.

# మళ్లీ పాక్ టెస్టు కెప్టెన్‌గా బాబర్ అజామ్

పాకిస్థాన్ టెస్టు కెప్టెన్‌గా ఉన్న షాన్ మసూద్‌పై వేటు పడింది. అతడి స్థానంలో బాబర్ అజామ్‌ను సారథిగా నియమించారు. త్వరలో వెస్టిండీస్, ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్‌లకు పాక్ సెలక్షన్ కమిటీ జట్లను ప్రకటించింది. ఈ సిరీస్‌ల నుంచి బాబర్ అజామ్ నాయకత్వ బాధ్యతలు అందుకోనున్నాడు. షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్థాన్ 16 మ్యాచ్‌లు ఆడి నాలుగింట మాత్రమే గెలిచింది. 12 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. బంగ్లాదేశ్ చేతిలో రెండుసార్లు వైట్ వాష్‌కు గురైంది. మసూద్ ఆటగాడిగా ఫర్వాలేదనిపిస్తున్నప్పటికీ కెప్టెన్‌గా విఫలం కావడంతో వేటు వేశారు. ఇక, 2021–23 మధ్య కూడా బాబర్ అజామ్ పాక్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని నాయకత్వంలో 20 మ్యాచ్‌లు ఆడిన పాక్.. 10 విజయాలు సాధించింది. ఆరింటిలో ఓడి నాలుగు మ్యాచ్‌లను డ్రాగా ముగించింది. అయితే, ఇటీవల బాబర్ టెస్టు ఫామ్ బాగోలేదు. 2022 నుంచి ఇప్పటివరకు టెస్టుల్లో అతను ఒక్క సెంచరీ కూడా చేయలేదు. అయినా మళ్లీ అతనికే సారథ్య బాధ్యతలు అప్పగించడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జులై 25 నుంచి పాక్ జట్టు వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆగస్టు 19 నుంచి ఇంగ్లాండ్, పాక్ మధ్య మూడు టెస్టుల సిరీస్ మొదలుకానుంది.



# బెతెల్ మెరుపులు.. ఇంగ్లాండ్ విజయం

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ (IND vs ENG)లో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 7 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని ఇంగ్లాండ్ ఆరు బంతులు మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్‌కు శుభారంభం లభించలేదు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్లు ఫిల్ సాల్ట్, బట్లర్ డకౌటయ్యారు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన జాకబ్ బెతెల్ (76; 46 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. హ్యారీ బ్రూక్ (39; 15 బంతు ల్లో 4 ఫోర్లు ,3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. టామ్ బాంటన్ (39; 32 బంతుల్లో) రాణించాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. మూడో టీ20 జులై 7న నాటింగ్‌హామ్‌లో జరగనుంది. భారత బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (49; 40 బంతుల్లో 6 ఫోర్లు) టాప్ స్కోరర్. అభిషేక్ శర్మ (43; 24 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్)



దూకుడుగా ఆడాడు. శ్రేయస్ అయ్యర్ (37), తిలక్ వర్మ (24) రాణించారు. ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14) పరుగులు చేశాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కరన్ మూడు వికెట్లు, జోఫ్రా ఆర్చర్, విల్ జాక్స్, లియామ్ డాసన్‌లు తలో వికెట్ తీశారు. తొలి టీ20 మ్యాచ్ వర్షార్పణమైన విషయం తెలిసిందే.

# వుదయం సినిమా

MOVIE TIME!

## 'రావు బహదూర్' చిత్రానికి గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థాంక్స్

**వుదయం సినిమా :**

శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్, A+S మూవీస్, మహాయాన మోషన్ పిక్చర్స్ బ్యానర్ల మీద చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించిన చిత్రం 'రావు బహదూర్'. జీఎంబీ ఎంటర్టైన్మెంట్ సమర్పణలో వచ్చిన ఈ సినిమాకి వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సత్య దేవ్, దీపా థామస్ జంటగా నటించారు. ఈ చిత్రాన్ని జూలై 3న రిలీజ్ చేశారు.



## కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా స్టైలిష్ ఫస్ట్ లుక్ రిలీజ్



**వుదయం సినిమా :**

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ మ్యాసీవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ #VenkyAnil5 / #NkrAR2, ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి. కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కళ్యాణ్ రామ్ ఉత్సాహంగా, పండుగ వాతావరణంలో కనిపించారు. తెల్లటి పంచె, కుర్తా ధరించి, మెడలో పూలదండతో స్టైలిష్ సన్‌గ్లాసెస్ పెట్టుకుని డ్యాన్స్ స్టెప్ వేస్తూ ఆయన కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది. చిరునవ్వుతో ఆయన లుక్ ఫెస్టివల్ వైబ్‌ను తీసుకొచ్చింది.అందంగా అలంకరించిన సంప్రదాయ ఇంటి నేపథ్యంలో, రంగురంగుల పూలతోరణాలు, ఆనందంగా డ్యాన్స్ చేస్తున్న మహిళల మధ్య రూపొందించిన ఈ పోస్టర్ సినిమా పండుగ వాతావరణాన్ని అద్భుతంగా చూపిస్తోంది. ఇది నిజమైన "అచ్చ తెలుగు" ఫస్ట్ లుక్ అని చెప్పొచ్చు. ఫన్, కామెడీ, ఎమోషన్స్, గ్రాండ్ సెలబ్రేషన్స్‌తో కూడిన పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా సినిమా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తోంది. విశేషం ఏమిటంటే, ఈ ఫస్ట్ లుక్‌ను షేర్ చేయడానికి కళ్యాణ్ రామ్ @నందమూరికళ్యాణ్‌రామ్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ప్రారంభించారు.



## N5 పూజా కార్యక్రమంతో ప్రారంభం

**వుదయం సినిమా :**

వరుసగా మూడు విజయవంతమైన చిత్రాలను అందించిన యంగ్ హీరో నార్నే నితిన్, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధాకృష్ణ రెడ్డితో ఒక యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. #NN5 చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తుండగా, లోహిత ఎన్. కె క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. వివిధ చిత్ర పరిశ్రమలలో భారీ స్థాయి చిత్రాలను నిర్మిస్తూ దేశంలోని అగ్రశ్రేణి నిర్మాణ సంస్థలలో ఒకటిగా కెవిఎన్ ప్రొడక్షన్స్ గుర్తింపు పొందింది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాలను అందించే తమ మార్క్‌ను కొనసాగిస్తూ, ఈ సంస్థ #NN5 చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తోంది. ఇందులో నార్నే నితిన్ సరికొత్తగా కనిపించనున్నారు. ఈ చిత్రంలో నార్నే నితిన్ సరసన అనికా సురేంద్రన్, మేఘా శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకులలో భారీ ఆసక్తిని రేకెత్తించింది. ఈ రోజు సంప్రదాయ పూజా కార్యక్రమంతో చిత్రం ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ కెమెరాను ఆన్ చేశారు. 'MAD' చిత్ర దర్శకుడు కళ్యాణ్ శంకర్ ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించగా, వెంకట్ కె నారాయణ స్క్రిప్ట్‌ను దర్శకుడు రాధాకృష్ణకు అందజేశారు.ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రానికి అందించిన అద్భుతమైన సంగీతంతో ప్రశంసలు పొందిన వివేక్ & మెర్విన్ ద్వయం దీనికి సంగీతం సమకూరుస్తున్నారు. రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటింగ్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. శరణ్య పోట్ల, అజయ్ గద్దె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు.

## 'వసుదేవసుతం' నుంచి 'ఆనందాల వేళ' అంటూ సాగే పాట విడుదల

**వుదయం సినిమా :**

రెయిన్‌బో సినిమాస్ బ్యానర్ మీద ధన లక్ష్మి బాదర్ల నిర్మాణంలో వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ఈ సినిమాలో మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించారు. ఈ సినిమాని జూలై 10న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, ట్రైలర్ అందరినీ మెప్పించాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా నేడు మరో పాటను రిలీజ్ చేశారు.'ఆనందాల వేళ' అంటూ సాగే పాటను లవ్లీ హీరో ఆది విడుదల చేశారు. లిరికల్ వీడియోని వీక్షించి చిత్రయూనిట్‌ను అభినందించారు. ప్రామిసింగ్ ఉందని, టీంకి ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఇక ఈ పాటకు చైతన్య ప్రసాద్ రాసిన సాహిత్యం, సాయి చరణ్ భాస్కరుణి, శృతిక సముద్రాల గాత్రం.. మణిశర్మ బాణీ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ఫ్యామిలీ అంతా కలిసి సందడి చేసేలా ఈ పాట కనిపిస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన కంటెంట్‌ను గమనిస్తే ఇదొక ఫ్యామిలీ ఓరియెంటెడ్ సినిమా అని అర్థం అవుతోంది. అన్ని రకాల అంశాలను జోడించిన ఈ మూవీని తెరకెక్కించినట్టుగా కనిపిస్తోంది.ఈ చిత్రానికి జిజ్జు సన్ని (పార్కింగ్ ఫేమ్) కెమెరామెన్‌గా పని చేశారు. ఇక ఈ మూవీని జూలై 10న భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



## "గ్యానిధార్" మూవీ పోస్టర్, టీజర్ విడుదల



**వుదయం సినిమా :**

- వేడుకలో పాల్గొన్న వి. విజయేంద్ర ప్రసాద్, ఆర్. నారాయణ మూర్తి, వి. సముద్ర
- తెలుగు, బంజారా (గోర్ బోలి), హిందీ మూడు భాషల్లో తెరకెక్కిన చిత్రం
- ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా లాంచ్ వేడుక

హైదరాబాద్:

150 సంవత్సరాల క్రితం నిజాం నవాబుల పాలనలో గోర్ బంజారాల జీవితాల్లో చోటుచేసుకున్న యథార్థ సంఘటనలు, చారిత్రక ఆధారాల ప్రాతిపదికగా రూపొందుతున్న చిత్రం "గ్యానిధార్" (Gyaani Dhaar). సబ్‌టైటిల్ ది లిబరేటర్. జేకే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోహన్‌లాల్ రాథోడ్, కేసుల బ్రదర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కేశునందన్ దర్శకుడు. తెలుగు, బంజారా (గోర్ బోలి), హిందీ మూడు భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రం పోస్టర్, టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు, పీపుల్స్ స్టార్ ఆర్ప్రముఖ రచయిత వి. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. అక్బర్ కాలంలో 'మాలోకి' అనే వీరవనిత అక్బర్‌ను సైతం వాదనలో ఓడించి, బంజారాల వ్యాపార మార్గాలను మళ్లీ తెరిపించిన ఘనత ఈ జాతిది. ఇంతటి ఘనమైన ఇతిహాసం, వీరత్వం కలిగిన రాథోడ్స్, జవాన్స్, పవార్స్ వంటి బంజారాల పూర్వ వైభవం మళ్లీ రావాలి. వారు ఈ దేశాన్ని లీడ్ చేయాలి.చిత్ర దర్శకుడు కేశునందన్ మాట్లాడుతూ.. "ప్రకృతి పరిరక్షణ కోసం బంజారాలు చేసిన వీరోచిత పోరాటాలు, నవాబుల కాలంలో వారు ఎదుర్కొన్న కష్టనష్టాల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రముఖ రచయిత ప్రేమ్ సార్ అందించిన ఈ కథను ఎంతో సహజత్వంతో రూపొందించాం. చిత్రానికి సహజమైన అనుభూతిని తీసుకురావడం కోసం స్థానిక తండా ప్రజలను, బంజారా కమ్యూనిటీకి చెందిన విద్యావంతులను, నటీనటులను ఇందులో భాగస్వామ్యం చేశాం. కాకతీయ యూనివర్సిటీలో షూటింగ్ ప్రారంభించిన మొదటి రోజు ఎంత ఎమోషనల్‌గా ఉన్నానో, ఈ రోజు కూడా అంతే ఉద్వేగంగా ఉన్నాను. ఇందులో నా జీవితం, నా స్ట్రగుల్ ఉంది. బంజారా సమాజపు కష్టాలను, వారి గొంతుకను ప్రపంచానికి చాటిచెప్పే మాస్టర్‌పీస్ ఇది. మా చిత్రానికి ఆశీస్సులు అందించిన విజయేంద్ర ప్రసాద్ గారికి, నారాయణ మూర్తి గారికి, సముద్ర గారికి, సంజీవ్ కుమార్ గారికి నా పాదాభివందనాలు" అని తెలిపారు.

## కొత్త హిస్టరీని క్రియేట్ చేయబోతోన్న హీరోయిన్ సమంత



**వుదయం సినిమా :**

సమంత ప్రస్తుతం బ్లాక్ బస్టర్ హిట్‌తో దూసుకుపోతున్నారు. ఈక్రమంలో సమంత మరో అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకున్నారు. క్రియేటివ్ కంటెంట్ కోసం సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటూ క్రేజీ ప్రాజెక్ట్‌ల్లో సమంత భాగమవుతున్నారు. అతి పెద్ద ఓటీటీ మాధ్యమాల్లో ఒకటైన సోనీ లివ్ తమిళంలో ఓ కొత్త ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేస్తోంది. ఎంతో ఆసక్తికరమైన ఒక విషయంపై వర్క్ చేస్తున్నాం. త్వరలోనే దానిని మీ అందరితో పంచుకోవడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని అన్నారు. సోనీ లివ్ తమిళ్‌తో కలిసి సమంత చేస్తున్న ఈ ప్రాజెక్ట్ గురించి రాబోయే రోజుల్లో మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.

## ఈ నెల 10న తెలుగులో విడుదల కానున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'



**వుదయం సినిమా :**

మలయాళ టాప్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కి తెలుగు లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. రెగ్యులర్ మాస్ మసాలా సినిమాలు కాకుండా తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిలో సినిమాలు చేస్తుంటారు. రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్లో రూపొందుతున్న ప్రఖ్యాత చిత్రం ' వారణాసి' లో కూడా ఆయన ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా నటించిన చిత్రం 'ఐ, నోబడీ'. విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు నిస్సాం బషీర్ దర్శకత్వంలో జాతీయ అవార్డు గ్రహీత పార్వతి తిరువోతు తో కలిసి పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన అత్యంత ఆసక్తికరమైన యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ' జూలై 9న మలయాళంలోనూ, జూలై 10న తెలుగులోనూ గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. అగ్ర నిర్మాణ సంస్థలు శ్రీ స్రవంతి మూవీస్, మైత్రీ మూవీస్ వారు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ఈ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఉత్కంఠ భరితమైన కథ, వేగవంతమైన స్క్రీన్‌ప్లే, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందించనుంది.

## నా జీవితంలో నేను ఎప్పుడూ ఊహించనటువంటి సత్కారం ఇవాళ జరిగింది

**వుదయం సినిమా :**

**: పద్మశ్రీ డా. రాజేంద్రప్రసాద్**



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన హాస్య, విలక్షణ నటనతో కోట్లాది మంది ప్రేక్షకులను అలరించిన ప్రముఖ సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్‌ను అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మ శ్రీ' వరించింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన రెండవ విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా ఆయన ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. రాజేంద్రప్రసాద్ టాలీవుడ్‌లో కేవలం కామెడీ హీరోగానే కాకుండా, ఎన్నో సందేశాత్మక , భావోద్వేగ ప్రధానమైన చిత్రాల్లో నటించి మెప్పించారు. వెండితెరపై ఆయన పండించే నవ్వులు, చూపించే హావభావాలు తరాల తరబడి తెలుగు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ సందర్భంగా ఆయనను ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ చిరు సత్కారంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ బేల్ ట్రీ హోటల్స్ యజమాని మరియు నటుడు రాజారెడ్డి, తో పాటు శ్రీనివాస్‌రెడ్డిలు స్పాన్సర్స్ గా సహకరించారు. వారు రాజేంద్రప్రసాద్‌గారికి బొకేను అందజేసి పూలమాల వేసి శాలువా తో సత్కరించగా... ఫిలిం క్రిటిక్స్ గౌరవఅధ్యక్షులు ప్రభుగారు, అధ్యక్షులు జె.వి. బత్తుల ప్రసాద్‌రావుగారు, ప్రధాన కార్యదర్శి సురేష్‌కొండేటిగారు కలిసి బొకేను అందజేసి మొమెంటోను రాజేంద్రప్రసాద్ కి అందించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా.. చలాకీగా.. చాకచక్యంగా.. చక్కని మాటలతో తీయని తేనె వంటి పలుకులతో ఆడిటోరియంలో అందరినీ ఉత్సహపరిచారు ఫిలిం క్రిటిక్స్ ట్రెజరర్ భరద్వాజ్‌గారు. ఈ సందర్భంగా...ఫిలిం క్రిటిక్స్ గౌరవ అధక్షులు ప్రభు మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఫిలిం క్రిటిక్స్ వారు ఎన్నో కార్యక్రమాలు జరిపించారు. కానీ ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరగడానికి ప్రధాన కారణం స్పాన్సర్స్ రాజారెడ్డిగారు శ్రీనివాస్‌రెడ్డిగారు దొరకడం చాలా ఆనందం. వారు ఉండబట్టే ఈ కార్యక్రమానికి ఇంత చక్కని గ్రాండియర్ వచ్చింది. బేల్ ట్రీ హోటల్స్‌కి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఐదు దశాబ్దాలుగా మమేకమైన ఒక విశిష్టత కలిగిన నటుడు డా. రాజేంద్రప్రసాద్‌గారి గురించి ఏమి చెప్పినా తక్కువే. ఆయన నట జీవితం అనేది ఏ స్థాయి నుంచి ఏ స్థాయికి ఎదిగింది అన్న విషయం అందరికీ తెలిసిందే. ఎంతో మంది హాస్యనటులు హీరోలుగా చేశారు. కానీ మొట్టమొదటి సారిగా నాకు తెలిసి హాస్య రసానికి హీరోయిజాన్ని పరిచయం చేసింది మాత్రం రాజేంద్రప్రసాద్‌గారే. హాస్యరసాన్ని పండించాలంటే చాలా కష్టం. దానికి ఒక గౌరవ ప్రదమైన స్థానాన్ని తీసుకువచ్చారు. గొప్ప నటనా ప్రస్థానాన్ని తీసుకురావడం చాలా ఆనందం. నూతనంగా ఎన్నికైనా కార్యవర్గాన్ని నేను ఎంతగానో అభినందిస్తున్నాను. మంచి మంచి కార్యక్రమాల్ని చేసుకుంటూ వెళుతున్నందుకు ఫిలిం క్రిటిక్స్‌లోని ప్రతి ఒక్కరినీ పేరు పేరునా అభినందిస్తున్నాను అన్నారు. ఫిలిం క్రిటిక్స్ అధ్యక్షులు బత్తుల ప్రసాదరావు మాట్లాడుతూ... అందరికీ నమస్కారం పని చెయ్యడమే కానీ మాట్లాడటం రానివాడ్ని నేను. రాజేంద్రప్రసాద్‌గారి గురించి చెప్పాలంటే మా ఇంట్లో పెద్దన్న లాంటివారు. ఆయన నా కుటుంబ సభ్యులతో సమానం. ఆయన తెరమీద ఏమి ఏమి చేసేవారో నేను నిజ జీవితంలో అవన్నీ చేసేవారిని. ఆయన పేరు ప్రసాద్.. నా పేరు ప్రసాద్ ఆయన్ని సినిమాల్లో చూసి నేను బయట చాలానే చేసేవాడ్ని. ఈ సన్మానం ఆయన్ని సన్మానించినట్లు కాదు మన కుటుంబంలో ఒక వ్యక్తిగా మనల్ని మనం సన్మానించినట్లు అనుకుంటున్నాను అన్నారు.

## హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన 'సైన్ లబాన్'

**వుదయం సినిమా :**

లాంచ్ చేసిన హీరోయిన్ రాశి సింగ్
ఒకేరోజు బేగంపేట, లక్డీకాపూల్, మలక్‌పేట్‌లో మూడు అవుట్‌లెట్ల ప్రారంభం
ఈజిప్షియన్ డెజర్ట్స్‌కు నగరవాసుల నుంచి మంచి స్పందన



భారతదేశంలోనే తొలి ఈజిప్షియన్ డెజర్ట్ బ్రాండ్ 'సైన్ లబాన్' (Sign Laban) హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా అడుగుపెట్టింది. నగరంలోని బేగంపేట, లక్డీకాపూల్, మలక్‌పేట్ ప్రాంతాల్లో ఒకేరోజు మూడు అవుట్‌లెట్లను ప్రారంభిస్తూ సరికొత్త మైలురాయిని నెలకొల్పింది. ఈ గ్రాండ్ లాంచ్ కార్యక్రమానికి హీరోయిన్ రాశి సింగ్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి అవుట్‌లెట్లను ప్రారంభించారు.'సైన్ లబాన్' టీమ్‌కు శుభాకాంక్షలు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో అంతర్జాతీయ స్థాయి డెజర్ట్స్‌ను ఆస్వాదించే ఉత్తమ గమ్యస్థానంగా 'సైన్ లబాన్' నిలుస్తుంది" అని తెలిపారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.